Pubilshed from Ananthapuramu
PRGI NO : APTEL/2023/90641

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




అనంతపురము ANATHAPURAMU | సంపుటి : 04 Vol.No : 04 | సంచిక : 47 Issue No : 47 | బుధవారం Wednesday | ఆగస్టు 26, 2026 26 AUGUST 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana





## వీరు రవాణా శాఖ అధికారులా..

# బందిపోటు దొంగలా..?

- వీరికున్న అధికారం ఏ మేరకు...
- వీరికి దాడిచేసే అధికారం కూడా ఉంటుందా...
- అనుమానాలు ఉంటే పరిశీలన చేయొచ్చు...
- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకోవచ్చు...
- ఇలా భౌతిక దాడి చేయడం వీరి ఉద్యోగ ధర్మంలో ఉందా...!
- ఎవడిచ్చాడు ఇలాంటి అధికారం వీరికి...
- ఏ చట్టం చెబుతోంది ఇలా ప్రవర్తించమని...
- అసలు వీరికున్న పరిమితులు ఎంత వరకు...
- లారీ డ్రైవర్ ది తప్పే అయ్యుండచ్చు...
- ఇంత నిక్కచ్చిగా ఉద్యోగం చేస్తే రోడ్డు ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి...
- అక్రమ రవాణాలు ఎలా నడుస్తున్నాయి..
- బియ్యం,ఇసుక,మట్టి, కుళ్ళిన చికెన్ ఎలా రోడ్లెక్కి వస్తున్నాయి...
- ఓహో అలాంటివన్నీ కనిపించవేమో గా...
- ఇలాంటి అధికారుల వల్లే ఈ దేశం ఇలా అయ్యేది...
- లంచాల కోసమా...లేదా అధికార దర్పం కోసమా...
- ఓ మహిళా అధికారి అయ్యి కూడా ఇలా చేస్తారా...
- ఈ ప్రభుత్వాలు ఇలానే ఉంటాయా... - ఇదేమి రాజ్యాంగం రా నాయన...

(రామమోహన్ రెడ్డి)

రవాణా శాఖ అధికారులు మోటార్ వెహికల్ చట్టం (వీశీశీతీ ఎవష్ట్రఱఛషశ్రీవరాజాష్, 1988) ప్రకారం వాహనాల తనిఖీ, నియంత్రణ మరియు చట్టాల అమలుకు సంబంధించిన అధికారాలను కలిగి ఉంటారు.సరైన పత్రాలు, లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్ మరియు పర్మిట్లు లేని వాహనాలను తనిఖీ చేయడం మరియు సీజ్ చేయడం.అనుమతికి మించి అధిక బరువు లేదా లోడ్‌తో వెళ్తున్న వాహనాలను ఆపడం మరియు జరిమానాలు విధించడం. రోడ్డు పన్నులు (Road Tax) మరియు ఇతర ఫీజులు చెల్లించని వాహనాలపై జరిమానాలు విధించడం, అవసరమైతే వాహనాలను నిలిపివేయడం.కొత్త డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయడం, రద్దు చేయడం మరియు వాహనాల రిజిస్ట్రేషన్ పనులను పర్యవేక్షించడం.

2 లో

## ఏపీలోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జున రావు ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం విజయవాడ లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ఏపీ లోకాయుక్తగా ప్రమాణం చేయించారు.

వివరాలు 2లో..



## నకిలీ డాక్టర్ల గుట్టురట్టు


- 11మంది అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ : హైదరాబాద్‌లో 11 మంది నకిలీ డాక్టర్లు అరెస్ట్ కావడం తీవ్ర కలకలం రేపింది. ఎలాంటి వైద్య అర్హతలు లేకుండానే ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న భారీ నకిలీ డాక్టర్ల ముఠా గుట్టును సిటీ పోలీసులు రట్టు చేశారు. అందిన సమాచారం మేరకు .... నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో పోలీసులు దాడులు నిర్వహించారు. డాక్టర్లుగా చలామణి అవుతున్న 11 మంది నకిలీ వైద్యులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కనీస వైద్య విద్య, గుర్తింపు పొందిన డిగ్రీలు లేకపోయినా.. పెద్ద పెద్ద ప్రిస్క్రిప్షన్ రాస్తూ, ఇంజెక్షన్లు, యాంటీబయాటిక్స్ ఇస్తూ సామాన్య ప్రజలను మోసగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

## అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

### భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట

- 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా
- 181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి
- మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి: ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు.

పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు.

2 - పేజీలో..

## అనంతపురం అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ ఎనర్జీ

- నారా లోకేశ్ రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 4 వేల మందికి పైగా ఉపాధి
- పునరుత్పాదక ఇంధనంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం
- సుజ్లాన్ భాగస్వామ్యంతో 12 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు



ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్టులు ఈ ప్రయాణంలో ఒక నూతన అధ్యాయానికి నాంది

- మిగతా 2లో..



## తాటి వనం..తీరానికి రక్షణ కవచం

### గ్రేట్ గ్రీన్ వాల్ రెండో అంచెలో తుపాను గాలి నిరోధక వ్యవస్థగా తాటి చెట్లు

- తాటి గింజల సేకరణ, నాటే ప్రక్రియ ప్రారంభం
- 5,499 హెక్టార్ల విస్తీర్ణంలో 55 లక్షల తాటి గింజలు నాటడం లక్ష్యం
- సీజన్ ప్రారంభంలోనే 13 లక్షల తాటి గింజలు సేకరించిన అటవీ శాఖ
- తాటి వనాల ఏర్పాటు ప్రక్రియలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు

2 లో..

## అన్నవరం వ్రత పురోహితుల తీరుపై భక్తుల ఆవేదన

### దానాల పేరుతో భక్తులను భయబ్రాంతులకు గురిచేస్తున్నారంటూ ఆరోపణలు

ప్రజాభూమి ప్రతినిధి,అన్నవరం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వ్రతాలు నిర్వహించుకునేందుకు వచ్చే భక్తులకు కొందరు వ్రత పురోహితులు దానాల పేరుతో ఇబ్బందులు కలిగిస్తున్నారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వ్రతం పూర్తయిన అనంతరం దానాల పేరుతో అదనపు మొత్తాలు ఇవ్వాలని ఒత్తిడి చేయడమే కాకుండా, డబ్బులు ఇవ్వకపోతే దేవుని అనుగ్రహం ఉండదన్న విధంగా మాట్లాడుతున్నారని కొందరు భక్తులు ఆరోపిస్తున్నారు.





దీంతో భక్తులు భయబ్రాంతులకు గురవుతున్నారని, స్వామివారి వ్రతాన్ని ప్రశాంతంగా చేసుకునే పరిస్థితి లేకుండా పోతోందని వాపోతున్నారు. దూర ప్రాంతాల నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో అన్నవరం వచ్చే భక్తులు వ్రతం అనంతరం ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం బాధాకరంగా ఉందని పేర్కొంటున్నారు. దేవస్థానం నిర్ణయించిన రుసుములు చెల్లించిన తర్వాత కూడా అదనంగా డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం సరికాదని భక్తులు అంటున్నారు. అదేవిధంగా వ్రత మండపాల పరిసరాల్లో పనిచేసే కొందరు శానిటేషన్ సిబ్బంది కూడా వ్రతం చేసుకున్న భక్తులతో అనుచితంగా వ్యవహరిస్తున్నారంటూ ఫిర్యాదులు వినిపిస్తున్నాయి.భక్తుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై దేవస్థానం అధికారులు తక్షణమే స్పందించి వ్రత మండపాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించాలని భక్తులు కోరుతున్నారు.

వివరాలు 2లో..

ప్రజాభూమి
బుధవారం, ఆగస్టు 26, 2026


# తాటి వనం..తీరానికి రక్షణ కవచం

**ప్రజాభూమి ప్రతినిధి అమరావతి :** సుదీర్ఘ తీర ప్రాంతానికి సహజ రక్షణ కవచం ఏర్పాటు దిశగా ఉప ముఖ్యమంత్రి,అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తీసుకున్న గ్రేట్ గ్రీన్ వాల్ సంకల్పంలో కీలకమైన తాటి వనాల ఏర్పాటు ప్రక్రియ మొదలయ్యింది. తాటి కాయల సీజన్ ప్రారంభం కావడంతో తాటి గింజల సేకరణ, నాటే కార్యక్రమానికి రాష్ట్ర అటవీ శాఖ శ్రీకారం చుట్టింది. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రకృతి విపత్తుల సమయంలో గాలి నిరోధక వ్యవస్థగా తాటి వనాలు తీర ప్రాంత గ్రామాలకు తీవ్ర గాలుల నుంచి రక్షణ కల్పించనున్నాయి. మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ఏర్పాటు ప్రక్రియలో తాటి వనాల ఏర్పాటుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఉప్పు నీరు, హోరు గాలులతో ఉండే తీర ప్రాంతాల కఠిన వాతావరణ పరిస్థితులకు తాటి చెట్టు అత్యంత అనుకూలమైన వృక్ష జాతి. ఉప్పు నేలలు, ఇసుక, బుసకతో కూడిన తీర ప్రాంత ఒండ్రు నేలల్లో సైతం పెరిగే సామర్థ్యం తాటి చెట్టుకు ఉంది. ఎత్తుగా పెరిగే జాతి కావడంతో బలమైన సముద్ర గాలులకు సహజ నిరోధక వ్యవస్థగా పని చేస్తుంది. అంతే కాదు బలమైన తాటి వేర్లు నేలను గట్టిగా పట్టి ఉండడం వల్ల తీర ప్రాంతాల్లో కోత నిరోధక వ్యవస్థగా కూడా ఉంటుంది. పక్షులు, కొన్ని రకాల సరిసృపాలకు ఆవాసంగా ఉండే తాటి చెట్లు జీవ వైవిధ్యానికి ప్రతీకగా ఉంటాయి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని కూడా తట్టుకోగల శక్తి తాటి చెట్టు సొంతం. అందుకే పవన్ కళ్యాణ్ రూపొందించిన మూడంచెల గ్రేట్ గ్రీన్ వాల్ ప్రణాళికల్లో మొదటి అంచె మడ అడవులకు, రెండో అంచె తాటి వనాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

రాష్ట్రవ్యాప్తంగా తీర ప్రాంతం వెంబడి 5,499 హెక్టార్ల పరిధిలో తాటి వనాల ఏర్పాటును లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అందుకు దాదాపు 55 లక్షల తాటి గింజలు అవసరం అవుతాయని అటవీ శాఖ భావిస్తోంది. ఈ ఏడాది తాటి కాయల సీజన్ మొదలైన నాటి నుంచి ఇప్పటి వరకు గ్రామీణ ప్రజలు, వివిధ వ్యవస్థల భాగస్వామ్యంతో 13 లక్షల తాటి గింజలు సేకరించారు. ఇప్పటికే 1 లక్ష 65 వేల తాటి గింజలను పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు, స్కూలు విద్యార్థులు, ప్రజల భాగస్వామ్యంతో నాటే ప్రక్రియను రాష్ట్ర అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. ఈ సీజన్‌లో పవన్ కళ్యాణ్ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్న బలమైన సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్టు ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

తాటి గింజల సేకరణ, నాటడం, తాటి మొక్కల పెంపకం వంటి అంశాల్లో రాష్ట్ర అటవీ శాఖకు ప్రజలంతా సహకరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు. మొలకెత్తే తాటి మొక్కల స్వీయ సంరక్షణ చర్యలు చేపట్టాలని, మొలకెత్తిన మొక్కల పైకి పశువులను తోలడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. విలువైన సహజ సంపదను కాపాడుకునే చర్యల్లో అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక ప్రజలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. తీర ప్రాంతాల వెంబడి అనుకూల ప్రదేశాల్లో శాస్త్రీయ పద్ధతిలో తాటి గింజల నాటాలని పేర్కొన్నారు. గ్రేట్ గ్రీన్ వాల్‌తోపాటు 50 శాతం గ్రీన్ కవర్, పర్యావరణ పునరుద్ధరణ, రాష్ట్రంలో సహజ వనరుల పరిరక్షణ చర్యల్లో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించే ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## ఏపీలోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరై జస్టిస్ మల్లిఖార్జునరావుకు అభినందనలు తెలిపారు. లోకాయుక్తగా బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం లోక్ భవన్ లో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు గవర్నర్, ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



## అన్నవరం వ్రత పురోహితుల తీరుపై భక్తుల ఆవేదన

దానాల పేరుతో భక్తులను ఎవరైనా ఒత్తిడికి గురిచేస్తున్నారా, భయభ్రాంతులకు గురిచేస్తున్నారా అనే అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడే విధంగా దేవస్థానం అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, వ్రతాలు చేసుకునే ప్రతి భక్తుడికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## నకిలీ డాక్టర్ల గుట్టురట్టు

వీరిలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో ప్రైవేట్ క్లినిక్‌లు నడపడమే కాకుండా, మరి కొందరు ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల పేర్లను వాడుకుంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు విచారణలో తేలింది. వీరి క్లినిక్‌ల నుంచి భారీ ఎత్తున నకిలీ లెటర్‌హెడ్‌లు, అనుమతి లేని మందులు, వైద్య పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అమాయక ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ఇలాంటి నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, అర్హత లేని వ్యక్తుల వద్దకు వెళ్లి చికిత్సలు చేయించుకోవద్దని ప్రజలకు పోలీసు ఉన్నతాధికారులు విజ్ఞప్తి చేశారు.

### వీరు రవాణా శాఖ అధికారులా...

# బందిపోటు దొంగలా..?

మొదటి పేజీ తరువాయి

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి భద్రతా చర్యలను అమలు చేయడం మరియు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం.వీరి ప్రధాన బాధ్యతలు.దీనితో పాటు మోటారు వాహన చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించే లేదా చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం మాత్రమే అధికారులకు ఉంటుంది.ఏ అధికారికీ ఎవరిపై కూడా చేయి చేసుకునే లేదా హింసించే అధికారాన్ని భారతీయ చట్టాలు లేదా మోటారు వాహనాల చట్టం కల్పించలేదు.డ్రైవర్ తప్పు చేసినా, వాహనం ఆపకపోయినా అధికారులకు కేవలం చట్టపరంగా కేసు నమోదు చేసే హక్కు మాత్రమే ఉంది, కానీ దాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కొట్టడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ హక్కు లేదని భారత రాజ్యాంగ వ్యవస్థ ద్వారా స్పష్టం గా తెలియవస్తుంది.

అధికారులు చట్టాన్ని అతిక్రమించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే, బాధితులు లేదా ప్రజలు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి స్పష్టమైన మార్గాలు ఉన్నాయి.రవాణా శాఖ కమిషనర్ లేదా రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయానికి లిఖితపూర్వకంగా ఆధారాలతో సహా ఫిర్యాదు చేయవచ్చు.లంచం డిమాండ్ చేసినా లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడినా అవినీతి నిరోధక శాఖ (ూాత్‌అ-జశీతీతీబజూ్‌అశీఅ దీబతీమ్మబ) టోల్-ఫ్రీ నంబర్లకు లేదా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.ప్రభుత్వ స్పందన లేదా ప్రజా ఫిర్యాదుల వేదికల ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయవచ్చు.ఇంకా అధికారుల అక్రమాలపై హైకోర్టులో రిట్ పిటిషన్ లేదా లోకాయుక్తను ఆశ్రయించే హక్కు పౌరులకు ఉంటుంది.

అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా రవాణా శాఖలో అనవసర నిబంధనలను తక్షణమే తొలగించాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో ఉపయోగించి ప్రజలకు సులభతరమైన, అవినీతి రహిత సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష సందర్భంగా ఆయన రవాణా శాఖలో చేపట్టాల్సిన సంస్కరణలపై కీలక సూచనలు చేశారు. రవాణా శాఖలో సంస్కరణలకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 24 గంటల్లో డీమ్డ్ రిజిస్ట్రేషన్ విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ ఏర్పాటు, ఫారం-5బీ వంటి పరీక్షల తొలగింపు ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా చూడవచ్చని తెలిపారు. ఈ చర్యలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. దశలవారీగా ఈ సంస్కరణలను అమలు చేసేందుకు తాము ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పగా, వీలైనంత త్వరగా అనవసర నిబంధనలను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేని వ్యవస్థను రూపొందించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఇప్పటి వరకు చెప్పబడిన అంశాలు రవాణా శాఖ అధికారుల పరిధి,చట్టం న్యాయం,ధర్మం ఏమిటి ప్రభుత్వం నిర్దేశించిన అంశాలు ఆదేశాలు అమలు తీరు ఏమిటన్నది స్పష్టం గా వివరించడం జరిగింది.ఇక అసలు విషయానికి వస్తే విశాఖ జిల్లా గాజువాక ప్రాంతం షీలానగర్ మారుతి నగర్ జంక్షన్ వద్ద రవాణా శాఖ ఇన్స్పెక్టర్ మేడం పార్వతీ లారీల తనిఖీలు నిర్వహిస్తూ ఉన్నారు.ఈ నేపథ్యంలో అటుగా వస్తున్న ఓ లారీని ఆపే ప్రయత్నం చేయగా ఆ లారీ డ్రైవర్ లారీని ఆపకుండా ముందుకు వెళ్ళడం జరిగినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న దృశ్యాలు చూసి అర్థం అవుతుంది.అయితే లారీ ఆపకుండా ముందుకు వెళ్తే సహజంగా ఏ అధికారుల కయినా అనుమానాలు వ్యక్తం అవ్వడం సహజమే.అయితే మేడం పార్వతీ కి కోపం ఆవేశం ఆగ్రహం అన్ని వచ్చినట్లు ఉన్నాయేమో వెంటనే తన కారు డ్రైవర్ ను పిలిచి ఆపకుండా వెళ్ళిన లారీని వెంబడించి నిలుపుదల చేయడం జరిగింది ఇదేమి సినిమా కాదు గా లోడ్ తో వెళ్తున్న లారీ గాజువాక లాంటి ప్రాంతాల్లో ఏ మేర స్పీడ్ వెళ్తుందనేది అందరికీ తెలిసిందే.అయితే ఇక్కడ లారీని నిలుపుదల చేసిన వెంటనే సాధారణంగా తనకు అవసరం అనుకుంటే స్థానిక పోలీసుల సహకారం తీసుకుని ఆ లారీ కి సంబంధించి అన్ని రకాల అనుమతులు ఉన్నాయో లేదో పరిశీలన చేసి ఏదయినా అనుమానం ఉన్నా లేక సమాజానికి హాని కలిగించే వస్తువుల రవాణా జరుగుతుందని భావిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు.కానీ ఇక్కడ అలా జరగకుండా మేడం పార్వతీ కారు డ్రైవర్ మేడం పార్వతీ సాక్షిగా లారీ డ్రైవర్ ని కొట్టడం ,అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం తెలిసిందే.దీనిని బట్టి ఈ అధికారుల తీరుపై ప్రజా బాహుళ్యంలో అనేక రకాల ప్రశ్నలు ఉత్పన్నం మవుతున్నాయి

మొదటగా అధికారం అనేది చట్టానికి లోబడి ఉండాలి. డ్రైవర్ లారీని ఆపకుండా ముందుకు వెళ్ళడం వల్ల ప్రమాదం తెచ్చిపెడుతున్నారని బావించి నట్లయితే అందుకు తగిన చర్యలు తీసుకోవడం అనేది సహజ న్యాయ సూత్రం కానీ ఇక్కడ అలా జరగలేదు. లారీ డ్రైవర్ పై భౌతిక దాడికి పాల్పడం చట్టాన్ని చేతిలోకి తీసుకుని చట్ట అతిక్రమణ చేశారని తెలుస్తోంది.అలాగే ఏ నిబంధన కింద అతనిపై రక్తం చిందించెంత దారుణంగా కొట్టినట్లు సోషియల్ మీడియా లో కోడై కూస్తున్న అంశం బట్టి చెప్పవచ్చు.ఇలా కొట్టడానికి రవాణా శాఖ కు కానీ భారత రాజ్యాంగం లో ఎక్కడా ఇలాంటి అధికారులకు విచక్షణాధికారాలు కట్టబెట్టినట్లు లేదని తెలిసిందే.మరి ఇలాంటి పరిస్థితులలో తమ లేని అధికారం ఉపయోగించి ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఇలాంటి చర్యలకు పాల్పడిన అధికారులను ఉద్యోగం నుంచి తొలగించవలసిన అవసరం ఎంతయినా ఉందని సామాన్య ప్రజలు నుండి వాదన వినిపిస్తోంది.అలాగే ఇంత నిక్కచ్చిగా ఉద్యోగం చేసే ఇలాంటి అధికారులు ఉన్నప్పుడు రోడ్లపై తిరిగే ఇసుక,మట్టి,రేషన్ అక్రమ రవాణాలు,ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న కుళ్ళిన కోడి వ్యర్థాలు కనపడడం లేదా ఆ అక్రమార్కులు విసిరే నోట్లు వీరి కళ్ళకు అడ్డంకిగా మారాయా అన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.లంచాల కోసం లేక అధికార దర్పం కోసం ఇలాంటి జులుం ప్రదర్శించే అధికారుల తీరు వలన నిజాయితీ కలిగి ఉన్న అధికారుల కు కూడా చెడ్డ పేరు వస్తుందన్న ఆవేదన కూడా అదే శాఖలో ఉన్న కొంతమంది అధికారుల నుంచి వ్యక్తం అవుతోంది.ఓ మహిళా అధికారి అయ్యి కూడా ఇలా చేస్తారా అని సామాన్య ప్రజలు ఆలోచన లో పడ్డారన్న విషయాలు బహిర్గతం అవుతుంటే ఈ సమాజం ఇంతకంటే ఏమి చేయగలుతుందా అని అనుకుంటున్నారు మేధావి వర్గాలు. ప్రభుత్వం ఈ సంఘటన పై పూర్తి స్థాయి విచారణ చేసి చట్టాన్ని అతిక్రమించిన ఏ ఒక్కరిని ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

మొదటి పేజీ తరువాయి

వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

**2027 పుష్కరాలకు భారీగా భక్తులు :** 2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

**టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి :** గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

**రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం :** ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

**మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి :** గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్డు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం--పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

**అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు :** గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### అనంతపురం అంటే కియా కార్లు,

# ఫైటర్ జెట్లు, సుజ్లాన్ ఎనర్జీ

పలుకుతున్నాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం, కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ.. సుజ్లాన్‌తో ఏపీకి ఉన్న రెండు దశాబ్దాల బంధం పునరుద్ధరణ కావడం సంతోషంగా ఉందన్నారు.

స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే దానిపై నమ్మకం ఉంచి, దేశ ఇంధన స్వావలంబనకు పునాదులు వేసిన దివంగత తులసి తంతిని ఈ సందర్భంగా స్మరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఆయన దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడిందని గుర్తుచేశారు. భారత పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థ సుజ్లాన్ అని కొనియాడారు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, నిబద్ధతతో కూడిన సంస్కృతితో సుజ్లాన్ సంస్థ నిలదొక్కుకుందని ప్రశంసించారు.

గత ఐదేళ్లలో (2019-24) రాష్ట్రంలో పవన విద్యుత్ రంగం పూర్తిగా నిలిచిపోయిందని, కేవలం 6 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే అదనంగా చేరిందని లోకేశ్ విమర్శించారు. నేడు ఒక్క అనంతపురంలోనే సుజ్లాన్ యూనిట్‌కు ఏటా 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉందని, ఇక్కడ ప్రత్యక్షంగా 1,200 మందికి ఉపాధి లభిస్తోందని, వారిలో 70 శాతానికి పైగా స్థానికులేనని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలు సృష్టించిందని వివరించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల ద్వారా 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. దీని కోసం సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడి వస్తుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే ఏపీలో సుజ్లాన్‌కు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, మరో 2,700 మెగావాట్లు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 6.5 గిగావాట్ల డేటా సెంటర్ల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని, వీటికి నిరంతరాయ విద్యుత్ అందించడానికి సౌర, పవన, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయడం అత్యంత కీలకమని లోకేశ్ అన్నారు. ఈ డిజిటల్ మౌలిక వసతుల కోసం సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాలు సృష్టించవచ్చని అంచనా వేశారు.

"క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చి, ప్రపంచానికి ఎగుమతి చేసేలా ఏపీని 'క్లీన్ ఎనర్జీకి సౌదీ అరేబియా'గా తీర్చిదిద్దడమే మా అంతిమ లక్ష్యం," అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్య సాధనలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటోమొబైల్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేవలం ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, దాని చుట్టూ పూర్తి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ విధానమని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12 వేల మంది యువతకు గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వనున్నాయని, ఇందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. ఉరవకొండ, విజయవాడలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఈ రంగానికి అవసరమైన నిపుణులను సిద్ధం చేస్తాయని అన్నారు. ఒకప్పుడు ఉపాధి కోసం వలస వెళ్లే అనంతపురం జిల్లాకు ఇప్పుడు కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ కొత్త చిరునామాగా మారాయని లోకేశ్ అన్నారు. విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఇది సాధ్యమైందని, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం అనంతపురానికి వచ్చే రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు.

తన పాదయాత్రలో కియా పరిశ్రమ ఎన్నో కుటుంబాల్లో వెలుగు నింపడం చూశానని, అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని లోకేశ్ గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కంపెనీలను తీసుకురావడం తమ బాధ్యత అని, అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత అని పిలుపునిచ్చారు. "ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఏపీపై విశ్వాసం ఉంచిన సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. పెట్టుబడిదారులు మా ప్రభుత్వ వేగాన్ని, నిబద్ధతను నమ్మండి. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించుకుందాం" అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

# మేయర్ రేసులో మాటల మలుపు

## బండి రామకృష్ణ 'శాంతి మంత్రం'.. వెనుక రాజకీయ వ్యూహమా? పోటీకి ఎవరైనా ఓకే.. విభేదాలు చిన్నవే అంటున్న బండి రామకృష్ణ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

మచిలీపట్నం మేయర్ పీఠం చుట్టూ జనసేనలో మొదలైన రాజకీయం రోజో మలుపు తిరుగుతోంది. నిన్నటివరకు తీర్మానాలు, అభ్యంతరాలు, వర్గపోరుతో వేడెక్కిన 'బందరు' జనసేన రాజకీయం.. నేత బండి రామకృష్ణ చేసిన వ్యాఖ్యల తో ఒక్కసారిగా కొత్త రూపు సంతరించుకుంది. హామీ ఇవ్వలేదు.. పోటీకి ఎవరైనా ఓకే!మేయర్ పదవిపై తాజాగా స్పందించిన బండి రామకృష్ణ.. ఆ పదవికి పార్టీలో ఎవరైనా పోటీ పడొచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంతేకాక, "తనకు మేయర్ పదవి ఇప్పిస్తానని కొట్టే వెంకట్రావుకు తాను ఎప్పుడూ హామీ ఇవ్వలేదు" అని తేల్చిచెప్పడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక్కడే అసలు ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇటీవల మేయర్ అభ్యర్థిగా బండి రామకృష్ణ పేరుతో ఒక వర్గం తీర్మానం చేసి సంతకాలు సేకరిం చడం, మరోవైపు తనను సంప్రదించకుండా ఈ నిర్ణయం ఎలా తీసుకుంటారంటూ కొట్టే వెంకట్రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం విదితమే. ఈ వివాదం కాస్త ఘర్షణలకు కూడా దారితీసింది. వివాదాన్ని చల్లార్చే వ్యూహ మా?ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణ పైనా బండి రామకృష్ణ స్పందించిన తీరు రాజకీయ వర్గాలను ఆశ్చర్యప రిచింది. "కొట్లాటల్లో ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు సహజమే.. ఇవన్నీ చాలా చిన్న విషయాలు" అంటూ వివాదం తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేశారు. "మళ్లీ మేం కలిసిపో తాం.. కలిసి ఉంటాం" అని ప్రకటించడం ద్వారా కొట్టే వెంకట్రా వుతో తమకున్న విభేదాలు శాశ్వతం కాదని సంకేతాలిచ్చారు.అంటే.. మేయర్ పదవి పోటీ అనేది వేరే అంశం, వ్యక్తిగత సంబంధాలు వేరే అంశం అన్నట్లుగా రామకృష్ణ సంకేతాలి స్తున్నారు. చివ రి నిర్ణయం జనసేనానిదేనా? అయితే బండి రామకృష్ణ మాటల వెనుక ఉన్న అసలు మర్మమేంటి?నిజంగానే ఇది జనసేనలో విభేదాలకు ముగింపు పలికే ఆత్మీయ అడుగునా? లేక మేయర్ పదవిపై అధిష్టానం తుది నిర్ణయం ప్రకటించే వరకు వాతావరణాన్ని చల్లార్చే సమయోచిత రాజకీయ వ్యూహమా? మేయర్ పదవికి పోటీ తెరచుకుందే ఉంది అంటున్న రామకృష్ణ.. వెంకట్రావుతో మళ్లీ కలిసిపోతామం టున్నారు. మరి జనసేన అధిష్టా నం చూపు ఎవరివైపు ఉందో, ఆ మేయర్ కుర్చీ చివరికి ఎవరిని వరిస్తుందో తెలియాలంటే వేచి చూడాల్సిందే. ప్రస్తుతానికి మచిలీపట్నం జనసేన రాజకీయం అంతా పార్టీ అధిష్టానం తీసుకునే తుది నిర్ణయంపైనే ఆధారపడి ఉంది!






## మచిలీపట్నం జనసేనలో మేయర్ పీఠం రగడ రెండుగా చీలిపోయిన నేతలు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో జనసేన పార్టీ రాజకీయాలు వేడెక్కాయి. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిత్వం చుట్టూ తిరుగుతున్న విభేదాలు చివరకు పార్టీ రెండు వర్గాలుగా విడిపోయేలా చేశాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండి రామకృష్ణ వైఖరికి వ్యతిరేకంగా కొట్టె వెంకట్రావ్ వర్గీయులు శ్రేణులతో కలిసి కాలినడకన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి కార్యాలయానికి 300 మందితో కలిసి కాలినడకన తరలివెళ్లడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గత రెండు రోజుల క్రితం తనపై జరిగిన దాడి ఘటనపై కొట్టె వెంకట్రావ్ ఎంపీ బాలశౌరికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనపై దాడికి పాల్పడిన నగర అధ్యక్షుడు గడ్డం రాజును తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, ఆయన ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయాలని కొట్టె వర్గీయులు గట్టిగా డిమాండ్ చేశారు. అయితే, కొట్టె వెంకట్రావ్ వర్గీయులతో జరిగిన చర్చల్లో ఎంపీ బాలశౌరి ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా మౌనం వహించడమే కాకుండా, ఈ వ్యవహారాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పి దాటవేసే ధోరణి ప్రదర్శించినట్లు తెలుస్తోంది.ఈ సందర్భంగా కొట్టె వర్గీయులు హెచ్చరిస్తూ గడ్డం రాజుపై అధిష్టానం తక్షణమే క్రమశిక్షణా చర్యలు తీసుకోని పక్షంలో, తమ భవిష్యత్ కార్యాచరణను తామే సొంతంగా ప్రకటించుకుని దానికి అనుగుణంగా ముందుకెళ్తామని తేల్చిచెప్పారు. మేయర్ సీటు కోసం సాగుతున్న ఈ అంతర్గత పూచికత్తులతో బందరు జనసేనలో రాజకీయ వాతావరణం మరింత క్షీణించింది.

## మిలాద్-ఉన్-నబి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



మిలాద్–ఉన్–నబి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయు డు జిల్లా ప్రజలకు, ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవక్త ముహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ జరుపుకునే ఈ పర్వదినం శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, మానవతా విలువల మరియు సమాజ సేవ వంటి గొప్ప సందేశాలను అందిస్తుందని పేర్కొన్నారు.ఎస్పీ తెలిపిన ముఖ్యాంశాలు:గొప్ప బోధనలు: ప్రవక్త ముహ మ్మద్ బోధనలు న్యాయం, సమానత్వం, దయ, సహనం, పరస్పర గౌరవం మరియు శాంతిని పెంపొం దించే చేలా మార్గనిర్దేశం చేస్తాయి.సోదరభావం: ఈ దివ్య విలువలను జీవి తంలో ఆచరించడం ద్వారా సమా జంలో ప్రేమ, ఐక్యత మరింత బలపడతాయి.మత సామరస్యం: జిల్లా ప్రజలందరూ మత సామ ర స్యాన్ని, శాంతి భద్రతలను కాపాడుతూ మిలాద్–ఉన్–నబి పండు గను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతా వ రణంలో సంతోషంగా జరుపుకోవాలి.ఈ పర్వదినం ప్రతి కుటుం బంలో ఆనందాన్ని, ప్రతి హృద యంలో శాంతిని నింపాలని ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆకాం క్షించారు.

## సర్ విచారణలో వాస్తవ నిర్ధారణకే ప్రాధాన్యం

- నోటీసులపై అత్యంత పారదర్శకంగా విచారణ
- అర్హత ఉన్న ప్రతి ఓటరు ఓటు హక్కు పరిరక్షణ
- అధికారుల సమన్వయంతో సజావుగా సర్ ప్రక్రియ..
- క్షేత్రస్థాయిలో పర్యటించిన రోల్ అబ్జర్వర్ ఎంవీ శేషగిరిబాబు



ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీచేసిన ఓటర్లకు సంబంధించి విచారణ ప్రక్రియను అధికారులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. నోటీసులో పేర్కొన్న అంశాలను సంబంధిత ఓటర్లకు వివరించి, వారి వివరణను పూర్తిగా విని, అవసరమైన ఆధారాలు, పత్రాలను పరిశీలిస్తున్నారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహించిన పరిశీలన, సమర్పించిన నివేదికలను పరిగణనలోకి తీసుకుని వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుంటున్నారు. సోమవారం విజయవాడ తూర్పు నియోజకవర్గంలో అయ్యప్పనగర్, మధ్య నియోజకవర్గంలో అజిత్‌సింగ్ నగర్‌లోని ఏఈఆ ర్వో కార్యాలయాల్లో ఐఏఎస్ అధికారి, రోల్ అబ్జర్వర్ ఎంవీ శేషగిరిబాబు.. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి పర్యటించారు. సర్ నోటీసులపై జరుగుతున్న విచా రణ ప్రక్రియను పరిశీలించారు. హియరింగ్ సమయంలో నోటీసులో పేర్కొన్న అంశాలపై వారి వివర ణను పూర్తిగా వింటున్న తీరును పరిశీలించారు. ఓటర్లు సంబంధిత చిరునామాలో నివసిస్తున్నారా, రికార్డుల్లో ఏవైనా పొరపాట్లు ఉన్నాయా, అవసరమైన ఆధారాలు, పత్రాలు సమర్పిస్తున్నారా, అలాగే బీఎల్వోలు, అధికారుల ఫీల్డ్ వెరిఫికేషన్ నివేదికలను పరిగణనలోకి తీసుకుంటున్న విధానాన్ని సమీక్షించారు. గర్భిణీలు, మంచానికే పరిమితమైన వారు, ఆరోగ్య పరిస్థితుల కారణంగా విచారణకు హాజరుకాలేని ఓటర్లు, ఇతర రాష్ట్రాలు లేదా దేశాల్లో ఉన్న ఓటర్లు తదితర కేసుల్లో సంబంధిత వ్యక్తుల వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు అధికారులు చేపడుతున్న చర్యల గురించి అడిగారు. అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే నియమనిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకో వాల్సి ఉన్నందున ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకత, జవాబుదారీ తనం తో ప్రక్రియలో భాగస్వాములయ్యేలా బీఎల్వోలు, క్షేత్రస్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన ప్రతి ఓటరు ఓటు హక్కును పరిరక్షించడమే ప్రక్రియ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని రోల్ అబ్జర్వర్ శేషగిరిబాబు స్పష్టం చేశారు.1,90,348 నోటీసుల పంపిణీ: ఇప్పటివరకు 1,90,348 నోటీసుల పంపిణీ జరగ్గా.. వీటిలో 75,471 మందికి విచారణ నిర్వహిం చడం జరిగింది. 58,895 మందికి విచారణ షెడ్యూలు గడువు ముగియగా విచారణ కోసం రీషెడ్యూల్ చేయడం జరుగుతోంది. కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## నాయకుడి చొరవతో పేదలకు కొండంత అండ 11 మందికి సీఎంఆర్ఎఫ్ సాయం అందజేత

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా



వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) కొండంత అండగా నిలుస్తోంది. మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోని 11 మంది బాధిత కుటుంబాలకు రూ.9,27,729 ఆర్థిక సాయం మంజూరైనట్లు పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి తెలిపారు.ఎంపీ బాలశౌరి ప్రత్యేక చొరవ తీసుకొని చేసిన సిఫారసుల మేరకు ఈ ఆర్థిక సాయం మంజూరైంది.

ఇందుకు సంబంధించిన చెక్కులు, ఎల్ఓసీ (LOC)లను లబ్ధిదారులకు త్వరితగతిన పంపిణీ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.లబ్ధిదారులు – పొందిన సహాయం వివరాలు:సిరిగినీడి వరలక్ష్మి: రూ. 4,20,000దేవరపల్లి రత్నమోహనరావు: రూ. 72,254ఉయ్యాల సోమజన్య (చిన్నారి): రూ. 71,791సురే వర్షిణి: రూ. 70,918గౌరిశెట్టి దుర్గాభవాని: రూ. 68,476తోట హైమవతి: రూ. 43,550చలమలశెట్టి పవన్ కుమార్: రూ. 42,330లక్ష్మి సావిత్రి మెందు: రూ. 37,900మరుబోయిన వెంకటేశ్వరరావు: రూ. 35,786కత్రగడ్డ దామోదరరావు: రూ. 32,610పుల్లేటి నాగరాజు: రూ. 32,114అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అత్యవసర వైద్య సాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంపీ స్పష్టం చేశారు. బాధితులకు మంజూరైన మొత్తాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.



## అనకాపల్లిలో అక్రమ మైనింగ్ దందా..!

### రాత్రింబవళ్లు కొండల తవ్వకాలు.. వందలాది ట్రాక్టర్లలో గ్రావెల్ తరలింపు!



ప్రజాభూమి ప్రతినిధి:-అనకాపల్లి:

ప్రకృతి సంపదకు నిలయమైన అనకాపల్లి జిల్లాలో అక్రమ మైనింగ్ ఆరోపణలు కలకలం రేపుతు న్నాయి. చోడవరం నియోజకవర్గంలోని బెన్నవోలు ప్రాంతంలో రాత్రింబవళ్లు భారీ యంత్రాలతో తవ్వకాలు సాగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. కొండలను తవ్వి భారీగా గ్రావెల్ వెలికితీస్తూ, దానిని పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు స్థానికులు చెబు తున్నారు. ఒక్కటా రెండా.. రోజూ వందలాది ట్రాక్ట ర్లలో గ్రావెల్ తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. ఇంత పెద్ద ఎత్తున తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? నిబంధనల ప్రకారమే మైనింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? లేక అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.భారీ యంత్రాలతో కొండలను తవ్వుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ తవ్వకాల వెనుక ఎవరున్నారు? రోజువారీగా భారీ మొత్తంలో గ్రావెల్ తరలిపోతుంటే అధికారుల దృష్టికి రాకపోవడం ఎలా సాధ్యమన్న ప్రశ్నలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.ప్రకృతి సంపదకు ముప్పుఅభివృద్ధి పనుల పేరుతో అనుమతులకు మించి తవ్వకాలు జరిగితే ప్రాంతంలోని కొండలు, సహజ వనరులు దెబ్బతినే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మైనింగ్ జరుగుతున్నట్లు అధికారులు నిర్ధారిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.బెన్నవోలు ప్రాంతంలో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఈ తవ్వకాలపై సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? ఎంత మేరకు అనుమతులు ఇచ్చారు? నిబంధనలకు విరు ద్ధంగా తవ్వకాలు జరిగాయా? అనే అంశాలపై అధికారుల వివరణ ఇప్పుడు కీలకంగా మారింది. అనకాపల్లి జిల్లా సహజ సంపదను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అక్రమ మైనింగ్ ఆరోపణలపై ఇప్పటికైనా అధికారులు స్పందించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడిస్తారా? అన్నది వేచి చూడాలి.

## కూటమి పాలనకు రెండేళ్లు

### కరగ్రహారంలో 'ఇంటింటికీ సంక్షేమం' ప్రచారం

మచిలీపట్నం ప్రజాభూమి ప్రతినిధి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అమలు జరుగుతున్న అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసు కె ళ్లేందుకు తెలుగుదేశం పార్టీ విస్తృత ప్రచారం చేపట్టింది. కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్య దర్శి గోపు సత్యనారాయణ మంగళవారం బంద రు మండలం కరగ్రహారం గ్రామంలో పర్య టించి జోరుగా ప్రచారం నిర్వహించారు.గ్రామంలోని బూత్ నంబర్లు 39, 40 పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆయన, కూటమి ప్రభు త్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, వాటి ద్వారా సామాన్యులకు చేకూరుతున్న ప్రయోజనాలను ప్రజ లకు వివరంగా తెలియజేశారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, ప్రభుత్వ సంక్షే మ ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా పార్టీ శ్రేణులు నిరంతరం శ్రమిం చాలని పిలుపునిచ్చారు.ఆపన్నులకు అండగా సీఎంఆర్ఎఫ్:పేదరికం, ఆపదలో ఉన్న కుటుంబాలకు కూటమి ప్రభు త్వం కొండంత అండగా నిలుస్తోందని గోపు సత్యనారాయణ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా ముఖ్య మంత్రి సహాయ నిధి (CM Relief Fund) నుంచి లబ్ధిదారుడు అబ్దుల్ అజీమ్‌కు ₹23,400 ఆర్థి క సాయం మంజూరైన విషయాన్ని ఈ సందర్భంగా ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తలారి సోమశేఖర్, పరసా వడ్డీ కాసులు, బత్తిన నాగరాజు, బోలెం అయోధ్య, వల్లభుని నాగుల్‌మీరా, బొర్రా రాము, ఈడే వెంకటేశ్వరరావులతో పాటు ఇతర కూటమి నాయకులు, కార్య కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్రీడల్లో ప్రతిభతో మరిన్ని విజయాలు సాధించాలి

### బ్యాడ్మింటన్ క్రీడాకారులను అభినందించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి విజయవాడ:




స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న శ్వాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అభినందించారు.టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులకు కలెక్టర్ చేతుల మీదుగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సర్టిఫికెట్లు, విజేతలు, రన్నర్స్‌కు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ముచ్చటించిన కలెక్టర్ టోర్నమెంట్‌లో చూపిన ప్రతిభ, క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో నిరంతరం సాధన చేస్తూ, భవిష్యత్తులో నిర్వహించే మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొని జిల్లాకు మరింత పేరు, ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షించారు.టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన శ్వాస ఫౌండేషన్ నిర్వాహకులను కూడా కలెక్టర్ అభినందించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## సెప్టెంబర్ 1 'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

### సి.ఎం. దాస్, పేపేటి సత్యనారాయణ





ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

సెప్టెంబర్ 1వ తేదీన చేపడుతున్న 'చలో విజయవాడ' నిరసన కార్యక్రమాన్ని జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ సీపీఎస్ ఈఏ (ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్) నాయకులు పిలుపునిచ్చారు.ఈ రోజు మచిలీపట్నంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఏపీ ఎన్జీవో (ఆంధ్రప్రదేశ్ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్) భవన్ మరియు ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో ఏపీ సీపీఎస్ ఈఏ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 'చలో విజయవాడ' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఘనంగా ఆవిష్కరించారు.ప్రధాన డిమాండ్లు & నాయకుల ప్రసంగాలు:హామీలను నెరవేర్చాలి – సి.ఎం. దాస్ (రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, ఏపీ సీపీఎస్ ఈఏ):కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దుపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడం విచారకరం. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు సీపీఎస్ ఉద్యోగులందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశలో ఉన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెన్షన్ బిక్ష కాదు, హక్కు – పేపేటి సత్యనారాయణ (రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏపీ సీపీఎస్ ఈఏ & కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్):పెన్షన్ అనేది ప్రభుత్వం వేసే బిక్ష కాదని, అది ఉద్యోగుల హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టమైన తీర్పునిచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా సీపీఎస్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని అన్నారు. ఐక్యంగా పోరాడుదాం – కే. నాంచారయ్య (కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఏపీ సీపీఎస్ ఈఏ):సెప్టెంబర్ 1న విజయవాడలో జరగబోయే ఈ నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు తరలివచ్చి తమ నిరసనను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న ముఖ్య నేతలు:ఈ కార్యక్రమానికి ఏపీ సీపీఎస్ ఈఏ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సి.ఎం. దాస్ నాయకత్వం వహించగా, పోస్టర్ ఆవిష్కరణలో కృష్ణా జిల్లా ఏపీ జేఏసీ (ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ) చైర్మన్ & ఎన్జీవో కృష్ణా జిల్లా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.వీరితో పాటు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు బి. నెల్సన్ పాల్, ట్రెజరీ శోభన్ బాబు, ఏపీ జేఏసీ నాయకులు శ్యామ్, కిరణ్ కుమార్, ఏపీ జీఈఏ (ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్) అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తోట ప్రసాద్, దీపక్, వీరయ్య నాయక్, మణి కుమార్, తుమ్మూరు శేఖర్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## మచిలీపట్నంలో మరో సేవ సంస్థ....

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి




పేదవాడి ఆకలి తీర్చడానికి తల్లి తండ్రి లేని పిల్లలను చదివించడానికి మచిలీపట్నంలో," స్వేచ్ఛ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్" ప్రారంభోత్సవ పోస్టర్ ఆవిష్కరణ మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బాలాజీ చే జరిగింది. మచిలీపట్నం చెందిన షేక్ రఫీ మరియు అతని స్నేహితులు కలిసి ఈ స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేశారు. మచిలీపట్నంలో ఎక్కడ ఏ ఫంక్షన్ లో నైనా ఆహారం మిగిలిపోతే తమకు ఫోన్ చేస్తే తమ వాలంటీర్లు ద్వారా వచ్చి ఆ ఫుడ్ తీసుకువెళ్లి ఆకలి తో ఎదురు చూస్తున్న పేదవారికి అందించడం దొరుకుతుందని తెలియజేశారు. హై స్కూల్ స్థాయి వరకు తల్లి తండ్రి లేని పేద విద్యార్థులను చదివించడానికి పుస్తకాలు కొనుగోలు కొరకు తమ వంతు సహాయ సహకారం అందిస్తామని తెలియజేశారు.. ఎందరో పేదవారు ఆహారం కోసం చదువు కోసం ఎదురుచూస్తున్నారని వారి కొరకు స్వేచ్ఛ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయమని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ కూడా పాల్గొన్నారు

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 26 ఆగస్టు 2026


## జనసేన మున్సిపల్ ఎన్నికల దరఖాస్తుల స్వీకరణ



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 25 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ కోసం రాఘవయ్య చౌదరి, సిరిపల్లి ప్రసాద్, ఓబిలిశెట్టి శ్రవణ్‌కుమార్ గుప్తా, నిమ్మల జ్యోతికుమార్, కస్తూరి సాయి తేజస్వినిలతో ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు నాయకత్వ అవకాశాలు కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని అప్పలనాయుడు తెలిపారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లు 62 డివిజన్లుగా విభజించడం అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

## బ్యాంకుపై అవాస్తవ ప్రచారాన్ని ఖండించిన బ్యాంకు ఛైర్మన్ ఏ వి అంబికా ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

112 సంవత్సరాల చరిత్ర కలిగిన, రిజర్వు బ్యాంకు పర్యవేక్షణలో నడుస్తున్న బ్యాంకుపై ఇటీవల కొన్ని ఎలక్ట్రానిక్ మీడియా,యూట్యూబ్ ఛానళ్లలో వస్తున్న అవాస్తవాలు,నిరాధార ఆరోపణలను బ్యాం కు అధికారులు తీవ్రంగా ఖండించారు. రిజర్వు బ్యాంకు, కో-ఆపరేటివ్ శాఖ నిబంధనల మేరకు బ్యాంకు కార్యకలాపాలు అనుభవజ్ఞులైన అధికారులు, డైరెక్టర్ల కమిటీల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆడిట్ అనంతరం మహాజన సభలో వార్షిక నివేదికను సభ్యులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తిగా తెలుసుకోకుండా అసంపూర్ణ సమాచారంతో బ్యాంకుపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికే ప్రసారమైన ఆరోపణలపై బ్యాంకు అధికారుల వివరణను కూడా ప్రచురించాలని మీడియా ప్రతినిధులను కోరారు. భవిష్యత్తులో బ్యాంకుకు సంబంధించిన వార్తలు ప్రసారం చేసే ముందు అధికారుల వివరణ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిరాధార వార్తలు ప్రసారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.

## పోలీస్ సంక్షేమానికి ప్రజల సహకారం అవసరం

-ఆలమూరులో పోలీస్ శాఖ తొలి పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ బంకుల్లో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తారని, ప్రజలు ఈ బంకులను వినియోగిస్తూ పోలీసుల సంక్షేమానికి తోడ్పాటు అందించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్‌ను ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోలీసుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్ ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించడంతో పాటు పోలీస్ సంక్షేమ నిధులకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రజలు విశ్వాసంతో ఈ బంకుల్లో ఇంధనం నింపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపేట జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్సై జి. నరేష్, పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైతులు ప్రత్యామ్నాయని పంటల పైన దృష్టి పెట్టాలి

- ఎంపీపీ విజయలక్ష్మి




ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

రైతులు ప్రత్యానమైన పంటల పైన దృష్టి పెట్టాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. కామవరపుకోట మండల పరిషత్ సమావేశ మందిరం నందు మేడవరపు వెంకట సత్య ఛాయా విజయలక్ష్మి , మండల ప్రజా పరిషత్ కామవరపుకోట వారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి కడిమి రమేష్, కామవరపుకోట, యం.పి.టి.సి సభ్యులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి అమీర్ షరీఫ్, కామవరపుకోట, జి. ఎలీషా, తహసీల్దార్ జి ఎలీషా, వ్యవసాయ శాఖఅధికారి డి ముత్యాలరావు, ఎంఈఓ డి సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారులు మరియు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

## తొలిదశలో క్యాన్సర్ గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చు

- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- రావులపాలెంలో ఉచిత క్యాన్సర్, రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ శిబిరం ప్రారంభం.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని శ్రీ వాసవీ మహాత్మా గాంధీ సేవా సమితి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం సహకారంతో అపోలో క్యాన్సర్ సెంటర్ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, రక్త సంబంధిత వ్యాధుల పరీక్షల శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన వాసవీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులను, అపోలో వైద్య బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. వైద్య రంగంలో అపోలో గ్రూప్ విశేష సేవలు అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం క్యాన్సర్‌ను ఆలస్యంగా గుర్తించడం వల్ల రోగుల పరిస్థితి విషమిస్తోందని, ముందస్తు స్క్రీనింగ్‌తో వ్యాధిని సమర్థవంతంగా నియంత్రించవచ్చని చెప్పారు. కొనసీమ ప్రాంతంలో క్యాన్సర్, కిడ్నీ వ్యాధులు పెరుగుతున్నాయని, జీవనశైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, కలుషిత నీరు, మానసిక ఒత్తిడి వంటి అంశాలు ఇందుకు కారణమవుతున్నాయని ఆయన వివరించారు. కూటమి ప్రభుత్వం మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టిందని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో విశాఖపట్నం నుంచి వైద్యులు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. వాసవీ మహాత్మా గాంధీ సేవా సమితి సమాజ సేవలో ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. మహిళలకు ఉపాధి కల్పించడం, విద్యార్థులకు విద్యా సహాయం, క్రీడలకు ప్రోత్సాహం, ఉచిత కంటి, దంత వైద్య శిబిరాలు నిర్వహించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం వంటి సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుంచి వచ్చిన డా. రాకేష్ రెడ్డి, డా. నిరంజన్, డా. మాధవితో పాటు దంత వైద్యులు డా. బ్రహ్మారెడ్డి తదితర వైద్య బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వాసవీ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, సేవా సమితి సభ్యులు, వైద్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ అనేది చట్టబద్ధ హక్కు భిక్ష కాదు




ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

అమలాపురం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం నాడు ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ అధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం అయింది. ముఖ్య అతిథిగా కాకినాడ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ పెన్షనర్ వెల్ఫేర్ అధ్యక్షులు కేవీపీ జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా మూడు నాలుగు దశాబ్దాలు పాటు పూర్తి విశ్వాసంతో పనిచేసి ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్ అనేది చట్టబద్ధహక్కు ఇది బిక్ష కాదు వారి చెమట,శ్రమ,అనుభవం దేశ నిర్మాణానికి పునాది. రెండు మూడు పెన్షన్స్ తీసుకునే వారు వున్న ఈ దేశంలో ఒకే పెన్షన్ పొందే ఉద్యోగులు బకాయిలు ఇవ్వకపోవడం వల్ల వారి మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించవలసి ఉంటుందని తెలియజేశారు. ఈ యొక్క సమావేశంలో జిల్లా అధ్యక్షులు కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల పదవీ విరమణ చేసిన తర్వాత రావలసిన పిఎఫ్, గ్రాట్యూటీ, ఈ. ల్.మరియు సరెండర్ లీవ్ నగదు బకాయిలు సకాలంలో విడుదల కావడం లేదు 2. గత పిఆర్సి కి సంబంధించి బకాయిలు విడుదల చేయాలి. అదే విధముగా పెండింగ్లో ఉన్న అన్ని డి ఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి. 12వ వేతన సవరణ కమిటీ నియమించి వెంటనే 30% ఇంటీరియర్ రిలీఫ్ ప్రకటించాలి. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు మరియు ద్రవయోల్బణానికి అనుగుణంగా పెండింగ్ లో ఉన్న ఐదు డి ఏ లను ప్రకటించాలి. గత ప్రభుత్వం 11వ పి ఆర్ సి లో తగ్గించిన అదనపు క్వాంటం పెన్షన్ 70 సంవత్సరాలు నిండిన వారికి 7 పర్సెంట్ నుండి 10%పు 75 సంవత్సరాలు నిండిన వారికి 12 పర్సెంట్ నుండి 15% కు యథావిధిగా పెంచాలి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ హెచ్ స్ కార్డులు కు ఉచిత వైద్యం అందటం లేదని ఆవేదన వెల్లపుచ్చుచున్నారు. మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు ప్రక్రియ చాలా ఆలస్యంగా జరుగుతుందని, సక్రమంగా జరిగేటట్టు చూడాలని బకాయిలకు కావలసిన మొత్తం 25 వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం వారు దశలవారీగా విడుదల చేయాలని కంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ మరియు యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ పూర్తిగా రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ స్కీమ్ ను పునరుద్ధరించాల ఈ పి ఎస్ 95 స్కీము పెన్షనర్స్ కు 9000 వేతనంతో పాటు డిఏ కలిపి చెల్లించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ లో తీర్మానం చేయాలనీ కోట్లాదిమంది ఉద్యోగ పెన్షనర్స్ కు నష్టం కలిగించే పెన్షన్ వాలిడేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ముఖ్య అతిథి రాకా చంద్రరావు, సెక్రటరీ బి చంద్రరావు, ఉపాధ్యక్షులు జి అనంతరం,బి.బల భద్ర శర్మ, ఎస్ వి ఎస్ రెడ్డి , ఆర్ సత్యనారాయణ, పి .గోపాలకృష్ణ, కావల కోటిలింగం పాల్గొన్నారు.

## స్థలాలు చూపించకుండా ఆప్షన్లా?

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

పోలవరం నిర్వాసిత కుటుంబాలకు తాడ్వాయి, తిరువూరు వంటి ప్రాంతాలలో పునరావాసం కల్పిస్తామని చెబుతున్న అధికారులు, నిర్వాసితులకు క్షేత్రస్థాయిలో స్థలాలను చూపించకుండా కేవలం మ్యాప్‌లు చూపించి సంతకాలు/ఆప్షన్లు తీసుకోవడంపై స్థానిక విఆర్ పురం నిర్వాసిత ప్రజలు మండిపడుతున్నారు."మా జీవితాలు, మా భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే హక్కు మాకు లేదా? అధికారులు ఎక్కడికి పొమ్మంటే అక్కడికి వెళ్లాలా?" అని పోలవరం ప్రాజెక్ట్ వీఆర్ పురం మండల నిర్వాసితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభ నిర్వహించకుండా, కేటాయించే స్థలాలను నేరుగా చూపించకుండా పునరావాస ఆప్షన్లు తీసుకోవడంపై నిరసన వ్యక్తమవుతోంది.




బొర్ర సూరిబాబు (వడ్డిగూడెం కాలనీ)

"తడ్వాయిలో పునరావాసం అంటున్నారే తప్ప, ఇప్పటివరకు అక్కడ స్థలం గానీ, గ్రామం గానీ చూపించలేదు. మ్యాప్‌లో చూపించి నిర్ణయం తీసుకోమంటే ఎలా?" అని నిర్వాసితుడు వాపోతున్నాడు.



గూటాల రవికుమార్ (వడ్డిగూడెం కాలనీ)

"గ్రామస్తుల నిర్ణయం లేకుండా, గ్రామసభ పెట్టకుండా అధికారులే ఏకపక్షంగా పునరావాసం ఖరారు చేయడం ఇది న్యాయమేనా?అధికారుల తొందరపాటు నిర్ణయాల వల్ల, నివాసాలు, జీవనోపాధి కోల్పోతున్న నిర్వాసితులు శాశ్వతంగా నష్టపోతున్నారని ప్రజలు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం పునరావాసం జరగాల్సిందేనని, నిర్వాసితులకు ప్రతిపాదిత పునరావాస స్థలాలను నేరుగా చూపించాలనీ, చట్ట ప్రకారం ప్రతి గ్రామంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, నిర్వాసితుల సంపూర్ణ సమ్మతి తీసుకోవాలనీ, పునరావాస ప్రాంతంలో తాగునీరు, రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, జీవనోపాధి అవకాశాలు స్పష్టంగా చూపించిన తర్వాతే ఆప్షన్ల ప్రక్రియ చేపట్టాలనీ,తమ భవిష్యత్తుతో ఆడుకోవద్దని, చట్టబద్ధంగా గ్రామసభలు నిర్వహించి స్థల పరిశీలన చేయించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.



## రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

రేషన్ డీలర్లకు కమీషన్ పెంచాలని, పనిభారం తగ్గించాలని, స్మార్ట్‌ఫోన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా రేషన్ డీలర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రాజులపాటి గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది రేషన్ డీలర్లు ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తూ సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం డీలర్లకు అందిస్తున్న కమీషన్ కేవలం రూ.6 వేలు మాత్రమేనని, ఈ మొత్తంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. ఎన్నో ఏళ్లుగా రేషన్ షాపులు నిర్వహిస్తున్న డీలర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వం రేషన్ బియ్యం బస్తాలను డీలర్లే దించుకోవాలని, బస్తాలపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌లను నమోదు చేయాలని, ప్రతి రోజూ పంపిణీ చేసిన బియ్యం బస్తాల వివరాలను నమోదు చేయడంతో పాటు ఖాళీ బస్తాలపై ఉన్న క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించడం వల్ల పనిభారం మరింత పెరిగిందన్నారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో డీలర్లపై పెరుగుతున్న అదనపు బాధ్యతలను తగ్గించాలని, తగిన కమీషన్ పెంచాలని, సాంకేతిక పనులకు అవసరమైన స్మార్ట్‌ఫోన్లను ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేయాలని గంగాధర్ డిమాండ్ చేశారు.

డీలర్ల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని కోరారు.




## తోట త్రిమూర్తుల అరెస్టుపై కాపు జేఏసీ ఆగ్రహం

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల అరెస్టును కాపు జేఏసీ నాయకుడు తోట రామకృష్ణ ఖండించారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ, ప్రజల తరఫున నిలబడి సమస్యను అడ్డుకున్నందుకే తోట త్రిమూర్తులను అరెస్ట్ చేశారని ఆరోపించారు. పోలీసులు ఆయనను భుజాలు పట్టుకుని ఈడ్చుకెళ్లడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాపు నాయకులపై కక్ష సాధింపు చర్యలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కాపు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమానికి దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తాళ్లపూడి కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం , చాగల్లు మండలం కాపు సంఘం అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, కొవ్వూరు మండలం కాపు అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న పాల్గొన్నారు.

## విజృంభిస్తున్న విషం స్వరాలు...

- ఆసుపత్రిలో వైద్యుల కొరత..
- పదిమంది వైద్యులకు ఇద్దరే..
- రోజుకు సుమారు 200 నుండి 300 రోగులు..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని సామాజిక ఆసుపత్రి నందు వైద్యులకు కొరతతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు పేరుకు మాత్రమే సిహెచ్ సి ఆసుపత్రి అక్కడ వైద్యుల కొరత విపరీతంగా ఉంది పదిమంది ఉండాల్సిన వైద్యులు ఇద్దరు మాత్రమే దర్శనమిస్తున్నారు అసలు అక్కడ ఉండాల్సిన వైద్యుల ఏమైపోయారు ఎనీషియా (మత్తు వైద్యుడు) గైనిక్ ( మహిళల వైద్యురాలు) ఆర్థోపెటిక్ (వేముకల వైద్యుడు) పీడియాట్రిషన్ (పిల్లల వైద్యుడు) ఇలా ముఖ్యమైన విభాగాలలో వైద్యులు కొరత అలాగే ఎంబిబిఎస్ వైద్యులు కూడా లేకపోవడం ఇప్పుడు పని చేస్తున్న ఇద్దరిపైనే పని భారం పెరగడంతో వారు కూడా చాలా ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అలాగే ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో ఎవరి జిల్లాలో వారే పని చేయాలని జీవో రావడంతో ఇప్పుడు ఉన్న ఇద్దరు వైద్యులు కూడా వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్నారు కావున ఇప్పుడు ఉన్న వారిని అలాగే కొనసాగిస్తూ కొత్తవారిని నియమించే విధంగా చూడాలని ఆనాడు రాష్ట్ర విభజనలో భాగంగా ఆనాటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇక్కడ 50 పడకల ఆసుపత్రి నిర్మించడం జరిగింది ఆనాటి నుండి ఈనాటి వరకు ఈ ఆసుపత్రిలో వైద్యుల కొరత వెంటాడుతూనే ఉంది మరలా నేడు అదే ప్రభుత్వం కొలువు తిరిన కూడా ఇక్కడ వైద్యులను నియమించడంలో విఫలం చెందారు అని పలువురు వాపోతున్నారు అసలే వర్షాకాలం అందులోనూ వరదల సమయంలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ ఉంటారు కనుక ఈ ఆసుపత్రికి అందులోనూ వీఆర్ పురం కూనవరం ఎటపాక మండలాలకు ఈ ఆసుపత్రి మాత్రమే పెద్దది కావున ప్రజలందరూ ఈ ఆసుపత్రికి చేరుకుంటారు కానీ ఇక్కడ వైద్యం అందించే వైద్యులు లేకపోవడంతో ప్రతి ఒక్కరు వైద్యం కోసం పక్క తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు వైద్యాన్ని తీసుకోవడం జరుగుతుంది రెక్కాడితే డొక్కాడని ఈ గిరిజన ప్రాంతంలో అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది సంబంధిత అధికారులు ప్రభుత్వ ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఇక్కడ వైద్య సిబ్బందిని నియమించి ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించే విధంగా చూడాలని మండలాల ప్రజల కోరుకుంటున్నారు.



# సరిపడా పారిశుద్ధ కార్మికులు లేక ఉన్న వారిపై పని భారం...?

- ఒక మూలన పెట్టి వినియోగించని ట్రాక్టర్...
- నెలలు గడుస్తున్న జీతభత్యాలు కరువు పారిశుద్ధ కార్మికుల..
- సిబ్బందిని నియమించడంలో అధికారులు వైఫల్యం...
- జీతం చేయడానికి ఒకరిపై ఒకరు కాంక్షలు పెట్టి జీతాలను ఆలస్యం...

ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం

మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో రెండు గ్రామాలు కూనవరం టేకుల బోరు గ్రామాలకు సుమారు 3446 ఓటర్లకు ఇంకా ఇతరులు పిల్లలు కలుపుకొని సుమారు 4500 మంది వరకు ఉండవచ్చు వీరందరికీ ఐదుగురు ఔట్సోర్సింగ్ పారిశుద్ధ కార్మికులు



మాత్రమే పని చేస్తున్నారు ఆ ఐదుగురిలో ఇద్దరు రెండు గ్రామాలకు మంచినీటి వ్యవస్థను అందించడంలో ఉంటారు మిగతా ముగ్గురు రెండు గ్రామాలను చెత్తను సేకరించి తోపుడు బండిపై సుదూర ప్రాంతాలకు తీసుకెళ్లి డంపు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది ఒక మగ మనిషి బండి లాగుతూ ఉంటే ఇద్దరు మహిళలు బండని చాలా కష్టంగా ఆ చెత్త బండిని తోస్తున్నారు మూడు సంవత్సరాల క్రితం మేజర్ గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్ కొనుగోలు చేయడం జరిగింది దానిని వినియోగించకుం



డా మూలన పడివేశారు అది కాస్త కొంత కాలానికి పాత సామాన్లకు వెళ్లే అవకాశం ఉంది కావున దానికి ట్రక్కును కొనుగోలు చేసి అలాగే పారిశుద్ధ కార్మికులను ఇంకొక ఐదుగురిని నియమించి రెండు గ్రామాలలో ఉన్న చెత్తను అలాగే వీధుల్లో ఉన్న చెత్తను తరలించడానికి సులువుగా ఉంటుంది వారికి ఇచ్చే జీతభత్యాలు కూడా అతి స్వల్పం ఒక్కొక్కరికి పదివేల రూపాయలను మాత్రమే జీతం ఇస్తూ అది కూడా మూడు నెలలకు ఒకసారి లేదా ఆరు నెలలకు ఒకసారి జీతభత్యాలను ఇస్తున్నారు ఉపాధి కూలీల కంటే తక్కువ జీతంతో చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు సరైన వసతులు జీతభత్యాలను ఇవ్వకుండా వారిని ఇబ్బందికి గురిచేస్తున్నారు అడిగితే సంబంధిత స్పెషల్ అధికారి సెక్రటరీ వారి తో మాట్లాడుతూ మీ జీతభత్యాలు నా పరిధి కాదు అంటూ ఒకరి మీద ఒకరు చెప్పుకొని వారి జీతభత్యాలను చేయటం లేదు సంబంధిత ఎంపీడీవో కి అనేక మార్లు విన్నవించిన వారు కూడా సరైన సమాధానం ఇవ్వటం లేదని పారిశుద్ధ కార్మికులు వాపోతున్నారు ఉన్నతాధికారులు స్పందించి వారి జీతభత్యాలను త్వరతగతిన ఇప్పించాలని అలాగే ఇంకొక ఐదుగురిని కొత్తవారిని నియమించి పారిశుద్ధ కార్మికుల కష్టాలను తొలగిస్తారని వారి సేవలను మాకు సరిగ్గా వినియోగించుకునే విధంగా చూస్తారని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం మాకొద్దు బాబోయ్

- పెట్టుబడులు పెట్టకపోతే గ్రామస్తులు ఒప్పుకోరు
- పెడితే బిల్లులు రాక ఇబ్బందులు
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదుకోవాలని వినతి

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు


ఒకప్పుడు పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం అంటే రాజా లాంటి ఉద్యోగం అని ఎగబడి మరి వచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తారుమారయిపోయింది. కొత్తవారు ఈ ఉద్యోగానికి రావడం మాట ఎలా ఉన్నా ఉన్నవారే మరో డిపార్ట్మెంట్ కి వెళ్లిపోదామని ఆలోచనలో పడుతున్నారు. కొందరైతే సచివాలయం సిబ్బంది ప్రమోషన్లు వచ్చిన మాకొద్దు బాబోయ్ అంటున్నారు. తెలియక వెళ్లిన వారు కూడా వెనక్కి వెళ్లి పోవడానికి ఇష్టపడుతున్నారు. అంటే ఆ ఉద్యోగం పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొందరు సీనియర్లు సైతం సర్వ గ్రామం, సర్వ వార్డుల డిప్యూటీ ఎంపీడీవో గా పదోన్నతి పై వెళ్లిపోయారంటే ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి అనబడే పంచాయతీ అభివృద్ధి అధికారి పోస్ట్ దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పెట్టుబడులు పెట్టకపోతే గ్రామస్తులు ఒప్పుకోరు:**

గ్రామంలో ప్రజలకు కనీస సౌకర్యాలు బాధ్యత గ్రామ అభివృద్ధి అధికారిపై ఉంది. దీంతో తాగునీరు, డ్రైనేజీ, శానిటేషన్, ఇతరత కనీస సౌకర్యాలు ఎప్పటికప్పుడు చేయాల్సిన బాధ్యత గ్రామ అభివృద్ధి అధికారులపై ఉంది. లేదంటే ప్రజల నుంచి తిరుగుబాటు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ కారణంగా ప్రస్తుతం సర్పంచ్లు లేని కారణంగా ఈ బాధ్యత పంచాయతీ అభివృద్ధి అధికారులు భుజాన వేసుకుని వేసుకుని అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టి కనీస సౌకర్యాలు కలుగ చేస్తున్నారు. కొందరు వేల రూపాయలు అయితే మరికొందరు లక్షల రూపాయల్లో పెట్టుబడి పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. స్పెషల్ ఆఫీసర్లు ఉన్న ముందుగా అడిగేది పంచాయతీ అభివృద్ధి అధికారులని కాబట్టి వీరికి పెట్టుబడులు తప్పని పరిస్థితి నెలకొంది. ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా 13 వేలకు పైగా గ్రామపంచాయతీలు ఉన్న ఆంధ్ర పరిస్థితి ఇలాగే ఉంది అని పలువురు అంటున్నారు.

**బిల్లులు రాక పంచాయతీ అభివృద్ధి అధికారులకు తప్పని తిప్పలు::**

అప్పులు చేసి గ్రామపంచాయతీ కనీస సౌకర్యాల కోసం పెట్టుబడులు పెట్టినప్పటికీ బిల్లులు సక్రమంగా సకాలంలో రాకపోవడంతో అప్పులు పాలైపోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అభివృద్ధి అధికారిగా విధులు





నిర్వహించాలంటేనే తల ప్రాణం తోకకు వస్తోందని మరికొందరు అంటున్నారు. వచ్చే జీతం లో సగం కూడా ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని, గ్రామ సౌకర్యాలు బట్టుకతే సరిపోతుందని మరికొందరు చెబుతున్నారు. బిల్లులు అవ్వాలంటే ఓ ఎల్ పి ఓ, డిపిఓ పర్మిషన్ పొంది రావాల్సి వస్తుందని దీనివల్ల తీవ్ర జాప్యం జరుగుతుందని అంటున్నారు. ఎక్కడో ఒకచోట పొరపాటు జరిగితే అన్నిచోట్ల లెక్కేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామాల్లో చిన్నచిన్న పనులు చేయడానికి ఎవరు ముందుకు రావడం లేదంటున్నారు. పెట్టిన పెట్టుబడులు ఖర్చులు మాత్రమే కాకుండా,,సిబ్బంది జీతాలు ఇవ్వడానికి కూడా తంబు వేయడానికి రెండు మూడు రోజులు సమయం ఇవ్వడం వల్ల, ఆ రోజుల్లో మిషన్లు పని చేయక తంబ్ పడటం లేదని దానివల్ల కూడా సిబ్బంది జీతాలు ఖర్చులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**డిప్యూటీ సీఎం, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదుకోవాలి:**

పంచాయతీ డిపార్ట్మెంట్లోసిబ్బందికి ప్రమోషన్లు అయితే ఇచ్చారు గాని, ఆ సంతోషం లేకుండా పోయింది అని,ఇలాంటి ఇబ్బందులు పెట్టడం సమంజసంగా లేదని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులు కూడా లేకపోవడంతో తమ ఇబ్బందులను పట్టించుకునే నాథుడు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కావున ఇప్పటికైనా పంచాయతీ అభివృద్ధి అధికారులు ఇబ్బందులను పరిశీలించి, తంబ్ ను పదేవరకు సమయం పెంచాలని, అదేవిధంగా బిల్లులు ఏదో వంక చూపి తిప్పి పంపకుండా గతంలో మాదిరిగా బిల్లులు అయ్యేలా సులభతరం చేయాలని, దీని కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలి అని కోరుతున్నారు.

## పి 4 టీమ్ ఆధ్వర్యంలో జూన్-జులై నెల న్యూస్‌లెటర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

పోలవరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో పీ 4 టీమ్ ఆధ్వర్యంలో రూపొందించిన జూన్–జులై నెల న్యూస్ లెటర్‌ను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం బర్రింకలపాడు గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.పోలవరం నియోజకవర్గంలో జూన్ – జులై లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన ముఖ్యాంశాలను ఈ న్యూస్‌లెటర్‌లో పొందుపరిచారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు పారదర్శకంగా ప్రజలకు చేరాలనే ఉద్దేశంతో న్యూస్‌లెటర్‌ను రూపొందించడం జరిగిందని తెలిపారు.నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పి 4 యంగ్ ప్రొఫెషనల్ జగదీశ్వరరావు, టీమ్ సభ్యుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

## పీసీ & పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమీక్ష సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పీసీ, పీఎన్‌డీటీ చట్టం–1994, నిబంధనలు–1996 అమలుపై సమీక్ష నిర్వహించారు. వైద్య ఆరోగ్య, విద్య, పోలీస్ శాఖల సమన్వయంతో భ్రూణ లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణలను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. సబ్‌కలెక్టర్ బొల్లి పల్లి వినూత్న, డీవై డీఎంహెచ్ఓ పద్మావతి, డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ పాల్గొని సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. చట్ట నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.నూజివీడు డివిజన్‌లో పీసీ & పీఎన్‌డీటీ చట్టం కింద 16 స్కాన్ సెంటర్లు నమోదై ఉండగా, మొత్తం 16 కేంద్రాలు పనిచేస్తున్నాయి. అన్ని కేంద్రాలను



తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఫారం–ఎఫ్ నిబంధనలు, రికార్డుల పరిశీలిస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలోని డెకాయ్ ఆపరేషన్లు, తనిఖీలు, రికార్డుల పరిశీలనతో పాటు పీసీ & పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.విద్యాశాఖ సహకారంతో పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐసీడీఎస్‌తో కలిసి గ్రామాలు, అంగన్వాడీ కేంద్రాల్లోనూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పోలీస్ శాఖ భాగస్వామ్యంతో బాల్య వివాహాలు, చట్టవిరుద్ధమైన భ్రూణ లింగ నిర్ధారణను అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.టీనేజ్ గర్భధారణలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా వర్కర్లు, విద్యా, పోలీస్, ఐసీడీఎస్ తదితర వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడి పై దాడిని ఖండించిన రాష్ట్ర చైర్మన్ లంకలపల్లి సాయి

ప్రజా భూమి ప్రతినిధి–కామవరపుకోట

కామవరపుకోట మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రావికంపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై జరిగిన దాడిని రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ ఖండించారు. ప్రధానోపాధ్యాయునిపై దాడి అనైతికమని, విద్యాశాఖ అధికారుల సమక్షంలో జరగటం క్షమించరాని నేరం అన్నారు. వెంటనే విద్యా శాఖ అధికారులు దానికి కారణమైన వాళ్లపై పోలీస్ కేసులు పెట్టాలని కోరారు. ప్రధానోపాధ్యాయునికి, పాఠశాల



ఉపాధ్యాయులకు నైతిక స్థైర్యాన్ని కల్పిస్తూ, రాష్ట్ర ఫ్యాప్టో తరఫున తప్పనిసరిగా ఈ విషయాన్ని విద్యాశాఖ కమీషనర్,, విద్యాశాఖ మంత్రి దృష్టికి కూడా తీసుకువెళ్తామని తెలియజేశారు. ఉపాధ్యాయులు ఎవరూ మనోధైర్యాన్ని కోల్పోకూడదని, తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా బెట్ స్పాళియింగ్ మార్పులు గురించి తప్పనిసరిగా విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, ఆఫ్ లైన్లో పరీక్ష నిర్వహించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ టి యు ఏలూరు జిల్లా అధ్యక్షులు నారాయణ, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి సభ్యులు పుప్పాల ప్రకాష్ రావు, ఎన్ మల్లేశ్వరరావు ఇతర సభ్యులు పాల్గొని నైతిక మద్దతు ప్రకటించారు.

## జీలుగుమిల్లిలో నిర్మాణ దశలో ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి–జీలుగుమిల్లి

జీలుగుమిల్లి మండల కేంద్రంలో నిర్మాణం చివరి దశలో ఉన్న అన్నా క్యాంటీన్ భవనాన్ని పోలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం సందర్శించి, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే , నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే ఈ భవన నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు



లేకుండా, అత్యున్నత ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అన్నా క్యాంటీన్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన సేవలను అందించే కేంద్రంగా మారనున్నందున, మిగిలి న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సంబంధిత అధికారులను కోరారు.ప్రజలకు నాణ్యమైన, తక్కువ ధరకు భోజనం అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్నా క్యాంటీన్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

బుధవారం 26 ఆగస్టు 2026

## రాత్రింబవళ్లు ఎర్ర మట్టి తవ్వకాలు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

రాత్రి పగలు తేడా లేకుండా ఎర్ర మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయని మండల బీజేపీ అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ ఆరోపించారు. చింతలపూడి కాలువ గట్టు వద్ద ఉన్న మట్టితో పాటు కొండ ప్రాంతాలను తవ్వి ఎర్ర మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆయన తెలిపారు.ఈ వ్యవహారంపై గతంలో పి.జి.ఆర్.ఎస్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత తహసీల్దార్ పట్టించుకోలేదని రామకృష్ణ ఆరోపించారు. అధికారులు స్పందించకపోవడంతోనే ఎర్ర మట్టి తవ్వకాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని అన్నారు.ప్రభుత్వ అనుమతులు, నిబంధనలను ఉల్లంఘించి లేవుట్లు పూడికకు మట్టి తవ్వకాలు, తరలింపులు జరుగుతున్నాయా అనే విషయంపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలు వెంటనే అడ్డుకుని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు వెలుగుబంటి రామకృష్ణ పాల్గొన్నారు.

## ఆర్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

వాతావరణంలో మార్పులతో గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు శ్రీ ఆర్.ఆర్. మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ ఆర్ రవి కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం భీమోలు గ్రామంలో శ్రీ ఆర్ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యం శిబిరం ఏర్పాటు చేసారు. సుమారు 80 మందికి పైగా రోగులకు ఉచిత రక్త పరీక్షలు ఈసీజీ చేసి మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వింటి అప్పారావు, మేనేజర్ చింటూ మరియు మణికంఠ, పి.ఆర్. ఓ.స్. సాగర్, వెంకట్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త కుటుంబానికి 5వేలు ఆర్థిక సాయం



ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం.

శ్రీరామగిరి గ్రామపంచాయతీ చొక్కానపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ కార్యకర్త కృష్ణారెడ్డి అనారోగ్యంతో కాకినాడ హాస్పటల్ వద్ద చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మరణించడం జరిగినది. మంగళవారం వైఎస్ఆర్పి మండల నాయకులు వారి ఇంటికి వెళ్లి భార్యా పిల్లలను పరామర్శించి ఆర్థికసాయంగా 5000 రూపాయలు బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా వి ఆర్ పురం మండలం వైఎస్ఆర్సిపి మండల నాయకులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ సీనియర్ కార్యకర్త కృష్ణారెడ్డి చనిపోవడం బాధాకరమని, పార్టీలో చురుకుగా పనిచేసే కార్యకర్తని కోల్పోయామని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలానే వారి కుటుంబానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అండగా ఉంటుందని ఏ ఆపద వచ్చిన ఆదుకుంటామని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధికారి ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ, ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ, ఐటీ వింగ్ అధ్యక్షులు ముత్యాల గౌతం ప్రభాకర్, మండల వైస్ ప్రెసిడెంట్ వద్దాది రాజారావు, ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు , మండల నాయకులు జొన్నాద నాగేశ్వరరావు, సొంది చిరంజీవి, నాలారపు లక్ష్మణరావు, నాలారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాదినోత్సవ సందర్భముగా ఆటల పోటీలు



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

జిల్లాపరిషత్ఉన్నత పాఠశాల అన్నవరంలో ఆగష్టు 29 క్రీడాదినోత్సవము సందర్భముగా ఈ రోజు ఆటలపోటీలు నిర్వహించడం జరిగిందని పాఠశాలప్రధానోపాధ్యాయుని విజయకుమారి తెలిపారు.ప్రధానోపాధ్యాయని మాట్లాడుతూ క్రీడలు మానసిక,ఉల్లాసానికి దోహదచేస్తాయని తెలిపారు. గెలుపు,ఓటమి లు సహజమని తెలిపారు. ప్రతి విద్యార్థి రెండు క్రీడలు పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినోత్సవము సందర్భముగా ప్రతిసంవత్సరము ఆగష్టు 29 క్రీడా దినోత్సవము జరుపుకుంటామని తెలిపారు. టెన్నికాయిట్, జావలిన్ త్రో పోటీలు నిర్వహించడం జరిగినది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో టెన్నికాయిట్ ఆటలపోటీలను సీనియర్ ఉపాధ్యాయులు నాగరాజు ప్రారంభించారు. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నాగేంద్రరావు, నాగరాజు, ఫిలోమిన,దుర్గామల్లేశ్వరరావు, జయకుమారి,యం వి.రమణ, రాజేంద్రప్రసాద్,భోగిప్రసాద్, కృష్ణ కుమారి వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్ర పాల్గొన్నారు.

# డీజిల్ బిల్లుల కలకలం..!!

- విచారణ జరిగి నెలలు గడిచినా చర్యలు శూన్యం
- రూ.18 లక్షల బిల్లుల వెనుక అసలు కథ ఏమిటో..
- 19 లీటర్ల డీజిల్‌కు లక్షల్లో వ్యయం నమోదుపై అధికారుల మౌనం
- గోప్యంగా క్షేత్రస్థాయి విచారణ వివరాలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రజాధనం వినియోగంలో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన పంచాయతీ రాజ్ శాఖలో డీజిల్ బిల్లుల వ్యవహారం ఇప్పుడు అనేక అనుమానాలకు తావిస్తోంది. హిందూపురం మండలంలోని తూమకుంట, గోల్లాపురం గ్రామ పంచాయతీల్లో కేవలం 19 లీటర్ల డీజిల్ కొనుగోలుకు సుమారు రూ. 18 లక్షల మేర బిల్లులు నమోదైనట్లు వెలుగులోకి వచ్చిన వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినప్పటికీ, ఇప్పటి వరకు ఆ విచారణలో తేలిన అంశాలను బహిర్గతం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. గత జూన్‌లోనే జిల్లా పంచాయతీ అధికారిణి క్షేత్రస్థాయికి వచ్చి సంబంధిత గ్రామ పంచాయతీల్లో రికార్డులు, బిల్లులు, ఖర్చుల వివరాలను పరిశీలించినట్లు సమాచారం. అంతేకాదు, ఈ వ్యవహారంపై రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ కమిషనర్ టెలీకాన్ఫరెన్స్‌లో ఆరా తీసినట్లు తెలుస్తోంది. డీజిల్ కొనుగోలుకు లక్షల్లో ఖర్చు ఎలా నమోదైందని, అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. అయినప్పటికీ విచారణ జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి నివేదిక, వివరణ లేదా చర్యల వివరాలు బయటకు రాకపోవడం పలు ప్రశ్నలకు కారణమవుతోంది.

**రూ. 18 లక్షల నమోదు ఎలా జరిగింది...**

19 లీటర్ల డీజిల్‌కు రూ. 18 లక్షల మేర వ్యయం నమోదవడం సాధారణ ఆర్థిక లావాదేవీలకు పూర్తి భిన్నంగా ఉంది. ఈ మొత్తం నిజంగా డీజిల్ కొనుగోలుకే సంబంధించినదా లేక ఇతర ఖాతాలో నమోదు కావాల్సిన బిల్లులు పొరపాటున డీజిల్ హెడ్‌లో అప్‌లోడ్ అయ్యాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై రాష్ట్రస్థాయి పంచాయతీరాజ్ కమిషనర్ టెలికాన్ఫరెన్స్‌లో అధికారులను ప్రశ్నించినట్లు సమాచారం. డీజిల్ కొనుగోలుకు లక్షల రూపాయలు ఎలా ఖర్చయ్యాయని ఆయన ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో హిందూపురం మండల ఎంపీడీఓ స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో సాంకేతిక సమస్యల కారణంగా తప్పు నమోదు జరిగి ఉండొచ్చని గతంలో వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపం వల్ల తప్పు హెడ్‌లో మొత్తం కనిపించి ఉంటే.. అసలు బిల్లులు ఏవి, వాస్తవంగా ఖర్చు చేసిన మొత్తం ఎంత, పోర్టల్‌లో నమోదైన రూ. 18 లక్షలకు సంబంధించి చెల్లింపులు జరిగాయా, జరిగితే ఎవరికి, ఏ ఖాతా నుంచి జరిగాయన్న విషయాలు స్పష్టంగా తెలియాల్సి ఉంది. కేవలం సాంకేతిక సమస్య అనే వివరణతో వ్యవహారాన్ని ముగించడం వల్ల మరిన్ని అనుమానాలకు అవకాశం ఏర్పడుతోంది.

**తప్పు హెడ్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశారా...**

స్థానిక పంచాయతీ కార్యదర్శి ఇతర ఖాతా శీర్షికలో నమోదు చేయాల్సిన బిల్లులను డీజిల్ ఖాతాలో అప్‌లోడ్ చేసి ఉంటే, అది పరిపాలనా, లెక్కల పరంగా తీవ్రమైన తప్పిదంగా పరిగణించాల్సి ఉంటుంది. అలాంటి పొరపాటు జరిగితే దానికి బాధ్యులెవరు.. బిల్లులను పరిశీలించి ఆమోదించిన అధికారులు ఎవరు, తనిఖీ వ్యవస్థ ఎక్కడ విఫలమైందనే ప్రశ్నలకు సమాధానం అవసరం. ఇది కేవలం డేటా ఎంట్రీ పొరపాటుగా నిర్ధారణ అయితే కూడా బాధ్యత ఎవరిదో గుర్తించి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఎందుకంటే ప్రజాధనానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో నిర్లక్ష్యానికి కూడా బాధ్యత ఉండాల్సిందే.

**విచారణ జరిగింది.. నివేదిక మాత్రం ఎక్కడ...**

ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన అనంతరం జిల్లా పంచాయతీ అధికారిణి గత జూన్‌లో క్షేత్రస్థాయికి వచ్చి తూమకుంట, గోల్లాపురం గ్రామ పంచాయతీల్లో సంబంధిత రికార్డులు, బిల్లులు, ఖాతాలు, ఇతర వివరాలను పరిశీలించినట్లు సమాచారం. అయితే ఆ పరిశీలనలో ఏం తేలిందన్నది ఇప్పటి వరకు బయటకు రాలేదు. కనీసం విచారణ పూర్తయిందా, కొనసాగుతోందా, నివేదికను ఉన్నతాధికారులకు పంపారా అనే అంశాలపై కూడా అధికారిక ప్రకటన లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాధనానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అధికారుల క్షేత్రస్థాయి తనిఖీలు జరిగినప్పుడు ప్రాథమికంగా ఏ అంశాలపై పరిశీలన చేశారో, తదుపరి చర్యలు ఏమిటో వెల్లడించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. అయితే ఈ ఘటనలో విచారణ జరిగిన విషయం కూడా అధికారికంగా మీడియాకు తెలియజేయకుండా అంతర్గతంగానే పరిశీలన పూర్తి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు బిల్లులు వాస్తవంగా తప్పు హెడ్‌లో అప్‌లోడ్ చేసినవే అయితే వాటిని అప్‌లోడ్ చేసిన సిబ్బంది, పరిశీలించిన అధికారులు, ఆమోదించిన బాధ్యులపై కనీసం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సాంకేతిక లోపమే కారణమైతే దాన్ని సరిచేసి సంబంధిత ఖాతాలను పునరుద్ధరించిన వివరాలను కూడా అధికారులు వెల్లడించాలి.

**డీజిల్ బిల్లులపై సమగ్ర ఆడిట్ చేయాలి**

ఈ వ్యవహారాన్ని ఒక సాఫ్ట్‌వేర్ సమస్యగా ముగించకుండా, తూమకుంట, గోళాపురం గ్రామ పంచాయతీల్లో సంబంధిత కాలానికి సంబంధించిన డీజిల్ కొనుగోళ్లు, బిల్లులు, వోచర్లు, బ్యాంకు చెల్లింపులు, స్టాక్ రిజిస్టర్లు, వాహనాల వినియోగ వివరాలు, పోర్టల్ ఎంట్రీలను సమగ్రంగా ఆడిట్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోంది. డీజిల్ వాస్తవంగా ఎంత కొనుగోలు చేశారు, ఎన్ని వాహనాలకు వినియోగించారు, వాహనాల లాగ్‌బుక్స్‌లో నమోదైన వివరాలు బిల్లులతో సరిపోతున్నాయా, చెల్లించిన మొత్తం, బిల్లుల్లో నమోదైన మొత్తం, పోర్టల్‌లో కనిపిస్తున్న మొత్తం ఒకటేనా అనే అంశాలపై విచారణ జరిగితే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

### -తహసిల్దార్ కు విన్నవించిన న్యాయవాదులు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలు హైకోర్టు బెంచ్ ని ఏర్పాటు చేయాలని హిందూపురం న్యాయవాదుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజులపాటు విధులు బహిష్కరించాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్, కృష్ణమూర్తిల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసిల్దార్ వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, గతంలో కూటమి ప్రభుత్వం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి కూడా పంపుతున్నట్లు పేర్కొన్నట్లు తెలిపారు. దీనికి తోడు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేసేందుకు న్యాయమూర్తులతో ప్రత్యేక కమిటీ సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు కార్యరూపం దాల్చకపోగా అనేక అనుమానాలు తలెత్తుతున్నాయని వాపోయారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ స్థానంలో సర్క్యూట్ లేదా మొబైల్ బెంచ్ ఏర్పాటు చేసే దిశలో ప్రభుత్వ ఆలోచన ఉన్నట్లు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కర్నూల్లో హైకోర్టు గురించి తప్ప ఇతర ఎలాంటి ప్రత్యామ్నాయ పెంచులను అంగీకరించేది లేదని న్యాయవాదుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగప్ప, సత్యనారాయణ, సిద్దు, రామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, కోదండ రామారావు, కేశవరెడ్డి, సదాశివరెడ్డి, నాగరాజు రెడ్డి, గోపాల్, రత్న కుమార్, జయంద్, అబ్దుల్లా, మనోహర్, కదిరిష్ తదితరులు పాల్గొన్నారు.

# బళ్లారి జిల్లా కుడితిని లో మంత్రి నారా లోకేష్ కి ఘన స్వాగతం పలికిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

బళ్లారిలోని జిందాల్ విజయ్ నగర్ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు మంగళవారం స్వాగతం పలికిన కర్ణాటక మంత్రి నాగేంద్ర, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూర రెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ చల్లా లక్ష్మీ ప్రసాద్, టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కాసేపట్లో బళ్లారి మండలం హాలకుందిలోని సుజ్లాన్ బ్లేడ్ స్టాక్ యార్డ్‌ను సందర్శించనున్న మంత్రి నారా లోకేష్ అనంతరం రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర గ్రామంలో సుజ్లాన్ విండ్ పవర్ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేయనున్న మంత్రి లోకేష్ పవన విద్యుత్ ప్రాజెక్టులకు శంకుస్థాపనతో పాటు సుజ్లాన్ ూ144 న్యూ బ్లేడ్ ప్రొడక్షన్ లైన్స్ ను ప్రారంభించనున్న మంత్రి లోకేష్ అనంతపురం జిల్లాలో రూ.10వేల కోట్లతో 1325 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటుచేయనున్న సుజ్లాన్ సంస్థ పవన విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 4వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్న సుజ్లాన్ కంపెనీ వారు తెలిపారు. కణేకల్ మండలం, కణేకల్ క్రాస్ వద్ద సుజ్లాన్ విండ్ టర్బైన్ తయారీ విస్తరణ యూనిట్ శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ , కమ్యూనికేషన్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.



# వసతి గృహాలలో ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకురావాలి జిల్లా జాయింట్ కలెక్టర్

- ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ
- అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలి
- వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలి
- విద్యార్థులకు ప్రతినెల క్రమం తప్పకుండా వైద్య పరీక్షల నిర్వహించాలి



ప్రజాభూమి ప్రతినిధి, అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లాలోని వివిధ శాఖల సంక్షేమ అధికారుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక నిధులు ఖర్చు చేస్తూ వారి సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర శాఖల అధికారులు సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని వసతి గృహాలలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు ఇవ్వడం జరుగుతుందని ఆర్వో ప్లాంట్ లేని చోట గోరువెచ్చని నీటిని విద్యార్థులకు ఇవ్వాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రతినెలా క్రమం తప్పకుండా ఆయా వసతి గృహాల సమీపంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్లతో వైద్య పరీక్షలు తప్పక చేయించాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం ఇవ్వాలన్నారు. విద్యార్థుల భోజన విషయంలో ఎటువంటి సమస్యలు వచ్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం ఇవ్వాలని అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం నాణ్యతగా ఉండాలన్నారు. కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితులలో విద్యార్థులకు ఇవ్వకూడదన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారం ప్యాకెట్లు ఎప్పటికప్పుడు ఎక్స్పైర్ డేట్ చెక్ చేసి తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులందరు ఎత్తుకు తగ్గ బరువు, పౌష్టికాహార లోపం లేకుండా ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండేటట్లు అక్కడి సిబ్బంది చూడాలన్నారు. ఈ ఏడాది పదవ తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యే విధంగా వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా ఉత్తీర్ణత శాతం తగ్గకుండా తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య 100% ఉండేటట్లు చూడాలన్నారు. డ్రాప్ అవుట్ విద్యార్థులను తిరిగి చేర్పించే విధంగా సంక్షేమ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు అంశాలపై జాయింట్ కలెక్టర్ అధికారులకు కూలంకుషంగా వివరించి దిశా, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంక్షేమ అధికారులు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి బోల్తా పడ్డ కారు

### -ఇద్దరికి గాయాలు

### -మదనపల్లి వైపు వెళ్తుండగా కొట్నూరు చెరువు కట్టపై ప్రమాదం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణ సమీపంలోని కొట్నూరు చెరువు కట్టపై మంగళవారం కారు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మదనపల్లికి చెందిన రేణుకాదేవి, రజిత ఇద్దరూ కలిసి హిందూపురం పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో అక్కడే ఉన్న చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. అనంతరం కారులో మదనపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. పట్టణ సమీపంలోని కొట్నూరు చెరువు కట్టపైకి చేరుకోగానే కారు ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడినట్లు సమాచారం. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రేణుకాదేవి, రజిత స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు బోల్తా పడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులకు సహాయం అందించారు. అనంతరం క్షతగాత్రులను 108 సఅంబులెన్స్‌లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### -దీపికా వేణు రెడ్డికి సూచించిన వైఎస్ జగన్



ప్రజాభూమి, హిందూపురం టౌన్

కూటమి ప్రభుత్వం చేస్తున్న వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దీపికా వేణురెడ్డికి పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మంగళవారం విజయవాడ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సమన్వయకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దీపికా వేణురెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై అనుసరించాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. సమన్వయకర్తల సమావేశం అనంతరం దీపికా వేణు రెడ్డి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హిందూపురం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ కార్యకలాపాలపై జగన్మోహన్‌రెడ్డి ఆరా తీసినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల తరఫున గళమెత్తాలని జగన్ సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. క్షేత్రస్థాయిలో ప్రజలను కలుస్తూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం పార్టీ తరఫున పోరాటాలు నిర్వహించాలని సూచించినట్లు తెలిపాయి. జగనన్న సూచనల మేరకు హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని దీపికా వేణురెడ్డి తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల పక్షాన పోరాటాలను కొనసాగిస్తామని ఆమె పేర్కొన్నారు.

# మరొకమ్మ క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం

### కారు--టూవీలర్ ఢీ.. ముగ్గురకి గాయాలు -ఒకరి పరిస్థితి విషమం



ప్రజా భూమి శింగనమల

శింగనమల మండల పరిధిలోని మరొకమ్మ క్రాస్ వద్ద మంగళవారం కారు, టూవీలర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో టూవీలర్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల కు ఒకరి పరిస్థితి విషమంగా ఉంది మరో ఇద్దరికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు శింగనమల గ్రామానికి చెందిన సుధాకర్ 18 సంవత్సరాలు పరిస్థితి విషమంగా ఉంది తండ్రి గోల్కొండ వారి చిన్నాన్న నారాయణస్వామి మూడో వ్యక్తి చంద్రశేఖర్ గాయలయ్యాయి ప్రమాద గల కారణం కారు, టూవీలర్ ఎదురెదురుగా వస్తున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఢీకొన్న వెంటనే టూవీలర్‌పై ఉన్న వ్యక్తులను రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన వ్యక్తులను చికిత్స కోసం శింగనమల కు ఆసుపత్రికి ఇద్దరిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు ఘటన సమాచారం తెలుసుకున్న పోలీసు రత్నాచలం చేరుకొని విచారణ చేపట్టారు ఘటన గల కారణాలు పోలీస్ విచారణలో తెలియాల్సి ఉంది

# కామర్స్‌తో 'సీఏ'లో బంగారు భవిష్యత్

- తక్కువ ఖర్చుతో ప్రతిష్ఠాత్మక కెరీర్ -విస్తృత ఉద్యోగ అవకాశాలు
- సీఏ అవగాహన సదస్సులో ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వరదరాజులు




ప్రజాభూమి, హిందూపురం టౌన్

కామర్స్ విద్యను అభ్యసించే విద్యార్థులకు చార్టెడ్ అకౌంటెన్సీ (సీఏ) కోర్సుతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ వరదరాజులు తెలిపారు. తక్కువ ఖర్చుతో సీఏ కోర్సును పూర్తిచేసి ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. దక్షిణ భారత సమాఖ్య ఇండియన్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం ఎల్‌ఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు సీఏ కోర్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరదరాజులు మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో కామర్స్ రంగానికి మంచి డిమాండ్ ఉందన్నారు. అకౌంటింగ్, ఆడిటింగ్, టాక్సేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, కార్పొరేట్ రంగాల్లో సీఏలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు. సీఏ కోర్సును లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ పట్టుదలతో ముందుకు సాగితే మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని సూచించారు. సీఏ కౌన్సిలర్ బాలాజీ గణేష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సీఏ కోర్సుపై సమగ్ర అవగాహన కల్పించారు. కోర్సులో ప్రవేశానికి అవసరమైన అర్హతలు, కోర్సు దశలు, పరీక్షల విధానం, చదువుకునే విధానం, కోర్సు పూర్తయిన అనంతరం లభించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివరించారు. విద్యార్థులు తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా కామర్స్ రంగాన్ని ఎంచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పదో తరగతి నుంచే విద్యార్థులు తమ భవిష్యత్ కెరీర్‌పై స్పష్టమైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. సీఏతో పాటు కామర్స్ రంగంలో ఉన్న వివిధ అవకాశాలను విద్యార్థులకు వివరించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ అవగాహన సదస్సులో ఎల్‌ఆర్‌జీ సంస్థల కార్యదర్శి పి.బాల సుందరం, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.బ్రహ్మాచారి, అకాడమీ డైరెక్టర్ ప్రసాద్, ఏవో సంజీవరెడ్డి, అధ్యాపక బృందం, బసనపల్లి, కోటిపి, సంతేబిదనూరు, తూముకుంట, లయోలా, ఎల్‌ఆర్‌జీ విద్యాలయం, ఎల్‌ఆర్‌జీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులతో పాటు ఎల్‌ఆర్‌జీ నాయుడు జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్, జూనియర్ ఎంఈసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమయ్య 7
బుధవారం 26 ఆగస్టు 2026

# వరి నాట్లలో సిరులు చిందించే జానపద స్వరాలు పల్లె జీవనానికి సంగీత మకరందం





ప్రజా భూమి పోరుమామిళ్ల : వరినాట్లలో సిరులు చిందించే జానపద స్వరాలు, పల్లె జీవనానికి సంగీత మకరందం. కష్టాన్ని మరిపించే ఔషధంగా, మహిళా కూలీల అంతరంగ అభివ్యక్తిగా నిలిచే ఈ జానపద గేయాలపై ప్రత్యేకంగా:

శ్రమ స్వేదానికి సంగీత మకుటం

పొంగి మట్టి నీళ్లలో గంటల తరబడి వంగి నాట్లు వేయడం తీవ్రమైన శారీరక శ్రమతో కూడుకున్న పని. ఈ అలసటను జయించేందుకు పల్లె స్త్రీలు పాటనే ఆయుధంగా, ఔషధంగా చేసుకున్నారు. పొలం గట్టు మీద ఒకరు పాట ఎత్తుకుంటే, నాట్లు వేసే మిగతా కూలీలందరూ దానికి శ్రుతి కలిపి ఊకొడుతూ పల్లవి అందుకుంటారు. చేతులు చకచకా నాట్లు వేస్తుంటే, లయాన్వితమైన ఈ కోరస్ పనిలో సరికొత్త ఉత్సాహాన్ని, వేగాన్ని నింపుతుంది.

పల్లె పాటల్లో బహుముఖ కోణాలు పరినాట్ల పాటలు కేవలం వ్యవసాయానికే పరిమితం కాకుండా సమగ్ర పల్లె జీవితాన్ని ఆవిష్కరిస్తాయి:

భక్తి భావం: పని ప్రారంభించే ముందు ఇంద్రుడు, గంగమ్మలతో పాటు గ్రామ దేవతలను స్మరిస్తారు. "పుట్టలే గౌరమ్మ ఏమేమి కోరుకుంటావు..." అంటూ సాగే గౌరమ్మ పాటలు స్త్రీల సంప్రదాయానికి ప్రతీకలు.

జానపద కథా గేయాలు: నాట్లు పూర్తయ్యేంత వరకు సమయం తెలియకుండా ఉండేందుకు కాటమరాజు, బాలనాగమ్మ వంటి సుదీర్ఘ కథలను గేయ రూపంలో ఆలపిస్తారు. సంసార, ప్రణయ ముచ్చట్లు: అత్తాకోడళ్ల పోరు, బావామరదళ్ల సరసాలు, పల్లె ప్రేమికుల ముచ్చట్లు ఈ పాటలకు ప్రధాన వస్తువులు.

భాషా సౌందర్యం: గ్రాంథికాల కృత్రిమత్వం లేకుండా, మట్టి వాసన వేసే అచ్చ తెలుగు పదాలు, సామెతలు, సహజ సిద్ధమైన అంత్యప్రాసలతో ఈ పాటలు అలరిస్తాయి.

నేటి పరిస్థితి - సంరక్షణ ఆవశ్యకత

అంశం । పూర్వపు పరిస్థితి । నేటి పరిస్థితి

నాట్లు వేసే విధానం । సమిష్టిగా శ్రమచేస్తూ, గొంతు కలిపి పాడటం । యంత్రాల వినియోగం, వేగవంతమైన నాట్లు ।

పొలాల్లో శబ్దాలు । మట్టి వాసనతో కూడిన జానపద స్వరాలు । డీజిలు, మొబైల్ ఫోన్ల సౌండ్లు ॥ సంస్కృతి । తర తరాలుగా నోటి మాటగా ప్రచారం । క్రమంగా మూగబోతున్న మట్టి పాటలు

పరినాట్ల పాటలు కేవలం కాలక్షేపం కావు; అవి కష్టజీవుల స్వేద ధారల కావ్యరూపాలు. విశ్వవిద్యాలయాలు, సాంస్కృతిక సంస్థలు చొరవ తీసుకుని ఈ అమృత గానాలను రికార్డు చేసి భద్రపరచాలి. ఈ మట్టి పాటలను సేకరించి తర్వాతి తరాలకు అందించడం మనందరి బాధ్యత. వ్యాసకర్త: బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల

## మంగళ గౌరీ వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహణ

**- మంగళ గౌరీ వ్రతంతో సౌభాగ్యం, సుమంగళిత్వం కలకాలం నిలుస్తుందనే ప్రగాఢ నమ్మకం**





ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ గౌరీదేవి దేవస్థానంలో శ్రావణ మంగళవారం సందర్భంగా మంగళ గౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించామని వేంపల్లె బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు కొత్తూరు రత్నాలమ్మ, కన్వీనర్ డా. రాజారామ్ లు తెలిపారు. ఆలయ అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారిని తోమాలలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఆలయంలో సామూహికంగా మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరాశక్తి పార్వతీదేవి మరో రూపమే మంగళ గౌరీ అని తెలిపారు. మంగళ గౌరీ వ్రతాన్ని ఆచరించడం ద్వారా మహిళలకు సౌభాగ్యం, సుమంగళిత్వం కలకాలం నిలుస్తుందనే ప్రగాఢ నమ్మకం ఉందన్నారు. నూతనంగా వివాహమైన మహిళలు తమ మాంగల్య భాగ్యం పదికాలాలపాటు పచ్చగా ఉండాలని కోరుకుంటూ ఈ వ్రతాన్ని ఆచరిస్తారన్నారు. వివాహమైన మొదటి సంవత్సరం నుంచి ఐదేళ్లపాటు ఈ వ్రతాన్ని కొనసాగించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం గౌరవాధ్యక్షులు కొత్తూరు రెడ్డయ్య, డా. రంగయ్య, ఉపాధ్యక్షులు యడాల రామచంద్ర, ఎద్దుల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధిపై దృష్టి సారించిన మున్సిపల్ కమిషనర్

**సమయపాలన, వన్ను వసూలుపై కమిషనర్ తనూజ ఆదేశాలు**

**రెవెన్యూ, ఇంజనీరింగ్, శానిటేషన్ శాఖలతో సమీక్షా సమావేశం**



ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ తనూజ అన్ని శాఖాధిపతులు మరియు కార్యాలయ సిబ్బందితో మంగళవారం శాఖల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా కార్యాలయ సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను మరియు షాపింగ్ కాంప్లెక్స్ ల బాడుగలను 100 శాతం వసూలు చేసేందుకు రెవెన్యూ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. నీటి సరఫరా, వీధి లైట్ల నిర్వహణ,భూగర్భ డ్రైనేజీ నిర్వహణ వంటి విషయాలలో ఇంజనీరింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పట్టణంలో ఎక్కడా అనధికార కట్టడాలు నిర్మించకుండా ప్లానింగ్ విభాగం నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి సేకరించడం పట్టణ పరిశుభ్రత కోసం శానిటేషన్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నా రు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకుసిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని తెలిపారు.

## జనబాటతో విద్యుత్ సమస్యలకు పరిష్కారం



ప్రజాభూమి, సిద్ధవటం:

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే జనబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ జయచంద్ర తెలిపారు. మండలంలోని కడపాయపల్లె గ్రామంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలపై జనబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జనబాట కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించి, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. రైతుల పంట పొలాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమ్మ అనాథ వృద్ధ శరణాలయంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు

**- వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు**






ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్పింగ్ హార్ట్స్ ద్వారా మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణ సమీపంలోని రాజీవ్ కాలనీలోని అమ్మ అనాథ వృద్ధ శరణాలయంలో వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్లు సజియా బేగం, హరిత, అధ్యాపకులు, విద్యార్థులు కలిసి వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె. ఉషశ్రీ మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవా స్ఫూర్తిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా వారిలో మానవతా విలువలు పెంపొందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

## డిగ్రీ, పీజీ విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్

**ప్రొద్దుటూరులో ఆగస్టు 29 నుంచి 31 వరకు పోటీలు..**

**విజేత జట్టుకు రూ.30 వేలు**

**టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి**



ప్రజాభూమి, పులివెందుల

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప జిల్లా టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పులివెందుల నియోజకవర్గంలోని డిగ్రీ, పీజీ విద్యార్థులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి యాసిన్ తెలిపారు. ఆగస్టు 29, 30, 31 తేదీల్లో ప్రొద్దుటూరు పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో 16 జట్లకు మాత్రమే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రన్నరప్ జట్టుకు రూ.20 వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లేదా కరస్పాండెంట్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని, ముందుగా నమోదు చేసుకున్న జట్లకు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ ప్రాతిపదికన అవకాశం కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడంతోపాటు క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 7893447784, 9581965939, 6303254192 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఓటర్ల అభ్యంతరాలను 28లోపు పరిష్కరించుకోవాలి



ప్రజాభూమి, సిద్ధవటం: ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలు, మార్పులు ఉంటే ఈ నెల 28లోపు పరిష్కరించుకోవాలని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీల్ సూచించారు. మంగళవారం గ్రామ సచివాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 1,370 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. వీరిలో బీసీలు 1,066 మంది, ఎస్టీలు 55 మంది, ఎస్సీలు 85 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు లేదా అభ్యంతరాలు ఉన్నవారు ఫారం-2 ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ నెల 28లోపు పరిష్కరించుకోవాలని సూచించారు.

## పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రజాభూమి, సిద్ధవటం: కుందు నది నుంచి భారీగా నీరు చేరడంతో పెన్నా నదిలో నీటి ప్రవాహం పెరిగిందని, పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్ధవటం ఎస్సై హారిక సూచించారు. మంగళవారం సిద్ధవటం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ నది తీర ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లవద్దని హెచ్చరించారు. పెన్నా ఇసుక మేట ప్రాంతాల్లో బర్రెలు, మేకలను మేపే యజమానులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇసుక తవ్వకాల కారణంగా నదిలో గోతులు ఏర్పడ్డాయని, ప్రస్తుతం నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. లింగంపల్లి, మాచుపల్లి, మూలపల్లి, వంతాటిపల్లి తదితర గ్రామాల రైతులు, ప్రజలు నదిలోకి దిగవద్దని సూచించారు. నది పరివాహక ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## చెస్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం

**- శ్రీ చైతన్య హైస్కూల్ విద్యార్థిని తనుశ్రీ ప్రతిభ**

**- కరస్పాండెంట్ బి. చక్రపాణి రెడ్డి**



ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని తలారి తనుశ్రీ చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం సాధించడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని పాఠశాల కరస్పాండెంట్ బి. చక్రపాణిరెడ్డి తెలిపారు. గుంటూరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్--16 బాలికల విభాగంలో తను శ్రీ ఈ ఘనత సాధించిందని ఆయన పేర్కొన్నారు. చిన్న వయసు నుంచే చెస్‌పై ఆసక్తి పెంచుకుని నిరంతర సాధనతో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డిలతో కలిసి తనుశ్రీని అభినందించారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన తెలిపారు. తనుశ్రీ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

## జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం



ప్రజాభూమి, పులివెందుల

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం తన నివాసంలో ప్రారంభించారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నేత్రదాన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా ఇద్దరు అంధులకు చూపును అందించవచ్చన్నారు. ఇది అత్యంత గొప్ప మానవతా సేవని, ప్రజలు మూఢనమ్మకాలు వీడి స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో స్నేహిత సేవాసమితి చేస్తున్న కృషి అభినందనీయమని వైఎస్ మనోహర్ రెడ్డి అన్నారు. కుటుంబంలో ఎవరైనా మరణిస్తే 9966509364 నంబర్ కు సమాచారం ఇస్తే 4-6 గంటల్లో ఉచితంగా కార్నియాలు సేకరిస్తామని సేవాసమితి తెలిపింది. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.

## కులంపై అభ్యంతరాలుంటే తెలియజేయండి



ప్రజాభూమి పోరుమామిళ్ల : గ్రామపంచాయతీలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితాలు కులాల వారీగా సిద్ధం చేశామని, వీటిని పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఓటర్లు తెలియజేయవచ్చని పోరుమామిళ్ల కార్యనిర్వాహక అధికారి యశ్వంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పంచాయతీలోని 20 వార్డులకు సంబంధించి ఓటర్ల కులాలను గుర్తించి వివరాలు నమోదు చేశామన్నారు. వీటిని పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చు అని చెప్పారు. తదుపరి వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి మార్పులు ఉంటే చేస్తామని ఆయన పేర్కొన్నారు. పోరుమామిళ్ల మొత్తము 13507 ఓట్లు ఉన్నాయన్నారు. ఒక్క వార్డుకు 675 ఓట్లు వంతున ఉండగా 20వ వార్డుకు మాత్రం 682 ఓట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే పోలింగ్ బూత్లను కూడా గుర్తించామని ఆయన చెప్పారు. వచ్చిన అభ్యంతరాలను ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు విచారించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## వారసత్వ వ్యవసాయ భూమిలో న్యాయం చేయాలని రైతుల విజ్ఞప్తి



ప్రజాభూమి పోరుమామిళ్ల : కడప జిల్లా కలసపాడు మండలం దులంవరిపల్లి, కొండపేట గ్రామాలకు చెందిన తప్పెట చెంచు ఓబయ్య, తప్పెట చిన్న ఓబయ్య, కొర్రపాటి యేసయ్య, ఒద్దేపోగు బాల ఓబులు మాట్లాడుతూ, కొండపేట గ్రామ పరిధిలో తమ పూర్వీకుల నుండి వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిపై వివాదం ఏర్పడిందని తెలిపారు. సర్వే నంబర్ 322లోని 5.55 సెంట్ల భూమిని సుమారు 70 సంవత్సరాలకు పైగా తమ కుటుంబాలు సాగు చేసుకుంటూ స్వాధీన అనుభవంలో ఉంచుకున్నామని తెలిపారు. ప్రస్తుతం భూమిని చదును చేసి పంట సాగు చేసుకునే సమయంలో, కొండపేట గ్రామానికి చెందిన బసి రెడ్డి వెంకట కృష్ణ రెడ్డి, తండ్రి: రామలక్ష్మి రెడ్డి అనే వ్యక్తి సదరు భూమి తనదేనని పేర్కొంటూ వ్యవసాయ పనులకు అడ్డుపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంపై కలసపాడు తహసీల్దార్ మరియు కలసపాడు సబ్ ఇన్స్పెక్టర్ కి వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించి, సర్వే నిర్వహించి హద్దులను నిర్ధారించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూమిపై ఏర్పడిన సమస్యను అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తైక్వాండో పోటీలలో పోరుమామిళ్ల క్రీడాకారుల సత్తా





ప్రజాభూమి పోరుమామిళ్ల : శ్రీకాకుళంలోని వైయస్సార్ ఫంక్షన్ హాల్లో ఈ నెల 21, 22, 23 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో పోరుమామిళ్ల క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీలలో 4 బంగారు, 7 రజత, 6 కాంస్య పతకాలు సాధించినట్లు మాస్టర్ నాయబ్ రసూల్ తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారు: గురు తారక్, మంజునాథ్ తేజ, భవ్య, తస్విక వన్ మై. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు అక్టోబర్ 1, 2, 3 తేదీలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. రజత పతకాలు సాధించిన వారు: ప్రణీత, లోక్షిత, బద్రీనాథ్, సాత్విక్, రుతిక్, అమర్నాథ్, నారాయణ. కాంస్య పతకాలు సాధించిన వారు: లక్కీ, వెంకట నందిని, ధనుంజయ్, అన్వేష్, అజీజ్, అక్షిత్. ఈ కార్యక్రమంలో కోచ్‌లు నరసింహ ప్రసాద్, ఆంజనేయులు, విజయ్, ఉస్మాన్ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కోచ్‌లు, తల్లిదండ్రులు మరియు క్రీడాభిమానులు అభినందించారు. జాతీయస్థాయి పోటీలలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పులివెందుల తాగునీటి పథకానికి పునరుజ్జీవం

**పవన్ కళ్యాణ్ చొరవతో 96 శాతం పనులు పూర్తి,త్వరలో ఇంటింటికీ తాగునీరు-పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం**

**జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్**




ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల నియోజకవర్గ ప్రజల తాగునీటి కష్టాలకు త్వరలో పరిష్కారం లభించనుందని జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన మెగా వాటర్ గ్రిడ్ పథకానికి కూటమి ప్రభుత్వం పునరుజ్జీవం కల్పించిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో పనులు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వేంపల్లెలో దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పథకానికి పునరుజ్జీవం కల్పించి పనులను వేగవంతం చేస్తున్న పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రూ.480 కోట్ల అంచనా వ్యయంతో ఏడు మండలాల్లోని 5.5 లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ పథకంలో 96 శాతం ఓవరాల్ పనులు, 99 శాతం పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. 1,111 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు గాను 1,106 కిలోమీటర్లు పూర్తయ్యాయని, నీటి శుద్ధి ప్లాంట్, ఇంటేక్ వెల్ పునరుద్ధరణ పనులు కూడా పూర్తయ్యాయని చెప్పారు. పులివెందుల పట్టణం, గ్రామీణ ప్రాంతం, సింహాద్రిపురం మండలాల్లో పనులు పూర్తయ్యాయని, ఇప్పటికే ఆయా ప్రాంతాలకు తాగునీరు అందుతోందన్నారు. మిగిలిన ప్రాంతాల్లోనూ పనులు త్వరగా పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు దాసరి రవిశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, రంగారెడ్డి, కృష్ణ, రామాంజనేయులు, చెన్నకృష్ణ రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో నామినేషన్లు అడ్డుకున్న చరిత్ర

**-రాబోయే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు స్వేచ్ఛగా పోటీ చేయవచ్చు: అతికారి కృష్ణ**



ప్రజాభూమి, సిద్ధవటం: వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. మంగళవారం సిద్ధవటం ఆకులవీధిలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో టీడీపీ, జనసేన అభ్యర్థులపై దౌర్జన్యాలకు పాల్పడి, నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంతో పాటు తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నిర్భయంగా, స్వేచ్ఛగా నామినేషన్లు వేసి పోటీ చేయవచ్చని అధికారి కృష్ణ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన దౌర్జన్యాలు, అవినీతి, దోపిడీపై ప్రజలకు అవగాహన ఉందన్నారు.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు
8
బుధవారం 26 ఆగష్టు 2026

# ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

## - పాడిపేటలో వినియోగానికి నోచుకోని చెత్త సేకరణ ఎలక్ట్రిక్ వాహనాలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

పాడిపేట గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తడి చెత్త--పొడి చెత్తను ఇంటింటి నుంచి సేకరించడం కోసం ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనాలు పాడిపేట గ్రామపంచాయతీ పరిధిలో నిరుపయోగంగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తులను అధికారులు సంరక్షించాల్సి ఉండగా, నెలల తరబడి వాటిని చెత్త సేకరణకు వినియోగించకుండా వదిలేయడంతో వాహనాలు దినదినాభివృద్ధికి చేరుతున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హయాం నుంచి గ్రామంలో పారిశుధ్య నిర్వహణలో భాగంగా తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అయితే పాడిపేట గ్రామపంచాయతీ పరిధిలో ఈ వాహనాలు ప్రస్తుతం ప్రజలకు ఉపయోగపడకుండా పంచాయతీ కార్యాలయం పరిసరాల్లోనే నిర్లక్ష్యంగా నిలిపివేయబడి ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.ముఖ్యంగా పంచాయతీ కార్యాలయం ముందే ఒక ఎలక్ట్రిక్ చెత్త సేకరణ వాహనం చుట్టూ పెద్ద ఎత్తున ముళ్లపొదలు, చెట్లు పెరిగి వాహనం కనిపించని స్థాయికి చేరడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. వాహనాలను ఎప్పటికప్పుడు శుభ్రపరిచి, మరమ్మతులు అవసరమైతే చేయించి, గ్రామ పారిశుధ్య కార్యక్రమాలకు వినియోగించాల్సి ఉండగా వాటిని ఇలా వదిలేయడం వల్ల ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిధులతో కొనుగోలు చేసిన ప్రతి వాహనం ప్రజల ఆస్తేనని, వాటి వినియోగం, నిర్వహణ, భద్రతపై పంచాయతీ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజలు పేర్కొంటున్నారు. వాహనాలు ఎంతకాలంగా వినియోగంలో లేవు? వాటిని ఎందుకు చెత్త సేకరణకు ఉపయోగించడం లేదు? వాటి నిర్వహణకు కేటాయించిన నిధులు ఎంత? ఇప్పటివరకు వాటిపై ఎంత ఖర్చు చేశారు? ప్రస్తుతం వాహనాల పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని గ్రామ




ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా పాడిపేట గ్రామపంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, వాహనాల నిర్వహణ తదితర అంశాలపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ రికార్డుల్లో వాహనాల వినియోగం, డీజిల్/చార్జింగ్, మరమ్మతులు, నిర్వహణ తదితర అంశాలకు సంబంధించిన నమోదులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని ప్రజల ముందుకు తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల నష్టం వాటిల్లితే సంబంధిత బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను వెంటనే పునరుద్ధరించి, గ్రామంలోని తడి చెత్త--పొడి చెత్త సేకరణకు వినియోగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. "ప్రజల పన్నుల రూపంలో వచ్చిన నిధులతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తులు అధికారుల నిర్లక్ష్యానికి గురికాకూడదు. పాడిపేట పంచాయతీలో జరుగుతున్న పరిణామాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, వాహనాల పరిస్థితి, వాటి వినియోగం, నిర్వహణపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి" అని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ఎన్ఎస్ఆర్ కాలనీలో చెట్టు బీభత్సం..

విద్యుత్ వైర్లపై చెట్టు విరిగిపడి స్తంభం నేలకూలింది
- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట:



నాయుడుపేట పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో భారీ చెట్టు విద్యుత్ వైర్లపై విరిగిపడటంతో విద్యుత్ స్తంభం సైతం విరిగిపోయి నేలకూలింది. దీంతో కాలనీలో తీవ్ర భయాందోళన నెలకొంది. విద్యుత్ వైర్లు రోడ్డుపై వేలాడుతుండటంతో ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారిలోనే విద్యుత్ స్తంభం విరిగిపడి, వైర్లు అడ్డంగా వేలాడుతున్నా సంబంధిత అధికారులు వెంటనే స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత కూడా అధికారులు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ వైర్లు తాకే ప్రమాదం ఉండటంతో చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర భయంతో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది అంటూ స్థానికులు అధికారులను నిలదీస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి విరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, విద్యుత్ వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డుపై పడిన చెట్టును పూర్తిగా తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు... ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొనాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎండి పుత్తూరు అంగన్వాడీ కేంద్రంలో అధికారుల ఆకస్మిక తనిఖీ - చిన్నారుల భద్రతపై ఆరా

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఎండి పుత్తూరు గ్రామ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని సీడీపీఓ కృష్ణవేణి రెడ్డి,సూపర్ వైజర్ అనితా రెడ్డి, మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు అంగన్వాడీ కేంద్రంలో పిల్లల హాజరు రిజిస్టర్, పోషకాహార స్టాక్ రిజిస్టర్, గర్భిణీలు, బాలింతల వివరాలు, పిల్లల బరువు, ఎత్తు నమోదు పుస్తకాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రానికి సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పాలు, బాలామృతం, రాగిజావ నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వంట గది, మరుగుదొడ్లు, తాగునీటి వసతి, కేంద్ర పరిసరాల పరిశుభ్రతను చెక్ చేశారు. అనంతరం ఎండి పుత్తూరు గ్రామస్తులు, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారుఈ సందర్భంగా సీడీపీఓ కృష్ణవేణి మాట్లాడుతూ.. "చిన్నారులకు అంగన్వాడీ కేంద్రమే మొదటి బడి. ఇక్కడే వారికి భద్రత, ఆరోగ్యకరమైన పోషకాహారం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి. పిల్లల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకూడదు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ తప్పనిసరిగా కేంద్రానికి పంపాలి" అని సూచించారు. పిల్లలకు జ్వరం, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ఆశా కార్యకర్తలకు, పీహెచ్సీ వైద్యులకు తెలియజేయాలని, అంగన్వాడీ టీచర్, హెల్పర్ లకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వం గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధికారులు తమ గ్రామానికి వచ్చి పిల్లల భవిష్యత్తు పట్ల ఇంత శ్రద్ధ చూపడం, పిల్లలకు మెరుగైన సేవలు అందించేందుకు తీసుకున్న మంచి నిర్ణయాలకు ఎండి పుత్తూరు గ్రామస్తులు సీడీపీఓ కృష్ణవేణి మేడం, సూపర్ వైజర్ అనితా రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారుల సూచనల మేరకు తమ పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీకి పంపుతామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, హెల్పర్, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా కీ.శే. శాంతారామ్ రావు జె. పవార్ జయంతి వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తి పట్టణంలోని 'ది స్కూల్' ఆవరణలో జనార్ధన్ పవార్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు, మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కీ.శే. శాంతారామ్ రావు జె. పవార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు హాజరై, శాంతారామ్ రావు జె. పవార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ అందరివాడు శాంతారామ్ కులం, మతం, వర్గం, వర్ణంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా చేరదీసే వ్యక్తిత్వం శాంతారామ్ ది. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందరివాడుగా నిలిచారని, ఆయన భౌతికంగా మనకు దూరమవ్వడం తీరని లోటని పేర్కొన్నారు. ఆశయాల సాధన శాంతారామ్ ఆశయాలకు అనుగుణంగానే జనార్ధన్ పవార్ 'ది స్కూల్'ను విజయవంతంగా నడుపుతున్నారని, ప్రస్తుతం ఈ పాఠశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పాఠశాల, చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమన్నారు.మచ్చలేని నాయకత్వం శ్రీకాళహస్తి దేవస్థాన చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా ఎక్కడా అవినీతి మరక పడకుండా పాలన సాగించిన ఘనత శాంతారామ్ దేనని కొనియాడారు. తమకు దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా అవకాశం వచ్చినప్పుడు ఆయన మార్గదర్శకత్వాన్ని స్మరించుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు తెలిపారు.శాంతారామ్ రావు పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఆయన కుటుంబ సభ్యులైన డాక్టర్ అర్చనకు, సోదరులకు జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రత్నం రెడ్డి, శ్రీవారి సురేష్, కంటా ఉదయ్ కుమార్, పటాన్ ఫరీద్, ఆర్కాడ్ శంకర్, గౌడ్, జూమ్లేష, బావాజీ, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రెడ్డి వారి గురవారెడ్డికి కుంభాభిషేక కార్యక్రమానికి ఆహ్వాన పత్రిక అందజేసిన గ్రామ ప్రజలు

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



మంగళవారం ఏర్పేడు మండలం మన్న సముద్రం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రాములు వారి ఆలయ కుంభాభిషేక కార్యక్రమం కి హాజరవాల్సిందిగా ఆలయ ధర్మకర్తలు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మరియు నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి ని వారి స్వగృహంలో కలిసి శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రిక అందజేసిన ఆలయ ధర్మకర్తలు సున్నపు సురేష్ రెడ్డి సదా శంకర్ నాయుడు మోహన్ రెడ్డి సున్నపు వెంకటేశ్ రెడ్డి కొత్త కాలవ జయముని తదితరులు తో పాటు మండల పార్టీ ఉపాధ్యక్షులు ఆర్ శివ శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వర్ణముఖి నది పరిరక్షణకు కలెక్టర్ తక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



స్వర్ణముఖి నది రివర్ బెడ్, బఫర్ జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాలు, ఐదు నుంచి ఆరు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నదికి సమీపంలో భారీ నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరు చేస్తున్నారో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని కోరుతున్నారు. మరోవైపు పట్టణంలోని చెత్తను నదిలో పడవేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలు, వాటికి ఇచ్చిన అనుమతులపై తిరుపతి జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణకు ఆదేశించి, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణాల అనుమతులను రద్దు చేసి, బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఇదే నిర్లక్ష్యం కొనసాగితే భవిష్యత్తులో స్వర్ణముఖి నది ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుని నదిని కాపాడాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు

## వరదయ్యపాలెం మండలంలో తరచూ విద్యుత్ కోతలు - ప్రజలు, వ్యాపారస్తుల తీవ్ర ఇబ్బందులు

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.



వరదయ్యపాలెం మండలంలో విద్యుత్ కోతలు సర్వసాధారణంగా మారడంతో ప్రజలు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి చిరుజల్లులు కురిసినా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గంటల తరబడి విద్యుత్ లేకపోవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆకాశంలో ఉరుములు, మెరుపులు లేకపోయినా విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షం పేరుతో తరచూ విద్యుత్ కోతలు విధించడం వల్ల రోజువారీ కార్యకలాపాలు స్తంభిస్తున్నాయని వారు వాపోతున్నారు. విద్యుత్‌పై ఆధారపడి పనిచేసే చిన్న వ్యాపారాలు, దుకాణాలు, ఇతర వృత్తులపై కూడా ఈ కోతల ప్రభావం తీవ్రంగా పడుతోంది. ఎలాంటి స్పష్టమైన కారణం లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే విద్యుత్ నిలిపివేయకుండా, అవసరమైన చోట ముందస్తు సమాచారం అందించాలని కోరుతున్నారు. విద్యుత్ కోతలకు శాశ్వత పరిష్కారం చూపి, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని వరదయ్యపాలెం మండల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## పెద్దలు శాంతారామ్ జె పవార్ సేవలు చిరస్మరణీయం: కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తి దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, మాజీ పురపాలక సంఘ చైర్మన్ స్వర్గీయ శాంతారామ్ జె పవార్ సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని, ఆయన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్ర రెడ్డి బియ్యపు కొనియాడారు. శాంతారామ్ జె పవార్ జయంతి సందర్భంగా, ఆయన నివాసం వద్ద ఉన్న విగ్రహానికి వారి కుటుంబ సభ్యులు జనార్ధన్ రావు జె పవార్, కుమార్తె డాక్టర్ అర్చన గార్లతో కలిసి పవిత్ర రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శాంతారామ్ జె పవార్ శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ గా మరియు పురపాలక సంఘ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహిస్తూ పట్టణాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి విశేష సేవలు అందించారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రత్నం రెడ్డి,నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ పఠాన్ ఫరీద్, కోవి చంద్రయ్య నాయుడు, మాజీ దేవస్థానం బోర్డు మెంబర్ మున్నా రాయల్, యువజన విభాగ అధ్యక్షులు సూర సురేష్, ఉత్తరాజి శరవణ కుమార్,పెరుమాళ్ చౌదరి, ఫజల్, జుంలేష, మెహబూబ్ బాషా, జీలాని, బావాజీ, అస్లాం, గౌస్ బాషా, గిరి రెడ్డి, బుగ్గ హరి, కాపులూరి వెంకీ, శ్రీరాములు రెడ్డి, రవి నలుగురి, షరీఫ్, ఖాదర్ బాషా, విజయ్ కుమార్ రెడ్డి, ఆరీఫ్, బాబు, ఉస్మాన్, మస్తాన్, రియాజ్, సాదిక్, గిరి, యాకుబ్, దివ్య కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోండి-నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



అమరావతి ఛాంపియన్ షిప్ – 2026 లో పాల్గొంటున్న క్రీకారులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులను ఆదేశించారు. మంగళవారం తారకరామ స్టేడియం, క్యాంపస్ స్కూలు , మహిళా విశ్వవిద్యాలయం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో జరుగుతున్న క్రీడా పోటీలను, ఏర్పాట్లను తిరుపతి నగర కమిషనర్ ఎం.జయకృష్ణ సందర్శించారు. వారికి కల్పించిన సౌకర్యాలను క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, పారిశుధ్యం, తాగునీరు, విశ్రాంతి, వైద్య సౌకర్యాలు వంటి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చూడాలని అధికారులు ఆదేశించారు. క్రీడల ద్వారా యువతలో ఆరోగ్యకరమైన పోటీతత్వం, నిబద్ధత, క్రమశిక్షణ పెంపొందుతాయని అన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, సానిటరీ సూపర్వైజర్ చెంచయ్య మరియు సిబ్బంది, క్రీడాకారులు ఉన్నారు.

## అంగన్వాడి సెంటర్లు విద్యకు తొలి సోపానాలు

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఈరోజు మంగళవారం నాడు ఏర్పేడు మండల విద్యాశాఖ అధికారి దయాకర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వంగూరు నందు జరుగుతున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని అంగన్వాడి సెంటర్లు విద్యకు తొలి సోపానాలని తెలియజేశారు. ప్రతి అంగన్వాడి వర్కర్ కన్నతల్లి వలె విద్యార్థులకు చక్కగా బోధించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ప్రభుత్వం వారు అందిస్తున్నటువంటి పోషకాహారాన్ని అంగన్వాడీ విద్యార్థులకు సక్రమంగా అందించి శారీరక అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. ప్రభుత్వం వారు అంగన్వాడీలకు సరఫరా చేస్తున్నటువంటి బోధనాభ్యసన పరికరాలను ఉపయోగించి విద్యార్థులకు చక్కని విద్యను అందించాలని సూచించారు. వాడి విద్యార్థులకు ఆటపాటలతో విజ్ఞానాన్ని అందజేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కృష్ణవేణి అంగన్వాడి వర్కర్స్ కు అనేక సూచనలను అందించారు. అంగన్వాడి వర్కర్స్ తో పాటు అనేక కృత్యాలలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వంగూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాసిర్ ,అంగన్వాడీ సూపర్వైజర్లు రత్నమ్మ, అనితారాణి, రిసోర్స్ పర్సన్స్ గురువారెడ్డి, వెంకటరమణ, బాలాజీ, సిఆర్పి సురేష్,ఏర్పేడు మండలం నందలి అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## ఓ కుటుంబం పై పగబట్టిన మాంత్రికుడు

ప్రజాభూమి ప్రతినిధి వరదయ్యపాలెం.



బాధితుల ఫోటోలు పెట్టి తాంత్రిక పూజలు చేస్తూ ఆ కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేస్తూ మీ అంత చూస్తానని మాంత్రికుడు పదేపదే వారిని మానసికంగా హింసిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని మాంత్రికుని చర నుంచి కాపాడాలని ఆ కుటుంబం వేడుకుంటుంది. ఇది ఇలా ఉంటే మాంత్రికుడు. రెండు రోజుల్లో మీ కుటుంబాన్ని లేపేస్తామని గడువు చెప్పినట్లు కుటుంబం వెల్లడిస్తుంది. ఈ సందర్భంలో మాంత్రికుడు చేసినటువంటి వారిపై ప్రయోగించినటువంటి మంత్ర శక్తిని వారి ఆటోలో ఉంచిన మాంత్రికుడు అది చూసి భయభ్రాంతులకు గురైన కుటుంబం వెదురుకుప్పం మండలం అల్లం వారి కండ్రిగలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం దిక్కు తోచని స్థితిలో బాధిత కుటుంబం. ఈ పరిస్థితుల నుండి తమ కుటుంబాన్ని రక్షించాలని ప్రాధేయపడుతూ భయభ్రాంతులకు గురి చేసినటువంటి మాంత్రికుని కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం రక్షణ కోరుకుంటుంది. ముఖ్యంగా తిరుపతి జిల్లాలో ఈ విధమైన మాంత్రికులు చాలామంది ఉన్నారని వీరు పైన పోలీసు వారినిగా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఏర్పేడు మండలంలో ఇలాంటి వ్యక్తులు కొంతమంది సంచరిస్తున్నారని ముఖ్యంగా ఏర్పేడు బీసీ కాలనీలో ఇలాంటి వ్యక్తులు ఉన్నారని కొంతమంది పెద్ద మాంత్రికులు మాకు తెలుసు అని మా జోలికి వస్తే ఊరుకోమని బెదిరింపులు కు దిగుతూ అక్కడున్న జనాలని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఇలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రావణ సహకార డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి: డీసీసీబీ మేనేజర్ వి. కీర్తి సుధ


ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) ప్రవేశపెట్టిన ప్రత్యేక శ్రావణ సహకార డిపాజిట్ స్కీమ్‌ను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంగళం రోడ్డు బ్రాంచ్ మేనేజర్ వి. కీర్తి సుధ కోరారు. ఈ డిపాజిట్ పథకం ఆగస్టు 21 నుంచి సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. 456 రోజుల కాలపరిమితి కలిగిన ఈ పథకంలో సాధారణ ప్రజలకు 7.60 శాతం, 60 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లకు 8.20 శాతం, 80 ఏళ్లు పైబడిన సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.30 శాతం అత్యధిక వడ్డీని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై నెలవారీ లేదా త్రైమాసిక వడ్డీ చెల్లింపు సదుపాయంతో పాటు, డిపాజిట్‌పై రుణం (లోన్ ఎగైనెస్ట్ డిపాజిట్) పొందే వెసులుబాటు కూడా కల్పిస్తున్నామని ఆమె వివరించారు. ఆర్బీఐ లైసెన్స్ కలిగిన డీసీసీబీ బ్యాంకులో ప్రజల పొదుపు మొత్తాలకు పూర్తి భద్రతతో పాటు అధిక రాబడి లభిస్తుందని, ఆసక్తి గలవారు స్థానిక మంగళం రోడ్డు బ్రాంచ్‌ను సంప్రదించాలని లేదా 9985833486 నంబర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని ఆమె సూచించారు..

## రేణిగుంటగణేష్ నగర్‌లో ఘనంగా సంతాన గంగమ్మ తల్లి జాతర

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట: గణేష్ నగర్‌లో సంతాన గంగమ్మ తల్లి జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో భాజపా నాయకుడు కోలా ఆనంద్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్, మదన్ ఆధ్వర్యంలో కోలా ఆనంద్‌కు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. జాతర సందర్భంగా ఉదయం నుంచే అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి, అంబళ్లు,పొంగళ్లను సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గణేష్ నగర్ పురవీధుల్లో ఊరేగించారు . భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర అనంతరం సాయంత్రం గణేష్ నగర్‌లో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు కోలా ఆనంద్ పాటు రేణిగుంట పట్టణ బిజెపి నాయకులు వేణు ముదిరాజ్, నరేష్ రాయల్, రాజా రాయల్, యువ నాయకుడు వేణు,అరుణ్ కుమార్, గుణశేఖర్, మదన్, స్టెల్లా, మల్లిక, వరప్రసాద్, దేవయాని తదితరులు పాల్గొన్నారు.

# 7 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్స్ కు 14 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెక్కుల పంపిణీ

## ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ.



ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.
పట్టణాల పరిశుభ్రత ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికులదే కీలకపాత్ర అని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయ శ్రీ అన్నారు. మంగళవారం నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఇటీవల మృతి చెందిన పబ్లిక్ హెల్త్ వర్కర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను పంపిణీ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తూ మరణించిన 7 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్ల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ 2 లక్షల చొప్పున మొత్తం రూ 14 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ పట్టణాల పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. ఎండ,వాన అనే తేడా లేకుండా ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విధి నిర్వహణలో ఉంటూ మరణించిన కార్మికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.అనంతరం నాయుడుపేట పట్టణంలో ప్రజలకు చెత్తబుట్టలను పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని,తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజల సహకారంతోనే పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు.పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. పరిశుభ్రత అనేది మున్సిపల్ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.స్వచ్ఛమైన నాయుడుపేట నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ రఫీ, అవధానం సుధీర్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాన బాల సుబ్బారావు,తెలుగుదేశం పార్టీ నాయకులు కరీంభాయి చెంచయ్య,నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,మైలారి రాజశేఖర్, నిత్యా కృష్ణారెడ్డి,వినుకొండ ధనంజయ,పలుకూరు ముత్యాలయ్య,మొండెం బాబు, చిట్టేటి రేవతి, హైమావతి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులల్లా,పలువురు నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోగ నిరోధక శక్తి పూర్తిగా నశించడమే ఎయిడ్స్‌కు నాంది

## ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ స్టేట్స్ సామాజిక కార్యకర్త లలిత.



ప్రజా భూమి ప్రతినిధి సత్య వేడు.
హెచ్ఐవి ఇన్ఫెక్షన్ మొదటి చివరి దశకు చేరినప్పుడు రోగ నిరోధక శక్తి నశించడంతో అది ఎయిడ్స్కు దారి తీస్తుందని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ స్టేట్స్ సామాజిక కార్యకర్త లలిత అన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా సత్యవేడు పట్టణంలోని ప్రభుత్వ బాలికల,బాలుర ఉన్నత పాఠశాలలో సమగ్ర ఆరోగ్య ప్రచార రథం ద్వారా ఎయిడ్స్ నివారణ,అప్రమత్తతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త లలిత మాట్లాడుతూ రోగ నిరోధక వ్యవస్థ పై దాడి చేసి ఇన్ఫెక్షన్లతో పోరాడే సిడి4 కణాలను దెబ్బతీసే వైరస్ హెచ్ఐవి అని ఆమె పేర్కొన్నారు. సురక్షితం కానీ లైంగిక సంఘం ద్వారా ఎయిడ్స్ వ్యాపిస్తుందన్నారు.ముఖ్యంగా హెచ్ఐవి సోకిన వారు వాడిన సిరంజీలు,సూదులను ఇతరులకు వాడడం ద్వారా ఇది వ్యాప్తి చెందుతుందన్నారు. దీంతోపాటు వైరస్ ఉన్న వారి రక్తాన్ని ఆరోగ్యవంతులకు ఎక్కించడం,గర్భధారణ సమయంలో ప్రసవించిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా హెచ్ఐవి వైరస్ సోకుతుందన్నారు.అందువల్ల కొత్త స్టెరిలైజ్ చేసిన సూదులు సిరంజీలను మాత్రమే వాడాలన్నారు.అలాగే రక్త మార్పిడికి ముందు రక్తాన్ని హెచ్ఐవి పరీక్ష తప్పనిసరిగా చేయించుకొని సురక్షితమైనదిగా నిర్ధారించుకోవాలన్నారు. ఒకవేళ దీనిపై అనుమానం వస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవాలన్నారు. యాంటీ రెట్రో వైరల్ థెరపీ మందులను క్రమం తప్పకుండా వాడడం ద్వారా వైరస్ ప్రభావాన్ని తగ్గించి సాధారణ జీవితం గడపవచ్చునన్నారు.ఏది ఏమైనా హెచ్ఐవి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. హెచ్ఐవి వైరస్ లక్షణాలు గుర్తించడానికి యాంటీ బాడీ పరీక్షలు, యాంటిజెన్, న్యూక్లియర్ యాసిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు అయితే వైరస్ సోకిన మూడు నెలల తర్వాత పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమైన మార్గమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు భారతి ,పాండురంగయ్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ద్రోహి జగన్...
# రాయలసీమ బాంధవులు చంద్రన్న

## - టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్



ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:
ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమకు ఏం చేశామో కూడా చెప్పుకోలేని స్థితిలో గొడ్డలి పార్టీ నాయకులు ఉన్నారని... రాయలసీమ ద్రోహి జగన్ అయితే... సీమ బాంధవులు చంద్రబాబు అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ 2023 యువగళం పాదయాత్రను చిత్తూరు జిల్లా కుప్పం నుంచి ప్రారంభించారు. యువగళం పాదయాత్రలో రాయలసీమ జిల్లాల ప్రజల కష్టాలను చూశారు. వాళ్ల కన్నీళ్లను తుడ్చేందుకు తోడ్పాటు అందిస్తానని హామీ ఇచ్చారు. ఇవన్నీ చూసిన లోకేష్ బాబు గారు కడప నడిబొడ్డున "మిషన్ రాయలసీమ" అని రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించారు. "మేము అధికారంలోకి వస్తే ఏం చేస్తామో" అని ఆ రోజు చెప్పారు. అందులో భాగంగానే రాయలసీమ ప్రజానీకం 2024 సార్వత్రిక ఎన్నికల్లో 52 సీట్లలో 45 సీట్లు తెలుగుదేశం పార్టీకి గెలిపించి లోకేష్ మీద నమ్మకాన్ని ఉంచింది. రెండు సంవత్సరాల కూటమి ప్రభుత్వంలో రాయలసీమకు రూ.4.68 లక్షల కోట్ల పెట్టుబడులను, 3.2 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. నేడు అనంతపూర్ జిల్లాలోని అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో రూ.10 వేల కోట్ల భారీ పెట్టుబడితో సుజ్లాన్ అనే సంస్థకు ప్రారంభించారు. ఈ కంపెనీ ద్వారా 4 వేల ఉద్యోగాలు రాబోతున్నాయి. ఇప్పటికే కడప జిల్లాలో రూ.17 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్, రూ.3,500 కోట్లతో దాల్మియా సిమెంట్ సెకండ్ ఫేజ్ ప్రారంభమయ్యాయి. నేడు చంద్రబాబు, లోకేష్ ల సహకారంతో దేశంలోనే రాయలసీమ తయారీ రంగంలో అగ్రగామిగా నిలిచింది.ఇన్ని రోజులు రాయలసీమ అంటే కరువు సీమ, తాగడానికి గుక్కెడు నీళ్లు ఉండవు, నాలుగు మెతుకులు కడుపులోకి పోవాలంటే పొట్ట చేత్తో పట్టుకొని వలస వెళ్లే పరిస్థితి. ఆ పరిస్థితి నుంచి రాయలసీమను మార్చడానికి ఈ రెండు సంవత్సరాలుగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోంది. కేవలం అవే కాదు. రాయల్ ఎన్‌ఫీల్డ్, క్రియర్, ఎల్‌జి, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు రాయలసీమలో పెట్టుబడులు పెట్టే పరిస్థితి ఏర్పడింది. పుట్టపర్తిలో యుద్ధ విమానాలు తయారీ యూనిట్, అప్పుడు కియా, ఇప్పుడు రాయల్ ఎన్‌ఫీల్డ్ -- ఇవన్నీ రాయలసీమకే తీసుకొచ్చాం. ఆ రోజు లోకేష్ ఇచ్చిన వాగ్దానం, దాన్ని నమ్మి ప్రజలు ఇచ్చిన మ్యాండేట్ తర్వాత మేము రాయలసీమను అభివృద్ధి చేస్తున్నాం. కేవలం పరిశ్రమలే కాదు. అనంతపూర్ జిల్లాలో అక్కా-చెల్లెళ్లు చెప్పిన మాట -- గుక్కెడు నీళ్లు లేకుండా పొట్ట చేత్తో పట్టుకొని కర్నూల్ నుంచి వలస వెళ్లే తల్లుల బాధను చూసి -- 2014 నుంచి 2019 వరకు, 2024 నుంచి ఇప్పటి వరకు రూ.26 వేల కోట్లు రాయలసీమ ఇరిగేషన్ మీద తెలుగుదేశం ప్రభుత్వం ఖర్చు పెట్టింది. ఈ బడ్జెట్‌లో మళ్లీ రూ.10 వేల కోట్ల రూపాయలు రాయలసీమ ఇరిగేషన్ కోసం కేటాయించాం. హంద్రీ-నీవా చివరి వరకు పూర్తి చేసి నీళ్లు తీసుకెళ్తామని లోకేష్ మాట ఇచ్చారు. రాయలసీమకు శనిలా జగన్ రెడ్డి దాపురించారు. మేము రాయలసీమకు సరికొత్త చరిత్ర సృష్టిద్దాం అని ప్రయత్నిస్తుంటే, నువ్వు రక్తచరిత్ర సృష్టిద్దాం అని అనుకుంటున్నావు. రక్తచరిత్ర సృష్టిస్తేనే రాయలసీమలో నా పార్టీ నాలుగు కాలాల పాటు బాగుంటుందేమో అని ఆశ పడుతున్నావు. మేము రాయలసీమలో వర్షపాతం గురించి, కరువుని ఏ విధంగా లేకుండా చేయాలని ఆలోచిస్తుంటే, నువ్వు రక్తపాతం గురించి కుతంత్రాలు చేసి బతుకుదామని అనుకుంటున్నావు. మేము సీమ రైతులకు నాగలి ఇస్తున్నాం. నువ్వు అదే రైతులకు నీళ్లు లేకుండా వలసలు పోయే పరిస్థితి కల్పిస్తున్నావు. కూటమి ప్రభుత్వంలో రాయలసీమకు వచ్చిన సాగునీరు, తాగునీరు, పరిశ్రమలు ఇవే సాక్ష్యం. వైసీపీ దుష్ప్రచారాన్ని మానుకోవాలన్నారు.

# నాయుడుపేట కోర్టులో కేసు వాయిదాకు హాజరైన టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల రాజేంద్ర




ప్రజాభూమి ప్రతినిధి నాయుడుపేట.
తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దార్ల రాజేంద్ర నాయుడుపేట కోర్టులో తనపై నమోదైన పాత కేసుకు సంబంధించిన వాయిదాకు హాజరయ్యారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయుడుపేట పాత బస్టాండ్ సెంటర్‌లో నివసిస్తున్న సంచార జాతి నక్కలోళ్లను ఖాళీ చేయించే ప్రయత్నాన్ని తాను అడ్డుకున్నందుకు రాజకీయ కక్షతో తనపై కేసు నమోదు చేశారని దార్ల రాజేంద్ర ఆరోపించారు. ప్రజలకు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతుంటే ప్రశ్నించడం తప్పు కాదని, ఆ సమయంలో అధికారుల ఒత్తిళ్లను ఎదుర్కొని వారి తరఫున నిలబడ్డానని తెలిపారు.ఆ ఘటనకు సంబంధించి నమోదైన కేసులో భాగంగా నాయుడుపేట కోర్టుకు హాజరై న్యాయపరమైన ప్రక్రియను ఎదుర్కొంటున్నట్లు ఆయన వెల్లడించారు."ప్రజల కోసం నిలబడినందుకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. రాజకీయ కక్షతో కేసులు పెట్టినా న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. ప్రజల హక్కుల కోసం నా పోరాటం ఎప్పటికీ కొనసాగుతుంది" అని దార్ల రాజేంద్ర అన్నారు.కోర్టు వద్ద దార్ల రాజేంద్రతో పాటు న్యాయవాది కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అప్పటి ఘటనకు సంబంధించిన వాస్తవాలు న్యాయస్థానంలో వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ ప్రక్రియను పరిశీలించిన పరిశీలకులు గంధం చంద్రుడు.



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
167- తిరుపతి అసెంబ్లీ నియోజక వర్గం లో జరుగుచున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ పరిశీల కులు, కార్మికశాఖ కమిషనర్ గంధం చంద్రుడు మంగళవారం పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని పోస్టల్ కాలనీ సచివాలయంలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎం. జయకృష్ణ తో కలిసి పరిశీలించారు. నోటీసులు ఎంతమందికి అందించారు? ఎంతమంది విచారణకు హాజరయ్యారు? తదితర విషయాలను తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ కారణాల చేత నోటీసులు అందిన ఓటర్లు వారికి షెడ్యూల్ చేసిన తేదీన విచారణకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాజరు కానీ వారు ఎందుకు రాలేదు తెలుసుకుని వారికి తగు సౌకర్యాలు కల్పించి విచారణ పూర్తి చేయాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 11 డాక్యుమెంట్లలో 1987 కు ముందు జన్మించినట్లయితే వారి స్వంతానికి సంబందించి ఒక డాక్యుమెంట్, ఆ తరువాత మరియు 02.12.2004 మధ్యన జన్మించినట్లయితే వారి స్వంత డాక్యుమెంట్, తల్లిదండ్రులలో ఎవరిదైనా ఒక డాక్యుమెంట్, 02.12.2004 తరువాత జన్మించినట్లయితే వారి స్వంత డాక్యుమెంట్, తల్లిదండ్రుల ఇద్దరి డాక్యుమెంట్ సమర్పించాలని తెలిపారు. నోటీసులు విచారణలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పరిశీలనలో డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ సురేష్ బాబు, ఎన్నికల ఉప తహసీల్దార్ సుధాకర్ నాయక్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వరకట్న వేధింపుల కేసులు నిందితుడికి మూడు సంవత్సరాలు కఠిన కారాగారా శిక్ష

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. (రూరల్)
వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000/- జరిమానా విధించిన న్యాయస్థానం. గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ కేసు నెం. 28/2017 లో నమోదు చేసిన కేసులో, సెక్షన్ మరియు వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3, 4 క్రింద దర్యాప్తు పూర్తి చేసి, చార్జిషీట్ దాఖలు చేయగా, సదరు కేసును రాజ చీశీ.389/2018 గా గౌరవ కోర్టు, చిత్తూరు నందు విచారణకు కొనసాగినది. ఈ కేసు నేపథ్యం:గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో వివాహిత మహిళ గుణవతి ఏ కోమతి, వయస్సు 21 సం. లు అనునామెను 18-04-2017 వ తేదీ వరకట్నం కోసం వేధించి హత్య చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు 2017 సంవత్సరంలో ఉమాపతి, ఆమె తల్లి మునెమ్మలపై కేసు నమోదు చేయబడింది. దర్యాప్తులో భాగంగా దర్యాప్తు అధికారులు అప్పటి రేణిగుంట ఇూ్రా ఖూ. నంజుండప్ప సాక్షులను విచారించి, ఆధారాలను సేకరించగా, మహిళా పోలీస్ స్టేషన్ కాటమరాజు ముద్దాయిలను అరెస్ట్ చేసి, కేసు దర్యాప్తును పూర్తి చేసి, తరువాత నిందితులపై చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది. సదరు కేసును రాజ చీశీ.389/2018 గా కోర్టు, చిత్తూరు నందు విచారణకు కొనసాగినది. 25-08-2026న వెలువడిన తీర్పు: ప్రకారం అదనపు జిల్లా జడ్జి హరితతీర్పు వెలువరించినారు. నిందితుడు ఉమాపతి పై సెక్షన్ 498 కింద నేరం రుజువైనట్లు నిర్ధారించి, అతనిని దోషిగా నిర్ధారించి 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000/- జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో 2 నెలల సాధారణ కారాగార శిక్ష విధించినారు.అయితే, సెక్షన్ 304- వరకట్న నిషేధ చట్టంలోని సెక్షన్లు 3,4 క్రింద మోపబడిన అభియోగాలు రుజువు కాలేదని గౌరవ న్యాయస్థానం నిర్ధారించి, ఆ అభియోగాల నుండి అతనిని నిర్దోషిగా ప్రకటించింది. మరో నిందితురాలు మునెమ్మ మరణించిన కారణంగా ఆమెపై ఉన్న కేసు అబేట్ చేయబడింది. దర్యాప్తు దశ నుండి న్యాయస్థానంలో విచారణ పూర్తయ్యే వరకు కేసును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి, నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన గాజులమండ్యం పోలీస్ స్టేషన్ అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది మరియు సంబంధిత పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# ఘనంగా బీపీ మండల్ 108వ జయంతి వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి గూడూరు,
బీసీల సమస్యల పరిష్కారవే లక్ష్యంగా పనిచేస్తున్న బీసీ సమస్యయకమిటీ ఆధ్వర్యంలో బీసీల ఆరాధ్య దైవం, రెండో బీసీ కమిషన్ చైర్మన్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు జీవితాంతం పోరాడిన మహనీయుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బి.పీ. మండల్) 108వ జయంతి వేడుకలను మంగళవారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. గూడూరు కార్‌స్టాండ్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో బి.పీ. మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీల సామాజిక, రాజకీయ, విద్యా, ఆర్థిక హక్కుల కోసం మండల్ చేసిన కృషిని ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు మండల్ చేసిన పోరాటం దేశవ్యాప్తంగా సామాజిక న్యాయ సాధనకు మార్గదర్శకంగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బహుజన వర్గాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి గూడూరు నియోజకవర్గంలోని బీసీ సంఘాల నాయకులు, బహుజన సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు, మేధావులు, అభ్యుదయవాదులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొని బి.పీ. మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ మహాత్మా జ్యోతిరావు పూలే వాషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఎల్.వీ. సుబ్బయ్య, గౌడ సంఘం నాయకులు నాసిన భాస్కర్ గౌడ్, జి. వెంకటేశ్వరరాజు, ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు యాల్లపల్లి శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పొల్లేపల్లి రమణరావు, చిల్లకూరు వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అభ్యంతరాల విచారణలో పాల్గొన్న లేబర్ కమీషనర్



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట
ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ డిస్క్రెపెన్సీలపై వినతులు, అభ్యంతరాల విచారణ కార్యక్రమాన్ని మంగళవారం రేణిగుంట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలకులు, కార్మికశాఖ కమిషనర్ గంధం చంద్రుడు, ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి పాల్గొని పోలింగ్ బూత్‌ల ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో పేర్లు,తండ్రి పేరు,వయస్సు,పుట్టిన తేదీ తదితర వివరాల్లో నమోదైన తప్పులను అధికారులు పరిశీలించారు.సంబంధిత ఓటర్లు సమర్పించిన ఆధార పత్రాలు, ఛాయాచిత్రాలను స్వీకరించి పరిశీలన అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు ఆర్డీవో భాను ప్రకాష్‌రెడ్డి తెలిపారు.నో మ్యాపింగ్,వివరాల్లో వ్యత్యాసాలకు సంబంధించి అందిన అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని,అర్హత కలిగిన ఓటర్ల వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. విచారణకు హాజరైన అభ్యర్థుల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి, ఒక్కో అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. అభ్యంతరాల విచారణ కార్యక్రమం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనసాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర, డిప్యూటీ ఎంపీడీవో ప్రభురావు, జై కృష్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాత్రి వేళ గ్రామాల సందర్శనలో ఎస్సై హరిప్రసాద్.. సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి:- బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలో ఎస్సై హరిప్రసాద్ రాత్రి వేళ గ్రామాల సందర్శన చేపట్టి ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడడంలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల ఫోన్ కాల్స్, సందేశాలు, మోసపూరిత లింకులను నమ్మి డబ్బులు కోల్పోవద్దని సూచించారు. రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మహిళలపై నేరాల నివారణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటి వల్ల వ్యక్తిగత జీవితం, కుటుంబాలు మరియు సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. రానున్న వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలను పాటించి అవసరమైన అనుమతులు పొందాలని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని ఎస్సై హరిప్రసాద్ పేర్కొన్నారు.

# నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవి మరియు ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరియు దిశా విభా గం సహకారంతో మంగళవారం నవజీ వన్ ఆర్గనైజేషన్ - సి.సి - పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా మన సంస్కృతి కళా సంస్థ వారిచే హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన సదస్సును దొరవారిసత్రం మండలం లోని కుప్పారెడ్డిపాళెం గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మన సంస్కృతి కళా సంస్థ వారు మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, సుఖ వ్యాధులు మరియు చికిత్స గురించి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ యొక్క ఉపయోగం గురించి, హెచ్ఐవి/ఎయిడ్స్ యాక్ట్ 2017, ఏ.ఆర్.టి మందులు, ఎ.పి.శాక్స్ యాప్, క్యూ.ఆర్ కోడ్, సెల్ఫ్ రిస్క్ అసెస్ మెంట్, టోల్ ఫ్రీ నెంబర్ 1097 గురించి తెలుపుతూ, మీ ద్వారా తెలియని వాళ్లకు తెలియజేయమని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళా సంస్థ బృందం సభ్యులు కె. రెడ్డప్ప, యన్. సుబ్రహ్మణ్యం, పి. అంజయ్య, పి. పూమణి, యన్. శారద, ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజి, ఓ.ఆర్.డబ్ల్యూ లు కె. జయశ్రీ, ఆర్. భువనేశ్వరి, పి.ఇ లు మరియు 90 మంది ప్రజలు పాల్గొనడం జరిగింది.



# ఎన్నిక ఏదైనా అరాచకాలు సృష్టించడమే జగన్ రెడ్డి విధానం-ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి: స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన రాగానే వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో ఓటమి భయం స్పష్టంగా కనిపిస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. తాడేపల్లిలో నిర్వహించిన సమావేశంలో జగన్ మాట్లాడిన మాటలు ఆయన నిరాశ, నిస్పృహలను తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో అధికారంలో ఉండగా ఏకగ్రీవాలను ప్రోత్సహిస్తామంటూ స్వయంగా జీవో జారీ చేసిన జగన్, అప్పట్లో పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని టీడీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చింపేసి, భయభ్రాంతులకు గురిచేసి దౌర్జన్యాలతో ఏకగ్రీవాలు చేయించుకున్నారని గుర్తుచేశారు. ఏకగ్రీవమైన పంచాయతీలకు నిధులు ఇస్తామని చెప్పి నయాపైసా ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర వైకాపా ప్రభుత్వానిదని, ఈ విషయాన్ని స్వయంగా ఆ పార్టీ సర్పంచులే చెబుతున్నారని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడు 'ఏకగ్రీవాలు చేయకపోతే టికెట్లు ఇవ్వను' అని బెదిరించిన జగన్, నేడు 'పోటీ చేయకపోతే భవిష్యత్తులో సీట్లు ఇవ్వను' అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ మండిపడ్డారు. ప్రజాస్వామ్యం తన చేతుల్లోనే ఉందన్నట్లు వ్యవహరించడం సరికాదని, ఎన్నికల్లో ఎవరిని గెలిపించాలో ప్రజలే నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతోనైనా జగన్‌కు జ్ఞానోదయం కావాలన్నారు. వైకాపా మాదిరిగా దౌర్జన్యాలకు తావులేకుండా ఎన్డీయే కూటమి పూర్తిగా ప్రజాస్వామ్య పద్ధతిలోనే పనిచేస్తుందని తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ పెద్దల నాయకత్వంలో క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, ప్రజలు మెచ్చిన అభ్యర్థులకే టికెట్లు కేటాయిస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన శరవేగంగా సాగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రజాసేవ, సంక్షేమ కార్యక్రమాలను చూసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులకు ప్రజలు భారీ మెజారిటీతో పట్టం కట్టడం ఖాయమని కలిశెట్టి ధీమా వ్యక్తం చేశారు. గత 2014-19 టీడీపీ హయాంలో సుమారు 25 వేల కిలోమీటర్ల మేర రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం జరిగితే, 2019-24 వైకాపా ఐదేళ్ల పాలనలో కేవలం 1,800 కిలోమీటర్లు మాత్రమే నిర్మించారని కలిశెట్టి విమర్శించారు. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని దుస్థితిలో గత ప్రభుత్వం రాష్ట్రాన్ని వదిలేసిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రుల సమష్టి నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమించి, ఈ రెండేళ్లలోనే దాదాపు 4 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణం పూర్తి చేసి గ్రామ వికాసానికి బాటలు వేసిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి తన హయాంలో ఇచ్చిన హామీలను విస్మరిస్తే, చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం పింఛను మొత్తాన్ని రూ.1,000 పెంచి అందిస్తోందని గుర్తుచేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల చేతికి పెన్షన్ అందిస్తుండటంతో గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేపట్టిన విజయనగరం పర్యటనకు ప్రజలు, మహిళలు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలికారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసానికి ఈ స్పందనే నిదర్శనమని, రానున్న రోజుల్లో విజయనగరం నగరపాలక సంస్థ ఎన్నికల్లోనూ కూటమి భారీ విజయం సాధించబోతోందని ధీమా వ్యక్తం



చేశారు. పులివెందుల ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపిస్తే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమై ప్రెస్ మీట్ల ద్వారా తప్పుడు ఆరోపణలు చేయడం జగన్‌కే చెల్లిందని ఎద్దేవా చేశారు. దేశంలోనే అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడిపై అన్‌పార్లమెంటరీ భాషలో విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్ పూర్తి సమయం బెంగళూరులో గడుపుతూ, అప్పుడప్పుడు తాడేపల్లికి వచ్చి ప్రజలను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దౌర్జన్యాలు, బెదిరింపులకు తావులేకుండా నిబద్ధతతో కూడిన ప్రజాస్వామ్య పాలన అందించడమే తెలుగుదేశం, ఎన్డీయే కూటమి విధానమని స్పష్టం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నట్లుగా రాబోయే 15 ఏళ్ల పాటు ఎన్డీయే కూటమి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, వార్డు మెంబర్ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు ప్రజలు ఎన్డీయే పక్షానే నిలబడటానికి సిద్ధంగా ఉన్నారని ఎంపీ తెలిపారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులను దారి మళ్లించి పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. గ్రామాల్లో కనీసం వీధి దీపాలు వేయలేని, కాలువలు శుభ్రం చేయలేని దుస్థితికి కారణమైన జగన్మోహన్ రెడ్డి, ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలంటూ నాయకులకు దిశానిర్దేశం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయాక మరోలా మాట్లాడటం జగన్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని చేసే ప్రెస్ మీట్లు, తీసుకునే నిర్ణయాలు ప్రజలను ఏమాత్రం మెప్పించలేకపోతున్నాయని, సొంత పార్టీ నాయకులే భవిష్యత్తుపై అయోమయంలో ఉన్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో జగన్ శాశ్వతంగా బెంగళూరుకే పరిమితం కాక తప్పదని స్పష్టం చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసిన సందర్భంలో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంపై వారు ప్రశంసలు కురిపిస్తున్నారని ఎంపీ తెలిపారు. గత ఐదేళ్లలో పూర్తిగా అట్టడుగుకు చేరిన రాష్ట్రాన్ని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ అనుభవం, దార్శనికతతో కేవలం రెండేళ్లలోనే తిరిగి అభివృద్ధి పథంలోకి తెచ్చారని కేంద్ర పెద్దలే కొనియాడుతున్నారని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమష్టి నాయకత్వంలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. బీసీలపై జగన్ మొసలికన్నీరు కారుస్తున్నారని, వారిని అణచివేసేందుకు గత ప్రభుత్వంలో ప్రయత్నించిన చరిత్ర ప్రజలకు గుర్తుందని ధ్వజమెత్తారు. తెలుగుదేశం పార్టీకి బీసీలే ప్రాణమని, వారికి ఎల్లప్పుడూ అత్యున్నత గౌరవం, ప్రాధాన్యత కల్పించింది చంద్రబాబు నాయుడేనని స్పష్టం చేశారు. బీసీలకు, టీడీపీకి మధ్య ఉన్న భావోద్వేగ బంధాన్ని ఎవరూ వేరు చేయలేరన్నారు. గ్రామ స్థాయి నుంచి కార్పొరేషన్ల వరకు ఏ ఎన్నికలు జరిగినా పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తామని, వాటన్నింటిలోనూ ప్రజల ఆశీస్సులతో ఎన్డీయే కూటమి అభ్యర్థులే భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా మహిళలు, యువత, అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని ఎంపీ కలిశెట్టి స్పష్టం చేశారు.

## 30వ రోజూ విజయవంతంగా కొనసాగిన 'ఇంటింటికీ తెలుగుదేశం-2026'

**83.93 లక్షల ఇళ్లకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'**
**నేడు 2,29,354 ఇళ్లను సందర్శించిన పార్టీ నాయకులు, కార్యకర్తలులి**
**ప్రజా భాగస్వామ్యంతో మరింత విస్తృతంగా కొనసాగుతున్న 'ఇంటింటికీ తెలుగుదేశం'**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు... ప్రభుత్వ పనితీరుపై ప్రజల స్పందనను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం -- 2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం 30వ రోజూ రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగింది. నేడు రాష్ట్రవ్యాప్తంగా 2,29,354 ఇళ్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. దీంతో కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు మొత్తం 83.93 లక్షల ఇళ్లను పార్టీ శ్రేణులు సందర్శించాయి. ప్రతి గడపకు వెళ్లి ప్రతి కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలిసి... వారికి అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తూ రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆయా కుటుంబాలకు తెలియజేస్తున్నారు. అదే సమయంలో ప్రజల సమస్యలు, అభిప్రాయాలను నేరుగా తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం మరింత ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా పెద్ద ఎత్తున భాగస్వామ్యమవుతున్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాల కృష్ణారావుకు ఘన వీడ్కోలు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ వేణుతురుమల్లి గోపాల కృష్ణారావుకు హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సమక్షంలో ఫుల్ బెంచ్ ఘన వీడ్కోలు పలికింది. హైకోర్టు న్యాయమూర్తి గోపాల కృష్ణారావు పదవీ విరమణ చేయనున్న సంద ర్భాన్ని పురస్కరించుకుని మంగళ వారం హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ మాట్లాడుతూ జస్టిస్ గోపాల కృష్ణారావు నిబద్ధత కలిగిన న్యాయమూర్తని కొనియాడారు. జస్టిస్ గోపాల కృష్ణారావు ఉమ్మడి కృష్ణా జిల్లా చల్లపల్లిలో 1964 ఆగస్టు30న జన్మించారని,చల్లపల్లి,మచిలీపట్నంల్లో పాఠశాల,కళాశాల విద్యను పూర్తి చేశారన్నారు. 1989వ సంవత్సరంలో బార్ కౌన్సిల్ సభ్యుడిగా,న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారని తెలిపారు. 1994లో ఏపీ జ్యుడీషియల్ సర్వీసెస్ లో ఉత్తీర్ణులై జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారన్నారు. జనవరి 2023 లో హై కోర్టు అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారని,2024 ఆగస్టులో ఏపీ హై కోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియామకం అయ్యారన్నారు. జస్టిస్ గోపాల కృష్ణారావు తన పదవీ కాలంలో అనేక కీలకమైన తీర్పులను వెలువరించారని తెలిపారు. తదుపరి జిల్లా మరియు సెషన్స్ జడ్జీగా వివిధ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదవీ విరమణ అనంతరం జస్టిస్ గోపాల కృష్ణారావు శేష జీవితం ఆయురారోగ్యాలతో ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయనున్న జస్టిస్ గోపాల కృష్ణారావు మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తన విద్యార్థి దశ నుండి న్యాయవాదిగా,న్యాయమూర్తిగా ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రతి దశలోనూ ఉత్తమ సలహాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.
అంతకు ముందు అదనపు సోలిసిటర్ జనరల్ చల్లా ధనుంజయ్,అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్,ఏపీ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభునాథ్ వాసిరెడ్డి లు జస్టిస్ గోపాల కృష్ణారావుకు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ తమ అనుభవాలను పంచుకున్నారు.

# గల్లంతైన మత్స్యకారుల కోసం గాలింపు ముమ్మరం

- 15 కోస్ట్‌గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లతో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులకు సమాచారం.. ఎలక్ట్రానిక్ నిఘా కొనసాగింపు
- డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్ పరిసరాల్లోనూ గాలింపు విస్తరణ
- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని అవకాశాలను వినియోగిస్తున్నాం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:
అమలాపురం ప్రాంతానికి చెందిన గల్లంతైన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం చేపట్టిన గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో భారత తీర రక్షక దళం (×జ+), నౌకాదళం, ఇతర సంబంధిత విభాగాలు సమన్వయంతో విస్తృత సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు హరీష్ బాలయోగి మంగళవారం కేంద్ర రక్షణ మంత్రిని కలిసి గల్లంతైన మత్స్యకారుల కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలపై చర్చించిన అనంతరం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ భారత తీర రక్షక దళాన్ని మరింత అప్రమత్తం చేసిందని మంత్రి తెలిపారు. ఐసీజీ ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్) ఆదేశాల మేరకు కోల్‌కతాలోని తూర్పు, ఈశాన్య కమాండ్లను కూడా కార్యాచరణలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. గాలింపు పరిధిని విస్తరించి, ఆపరేషన్‌ను వేగవంతం చేసేందుకు సమీప సముద్ర జలాల్లో ఉన్న 15 ఐసీజీ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను మంగళవారం రంగంలోకి దించినట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (వీ=జజ) ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ నిఘా ఏకకాలంలో కొనసాగుతోందన్నారు. గల్లంతైన పడవకు సంబంధించిన సమాచారం లేదా ఆచూకీ లభించే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని మయన్మార్, బంగ్లాదేశ్ సముద్ర అధికారులను కూడా అప్రమత్తం చేసినట్లు తెలిపారు.



పడవ విదేశీ జలాల్లోకి కొట్టుకుపోయి ఉండవచ్చనే అవకాశంతో పాటు, ఇంజిన్‌లో సాంకేతిక లోపం కారణంగా సముద్రంలో ఎక్కడైనా నిలిచిపోయి ఉండవచ్చన్న కోణంలోనూ భారత తీర రక్షక దళం పరిశీలన జరుపుతోందని మంత్రి వివరించారు. ఎంఆర్‌సీసీ చేపడుతున్న ఎలక్ట్రానిక్ నిఘాతో పాటు వివిధ సముద్ర అధికారుల నుంచి అందుతున్న సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తున్నట్లు చెప్పారు. సముద్ర ప్రవాహాలు, గాలుల దిశ, వేగం, వాతావరణ పరిస్థితులతో పాటు మత్స్యకారులు సాధారణంగా చేపల వేటకు వెళ్లే మార్గాలను పరిగణనలోకి తీసుకుని గాలింపు కొనసాగిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. డైమండ్ హార్బర్, సుందర్‌బన్స్‌తో పాటు పరిసర సముద్ర ప్రాంతాల్లోనూ సెర్చ్ ఆపరేషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర ప్రభుత్వ విభాగాలతో సమన్వయం చేసుకుంటోందని అచ్చెన్నాయుడు చెప్పారు. గల్లంతైన మత్స్యకారులను సురక్షితంగా తిరిగి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగిస్తున్నామని స్పష్టం చేశారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని మంత్రి కోరారు.

# సుజ్లాన్ రాకతో ఏపీ రెన్యువబుల్ ఎనర్జీ పెరిగింది

- పవన విద్యుత్ రంగంలో సుజ్లాన్‌కు ప్రపంచ ఖ్యాతి -175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యం
- రాయదుర్గం నియోజకవర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్

ప్రజాభూమి ప్రతినిధి,రాయదుర్గం: పునరుత్పాదక ఇంధన రంగంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే మన లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్ట్ ఏపీ నూతన అధ్యాయానికి నాంది అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఈ రోజు అనంతపురం జిల్లాలో మీ అందరి మధ్య ఉండటం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ నూతన అధ్యాయానికి నాంది. ఈ రోజు సుజ్లాన్, ఏపీ మధ్య రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న బంధాన్ని పునరుద్ధరించుకునే సందర్భం కూడా. సుజ్లాన్ తొలినాళ్లలోనే ఏపీకి వచ్చి, తయారీ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసి, బలమైన విండ్ ఎనర్జీ ఎకో సిస్టమ్ నిర్మించింది. సుజ్లాన్ గురించి మాట్లాడేటప్పుడు దివంగత తులసి తంతి గారిని మనం స్మరించుకోవాలి. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే ఆయన పునరుత్పాదక ఇంధనంపై నమ్మకం ఉంచారు. ఆయన ఆలోచన చాలా సింపుల్. భారతదేశ ఆర్థిక స్వావలంబనకు ఇంధన స్వావలంబన అత్యంత అవసరం. ఆ దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడింది.

**అనంతలో 1,260 మెగావాట్ల సామర్థ్యం సుజ్లాన్ సొంతం**

2019-24 మధ్య రాష్ట్రంలో పవన విద్యుత్ అభివృద్ధి దాదాపుగా నిలిచిపోయింది. కేవలం 6 మెగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం మాత్రమే అదనంగా చేరింది. నేడు అనంతపురంలోని సుజ్లాన్ యూనిట్‌కు ఏడాదికి సుమారు 1,260 మెగావాట్ల తయారీ సామర్థ్యం ఉంది. ప్రత్యక్షంగా సుమారు 1,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70 శాతానికి పైగా స్థానికులే. ఏపీ వ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలను సృష్టించింది. పారిశ్రామికీకరణ అంటే ఇలాగే ఉండాలి. ఒక జిల్లాకు పెట్టుబడులు రావాలి. ఆ జిల్లాలో తయారీ రంగం అభివృద్ధి చెందాలి. ఆ జిల్లాలో నైపుణ్యాలు పెరగాలి. యువతకు వారి సొంత జిల్లాలోనే ఉద్యోగాలు లభించాలి.

**విండ్ ఎనర్జీ రంగంలో మన దేశం సత్తా చాటింది సుజ్లాన్**

భారతదేశ పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థల్లో సుజ్లాన్ ఒకటి. పట్టుదల, పునరుద్ధరణ సామర్థ్యంతో సుజ్లాన్ సంస్థ అత్యున్నత విజయాలను చూసింది. అత్యంత క్లిష్టమైన పరిస్థితులను కూడా ఎదుర్కొంది. అయినప్పటికీ సుజ్లాన్ ఎప్పుడూ కనుమరుగుకాలేదు. ఎందుకంటే నిబద్ధతతో కూడిన ఈ సంస్కృతిని తులసి తంతి గారు ఏర్పరచగా, ప్రస్తుత నాయకత్వం దానిని ముందుకు తీసుకెళ్లింది.

**రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4వేలకు పైగా ఉద్యోగాల కల్పన**

ఈ రోజు మనం ముందుకు తీసుకెళ్తున్న ప్రాజెక్టులు మొత్తం 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం. సుమారు రూ.10వేల కోట్ల పెట్టుబడి, 4 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలను తీసుకురానున్నాయి. మనం నిర్మించే ప్రతి మెగావాట్ చివరికి మన యువతకు అవకాశంగా మారాలి. ఏపీలో సుజ్లాన్‌కు ఇప్పటికే సుమారు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉంది. మరో 2,700 మెగావాట్లు అభివృద్ధి, నిర్మాణ దశలో ఉన్నాయి. అనంతపురం ప్రాంతంలో సుమారు 1,300 మెగావాట్ల కొత్త పవన విద్యుత్ ప్రాజెక్టులు అభివృద్ధి దశలో ఉన్నాయి.

**సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి**

ఆంధ్రప్రదేశ్‌కు పవన విద్యుత్ భవిష్యత్ ఇంధన మిశ్రమంలో కీలక భాగం. భారతదేశంలో సూర్యరశ్మి సమృద్ధిగా ఉంది. పగటి సమయంలో సౌర విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ప్రతి సాయంత్రం సూర్యుడు అస్తమిస్తాడు. మన ఆర్థిక వ్యవస్థ మాత్రం ఆగదు. సాయంత్రం 6 గంటలకైనా మన ఇళ్లకు విద్యుత్ అవసరం ఉంటుంది. మన పరిశ్రమలు పనిచేస్తూనే ఉంటాయి. మన ఆసుపత్రులు పనిచేస్తూనే ఉంటాయి. మన డేటా సెంటర్లు ప్రతి క్షణం సమాచారాన్ని ప్రాసెస్ చేస్తూనే ఉంటాయి. అందుకే సౌర, పవన విద్యుత్, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ దేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ పర్యావరణ వ్యవస్థల్లో ఒకదాన్ని నిర్మిస్తున్నందున ఇది మరింత కీలకంగా మారుతోంది. మేం 6.5 గిగావాట్ల డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నాం. ఈ డిజిటల్ మౌలిక వసతులకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాన్ని సృష్టించవచ్చు.

**175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం లక్ష్యం**

మా విజన్ కేవలం విద్యుత్‌తో ఆగిపోదు. క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చాలని మేం కోరుకుంటున్నాం. గ్రీన్ డేటా సెంటర్ల ద్వారా ా× ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ అందించాలని కోరుకుంటున్నాం. చివరికి క్లీన్ ఎనర్జీకి సౌది అరేబియాగా ఏపీని తీర్చిదిద్దాలన్నదే మా అంతిమ లక్ష్యం. వివిధ రూపాల్లో స్వచ్ఛ ఇంధనాన్ని ప్రపంచానికి ఎగుమతి చేయగల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలి. మనకు పునరుత్పాదక ఇంధన సామర్థ్యం ఉంది. సుదీర్ఘ సముద్ర తీరం ఉంది. ఓడరేవులు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ల్యాండ్ ఉంది. మెరుగైన కనెక్టివిటీ ఉంది. నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉన్నాయి. ఈ ప్రయోజనాలన్నింటినీ ఒకచోటకు తీసుకురావడానికి అవసరమైన పాలసీ ఎన్విరాన్‌మెంట్ ను మేం సృష్టిస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషించనున్నాయి. పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మాణంలో భాగంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫిషరీస్, ఆక్వాకల్చర్, మ్యానుఫ్యాక్చరింగ్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు దిశగా ముందుకు వెళ్తున్నాం. క్లస్టర్లు ఎందుకంటే.. కంపెనీలు ఒంటరిగా పెట్టుబడులు పెట్టవు. అవి ఎకోసిస్టమ్‌లో పెట్టుబడులు పెడతాయి. అందుకే మా విధానం చాలా సులభం. కేవలం ఒక కంపెనీని తీసుకురావడం కాదు.. ఆ కంపెనీ చుట్టూ పూర్తి ఎకోసిస్టమ్ ను నిర్మించాలి. ఒక కంపెనీ సప్లయర్స్‌ను తీసుకొస్తుంది. సప్లయర్స్ మరిన్ని కంపెనీలను తీసుకొస్తారు. కంపెనీలు ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఉద్యోగాలు స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీంతో పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తాయి. ఈ భాగస్వామ్యంలో గర్వంగా అనిపించే మరో అంశం నైపుణ్యాభివృద్ధి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12వేల మంది యువతకు, అందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం ఉండేలా గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ అందిస్తున్నాయి. ఉరవకొండ, విజయవాడలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు పునరుత్పాదక ఇంధన రంగానికి అవసరమైన ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులను సిద్ధం చేస్తున్నాయి. రేపటి కంపెనీలు నైపుణ్యం ఉన్న ప్రాంతాలకే వస్తాయి. ఆ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ యువత సిద్ధంగా ఉండేలా చూడటం మన బాధ్యత. భారతదేశ స్వచ్ఛ ఇంధన భవిష్యత్తు కోసం శిక్షణ పొందుతున్న యువ ఇంజనీర్లు, సాంకేతిక నిపుణుల ద్వారా స్వర్గీయ తులసి తంతి గారి వారసత్వం మరోసారి కొనసాగుతోంది.

**అనంతపురం కొత్త కేరాఫ్ అడ్రస్ ఇదే..**

అనంతపురం జిల్లా అంటే కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ. ఒకప్పుడు అనంతపురం జిల్లా నుంచి యువత ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ రోజులు పోయాయి. ఇతర ప్రాంతాల వాళ్లు ఉద్యోగాలు వెతుక్కుంటూ అనంతపురం జిల్లాకు వచ్చే రోజులు వచ్చాయి. ఇదంతా మన ఏపీ బ్రాండ్, విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి వల్లే సాధ్యమైంది.

ఈ రోజు ఇక్కడ ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి, పారిశ్రామికవేత్తలకు ప్రముఖుడికి నా సందేశం ఒక్కటే.. మా స్పీడ్, స్టెబిలిటీ, కమిట్ మెంట్, ఎగ్జిక్యూషన్ ను నమ్మండి. ఎందుకంటే మీరు ఏపీలో విజయవంతమైతే, ఏపీ కూడా మీతో కలిసి విజయవంతమవుతుంది. భవిష్యత్తు కోసం మనం ఎదురుచూడబోం. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, కొత్త ఉద్యోగాలు, కొత్త నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించబోతున్నాం అని మంత్రి చెప్పారు.

# స్థానిక సంస్థల సమరానికి వైఎస్సార్‌సీపీ సర్వసన్నద్ధం

**- ప్రజా వ్యతిరేక కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం.**

**- వెన్నుపోటు, మోసపూరిత కూటమి పాలనను కూకటివేళ్లతో పెకలిస్తాం : వైఎస్సార్‌సీపీ నేతలు**

ప్రజాభూమి ప్రతినిధి, తాడేపల్లి:
తాడేపల్లి లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి వైయస్. జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, 175 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు పాల్గొన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై నేతలకు వైయస్. జగన్ మోహన్ రెడ్డి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సమావేశం అనంతరం పార్టీ ముఖ్య నేతలు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం గత రెండున్నరేళ్ల కాలంలో ప్రజలను అన్ని రంగాల్లో దారుణంగా వంచించిందని ధ్వజమెత్తారు. 'సూపర్ సిక్స్', సంక్షేమ పథకాలు, పెన్షన్లు, నిరుద్యోగ భృతి, మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తుతోందని స్పష్టం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కుట్రలు, పోలీసుల దౌర్జన్యాలు, నకిలీ ఓట్ల ఆధారంగా అక్రమాలకు పాల్పడేందుకు ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లోనూ బలమైన అభ్యర్థులను నిలిపి, ప్రజల పక్షాన పోరాడి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడానికి సర్వసన్నద్ధంగా ఉందని పార్టీ నేతలు స్పష్టం చేశారు.

**ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరేమన్నారంటే...**

**ఆర్కే రోజా (మాజీ మంత్రి): కూటమి ప్రభుత్వ మోసాలు, కుట్రలను తిప్పికొడతాం..**

స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం! స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధం కావాలని మా పార్టీ అధ్యక్షుడు వైయస్. జగన్ మోహన్ రెడ్డి గారు మాకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈరోజు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు కాబట్టి, పోలీసులను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలు చేసి గెలవాలని, లేదా దొంగ నాటకాలు ఆడి గెలవాలని ప్రయత్నాలు చేస్తోంది. ఆ కుట్రలను భగ్నం చేసి, ప్రజలకు నిరంతరం సేవలందించే సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించి వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగరేస్తుంది.గత ఎన్నికల్లో ఈవీఎంలను మేనేజ్ చేయడమే కాకుండా, వైయస్. జగన్ ఇచ్చే సంక్షేమం కంటే మూడు రెట్లు ఎక్కువ ఇస్తామని చెప్పి చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను దగా చేశారు. వాలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇంటింటికీ సంక్షేమం అందించిన వైయస్. జగన్ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ఎస్ఐఆర్‌లోనే 45 లక్షలకు పైగా నకిలీ, గుర్తించని ఓట్లు ఉన్నాయని తేలింది. అలాంటిది పాత ఓటర్ల జాబితాతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తారు? ఇది ముమ్మాటికీ నేరపూరిత ఆలోచన కాదా?బీసీ రిజర్వేషన్ 44 శాతానికి పెంచుతూ జీవో 105 పేరుతో మరో నాటకానికి తెరతీశారు. గతంలోనే 50 శాతం రిజర్వేషన్ల పరిమితిపై కోర్టు కొట్టివేసిన విషయం తెలిసి కూడా, మళ్లీ అదే దొంగ జీవో ఇచ్చి ఎన్నికలు ఆపించేందుకు కుట్ర పన్నుతున్నారు. వైయస్. జగన్ చిత్తశుద్ధితో బీసీలకు అత్యధిక స్థానాలు ఇచ్చి జడ్పీ చైర్మన్లు, మేయర్లుగా చేశారు. రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వలేదు, 50 ఏళ్లకే పెన్షన్ అన్న హామీ ఏమైంది? కొత్త రేషన్ కార్డు, ఇంటి పట్టా, నిరుద్యోగ భృతి ఏవీ ఇవ్వలేదు. మూడు బడ్జెట్లలో రూ.2.39 లక్షల కోట్లకు గాను రూ.31,500 కోట్లు (13 శాతం) కూడా ఖర్చు చేయకుండా అమరావతి పేరుతో దోచుకుంటున్నారు. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారు. అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరించే పోలీసు అధికారుల పేర్లు డిజిటల్ బుక్‌లోకి ఎక్కుతాయి, చట్టం ముందు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

**అంబటి రాంబాబు (మాజీ మంత్రి): వెన్నుపోటు కూటమి పాలనకు ప్రజలు చరమగీతం పాడటం ఖాయం.. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలి!**

చంద్రబాబు ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్వసన్నద్ధంగా ఉంది. కార్పొరేషన్లు, జిల్లా పరిషత్తులు, మండలాలు, జెడ్పీటీసీలు.. ఎక్కడ ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తుంది. ఎన్నికలు ధర్మంగా, పారదర్శకంగా జరిగితే వైఎస్సార్‌సీపీ అఖండ మెజారిటీ సాధించే వాతావరణం రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తోంది.ఈ 26 నెలల పాలనలో తెలుగుదేశం పార్టీ కూటమిపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. చెప్పేది ఒకటి, చేసేది మరొకటిగా మారిన ఇది ముమ్మాటికీ వెన్నుపోటు ప్రభుత్వం. గతంలో బంధువులను వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు, ఇప్పుడు యావత్ రాష్ట్ర ప్రజలకే వెన్నుపోటు పొడిచారు. మొన్న పులివెందుల స్థానిక ఎన్నికల్లో ఓటర్లను కాకుండా పోలీసులను, టీడీపీ నాయకులను పెట్టి ఓట్లు వేయించుకున్న దుర్మార్గాన్ని చూశాం. అలాంటి అక్రమాలకు తావులేకుండా ఎన్నికల కమిషన్, పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అధికార పార్టీకి తొత్తులుగా మారే అధికారులను, తప్పు చేసేవారిని గుర్తించి భవిష్యత్తులో చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని మా అధినేత వైయస్. జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

**సాకే శైలజానాథ్ (మాజీ మంత్రి): బీసీలకు ద్రోహం చేస్తూ అబద్ధాల పాలన... స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటాం..!**

సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదనే నిబంధన తెలిసినప్పటికీ, చంద్రబాబు నాయుడు బలహీన వర్గాలను మోసం చేస్తూ ద్రోహపూరిత ప్రకటనలు, జీవోలతో మోసగిస్తున్నారు. గతంలో తెలంగాణలో గానీ, ఏపీలో గానీ రిజర్వేషన్ల పరిమితి దాటితే కోర్టులు ఎన్నికలను నిలిపివేసిన వాస్తవాన్ని కప్పిపుచ్చి ప్రజల జ్ఞాపకశక్తిని తక్కువగా అంచనా వేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఎదుర్కోవడానికి సంపూర్ణంగా సిద్ధంగా ఉంది. ప్రజలకు సంక్షేమాన్ని, మేలును అందించిన పార్టీగా వైయస్. జగన్ నాయకత్వంలో మేం ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తున్నాం. కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు, దుర్మార్గాలను ఎదుర్కొని పంచాయతీ స్థాయి నుంచి ప్రతి స్థానంలోనూ మా కార్యకర్తలు పోటీలో నిలుస్తారు. రెండున్నరేళ్ల పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి, ప్రజల ఆస్తులను కారుచౌకగా అమ్మేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర లేదు, సాగు చేయవద్దని చెప్పే దుస్థితి తెచ్చారు. రాయలసీమలో కృష్ణా జలాలు అందక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ అరాచక పాలనపై ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడి ఘన విజయం సాధిస్తాం.

**మార్గాని భరత్ (మాజీ ఎంపీ): మహిళలు, బీసీలను నిలువునా వంచించిన కూటమి సర్కార్.. ఓపెన్ చర్చకు సిద్ధమా?**

కూటమి ప్రభుత్వానిది ముమ్మాటికీ మోసపూరితమైన వెన్నుపోటు పాలన, ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇద్దరూ ప్రతి నియోజకవర్గ అభ్యర్థితో ప్రామిసరీ నోట్లపై సంతకాలు చేయించి, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15,000 చొప్పున 'తల్లికి వందనం' ఇస్తామని పత్రాలు పంపిణీ చేశారు. అలాగే 50 ఏళ్లు దాటిన మహిళలందరికీ రూ.4,000 పెన్షన్ (ఏడాదికి రూ.48,000) ఇస్తామని నమ్మబలికారు. మరి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లవుతున్నా ఆ హామీలు ఏమయ్యాయి?" డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకుంటున్న చంద్రబాబు, లోకేష్‌లకు బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో చట్టం చేసి కేంద్రం ద్వారా చట్టసభలు, స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను ఎందుకు తీసుకురాలేకపోయారు? కోర్టులు కొట్టేస్తాయని తెలిసి కూడా పనికిరాని జీవోలు ఇస్తూ ప్రజలను ఏమారుస్తున్నారు. గత 21 ఏళ్లలో చంద్రబాబు బీసీలకు ఏం చేశారు? మా జగనన్న 5 ఏళ్లలో బీసీలను సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎలా ఉన్నత స్థానాల్లో నిలబెట్టారో తెల్చుకోవడానికి లోకేష్ ఓపెన్ చర్చకు సిద్ధమా? జగనన్న నలుగురు బీసీలకు రాజ్యసభ ఇచ్చారు, అత్యధికంగా ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్లు, మేయర్లు, ఎంపీ సీట్లు ఇచ్చి గౌరవించారు. విద్యార్థులకు టోఫెల్, బైజూస్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ట్యాబ్‌లు ఇచ్చి ఉన్నత చదువులు చెప్పించిన ఘనత జగనన్నది. మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి రాజమండ్రిలో డాక్టర్ ప్రియాంకపై జరిగిన దారుణ ఘటనను మూడు రోజుల పాటు కప్పిపుచ్చాలని చూశారు. ఢిల్లీ నిర్భయ, కోల్‌కతా అభయ ఘటనల మాదిరిగానే రాజమండ్రి ఘటన కూటమి ప్రభుత్వానికి గుణపాఠం కాబోతోంది. మహిళలను, బీసీలను అన్ని వర్గాలను మోసం చేసిన ఈ కూటమి ప్రభుత్వానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఓటుతో గట్టి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు వైసీపీ నేతలు.

# 'స్థానికం'లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

**-రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి సవిత**

ప్రజాభూమి ప్రతినిధి,రొద్దం/శ్రీసత్యసాయిలి : 'బీసీల గురించి మాట్లాడే అర్హత మీకు లేదు... మీ అయిదేళ్ల పాలనలో బీసీలను అణగదొక్కారు...ఇదేంటని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైల్లో బంధించారు... బీసీ బిడ్డను పెట్రోల్ పోసి తగులబెట్టారు... అక్రమ సంపాదనకు, అవినీతికి బీసీలను పావులుగా చేసుకున్నారు... చివరికి బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక అయిదేళ్లలో బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలి కొదిలేశారు... ఆనాడు బీసీల సంక్షేమం ఎందుకు గుర్తుకు రాలేదా..?'అని జగన్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ప్రశ్నించారు. బీసీలను రాజకీయంగా జగన్ దెబ్బతీస్తే... వెనుబడిన వర్గాలను సీఎం చంద్రబాబునాయుడు అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీలకు ఒకవైపు సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజకీయంగా వారి ఉన్నతికి పదవులు కేటాయిస్తున్నారన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామని, ఇందుకోసం న్యాయ పోరాటం చేస్తామని మంత్రి సవిత స్పష్టంచేశారు. రొద్దం మండలం కొగిర గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, పెనుకొండ నియోజక వర్గంలో 85 శాతం మేర ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తంచేస్తున్నారని, తమ నాయకులకు, కార్యకర్తలకు ఘన స్వాగతం



పలుకుతున్నారని ఆమె ఆనందం వ్యక్తంచేశారు. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదు నా బీసీలంటూ అధికారంలోకి వచ్చిన జగన్ బడుగు, బలహీన వర్గాల వారిని తన అయిదేళ్ల పాలనలో అణగదొక్కారని మంత్రి సవిత మండిపడ్డారు. సంక్షేమం, స్వయం ఉపాధి పథకాలు నిలిపేసి ఆర్థికంగా నిలదొక్కుకోకుండా అడ్డుకున్నారన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించి, బీసీలను రాజకీయంగా దెబ్బతీశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యాయని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారన్నారు. బీసీ బిడ్డలు చదువుకోవడం ఇష్టం లేక బీసీ హాస్టళ్లను, గురుకులాలను గాలికొదిలేశారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బీసీ నాయకులను అక్రమ కేసులు బనాయించి, జైల్లో నిర్బంధించారన్నారు. చివరికి బీసీలకు రక్షణ లేకుండా చేశారన్నారు. బీసీ బిడ్డపై పెట్రోల్ పోసి తగులబెట్టారన్నారు. వైసీపీ హయాంలో బీసీల జీవితం నరకప్రాయం మారిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తుండడంతో, బీసీలపై జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీసీల గురించి మాట్లాడే అర్హత జగన్ లేదని మంత్రిసవిత స్పష్టం చేశారు.

జగన్ అవినీతికి బీసీలు బలి


జగన్ అవినీతి, అక్రమార్జనకు వైసీపీకి చెందిన బీసీ నాయకులు బలైపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. బీసీ నాయకులకు పదవులు ఆశ చూపి, వారిని అక్రమ మద్యం తయారీ, మద్యం రవాణా, ఇసుక అక్రమ తవ్వకాలు ఇలాంటి కేసులు వారిని పావులుగా చేశారన్నారు. జగన్ ధన దాహానికి ఆయా కేసుల్లో బీసీలు ఇరుక్కోవడం బాధాకరమని మంత్రి సవిత అన్నారు. బీసీల మేలు కోరే సీఎం చంద్రబాబునాయుడు వారి రక్షణ కోసం బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు.

34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతాం... స్థానిక సంస్థల్లో బీసీలకు మొట్టమొదటి సారిగా అన్న ఎన్టీఆర్ 27 శాతం మేర రిజర్వేషన్లు కల్పించారని మంత్రి సవిత గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచారన్నారు. 2013లో జరిగిన ఎన్నికల్లో ఆ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయన్నారు. 2021లో బీసీ రిజర్వేషన్లను జగన్ 24 శాతానికి కుదించారన్నారు. దీనివల్ల బీసీలకు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీల సంక్షేమం కోరే సీఎం చంద్రబాబునాయుడు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని నిర్ణయించారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరుతామన్నారు. అంతకుముందు కొగిరి గ్రామంల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త ఆంజనేయుల కుటుంబానికి మంత్రి సవిత పరామర్శించారు. రూ.5 లక్షల జీవిత బీమా చెక్ ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. టీడీపీ కార్యకర్తల కుటుంబాల సంక్షేమమే మంత్రి నారా లోకేశ్ లక్ష్యమన్నారు. ఆయన ముందు చూపుతో అమలుచేసిన రూ.5 లక్షల జీవిత బీమా కష్టకాలంలో ఉన్న బాధిత కుటుంబాలకు ఆసరాగా ఉంటోందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీకి పాల్పడుతోంది

**ప్రజా దర్బార్ నిర్వహించిన ఎంపీ అవినాష్ రెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల



కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం పులివెందులలోని తన నివాసంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్ కు పులివెందుల నియోజకవర్గం నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమ సమస్యల ను వినతి పత్రాలను ఎంపీకి అందజేశారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన ఎంపీ, పలు సమస్యలపై సంబంధిత అధికారులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కొన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.పులివెందుల ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వాటర్ గ్రిడ్ పథకానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఈ పథకంలో 80 శాతానికి పైగా పనులు గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని అన్నారు.కేవలం మిగిలిపోయిన 20 శాతం చిన్న చిన్న పనులను రెండు సంవత్సరాలుగా సాగదీస్తూ, ఇప్పుడు పనులు పూర్తయినట్లుగా ప్రచారం చేసుకుని క్రెడిట్ చోరీకి కూటమి ప్రభుత్వం పాల్పడుతోందని ఎంపీ అవినాష్ రెడ్డి ధ్వజమెత్తారు. వైఎస్సార్ కుటుంబం పులివెందుల అభివృద్ధికి చేసిన కృషిని కూటమి ప్రభుత్వం తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోందని ఎద్దేవా చేశారు.ప్రజా దర్బార్ లో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు.. నిబంధనలు పాటించాలి

**- హెల్మెట్ తప్పనిసరి.. మైనర్లు వాహనాలు నడపరాదు**

**- సీఐ టి. నరసింహులు**

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక పట్టణంలో పలు ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు సీఐ టి. నరసింహులు ఈ–చలాన్లు విధించారు. ఈ సందర్భంగా సీఐ టి. నరసింహులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని తెలిపారు. ప్రతి వాహనానికి డ్రైవింగ్ లైసెన్స్, బీమా పత్రాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. వాహనాలకు నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడరాదని సూచించారు. ప్రమాదకరంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని తెలిపారు. రహదారిపై ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా డ్రైవింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## ఇండ్లు పగలగొట్టేందుకు సిద్ధమవుతున్న గుత్తేదారులు

**నష్టపరిహారం ఇవ్వకుండానే ఇళ్లు కూలుస్తున్నారని ఎంపీ అవినాష్ రెడ్డికి విన్నవించుకున్న కాలనీవాసులు**

ప్రజాభూమి,పులివెందుల



సారు మాకు న్యాయం జరగలేదు... స్థలం ఇవ్వలేదు, ఇండ్లు పగలగొట్టేందుకు గుత్తేదారులు సిద్ధమవుతున్నారు, మాకు న్యాయం చేయండి అంటూ రాజీవ్ నగర్ కాలనీ వాసులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి మొరపెట్టుకున్నారు. పులివెందుల పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీలో రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు నేషనల్ హైవే విస్తరణలోభాగంగా పోతున్నాయని, అయితే తమకు ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించలేదని, ప్రత్యామ్నాయ స్థలం కూడా చూపించలేదని మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కాలనీ ప్రజలు ఎంపీకి విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీ అవినాష్ రెడ్డి, ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారామాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, వారు సానుకూలంగా స్పందించి రాజీవ్ నగర్ కాలనీ ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇళ్లు కోల్పోతున్నామని ఆందోళన చెందవద్దని, మీకు వైకాపా పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీ అధ్యాపకుడికి పీహెచ్‌డీ




ప్రజాభూమి, వేంపల్లె

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్--ఆంధ్రప్రదేశ్ (ఆర్జీయూకేటీ--ఏపీ) ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీలో భౌతికశాస్త్ర సహాయ ఆచార్యుడిగా పనిచేస్తున్న డా. ఎం. భాస్కరయ్యకు వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ఆప్టోఎలక్ట్రానిక్ పదార్థాలు, నానో పదార్థాల రంగంలో చేసిన పరిశోధనకు గుర్తింపుగా ఈ పట్టా లభించింది. డా. భాస్కరయ్య 2010లో ఐఐటీ ఢిల్లీ నుంచి అనువర్తిత కాంతిశాస్త్రంలో ఎం.టెక్ పూర్తి చేశారు. అదే ఏడాది ఆర్జీయూకేటీ--ఏపీ ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీలో సహాయ ఆచార్యుడిగా విధుల్లో చేరారు. అనంతరం వీఐటీ వెల్లూరులో ప్రొఫెసర్ షేక్ కరిముల్లా పర్యవేక్షణలో డాక్టరల్ పరిశోధన కొనసాగించారు. పీహెచ్‌డీ పట్టా పొందిన డా. ఎం. భాస్కరయ్యను ఆర్జీయూకేటీ--ఏపీ ట్రిపుల్ ఐటీ ఆర్కే వ్యాలీ డైరెక్టర్, పరిపాలనా అధికారి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# వివేకా కేసులో బిగ్‌బాస్ ఎవరు? - రెడ్యం

**సునీత దంపతులు సమాధానం చెప్పాలని రెడ్డెం డిమాండ్**

ప్రజాభూమి,పులివెందుల



వివేకానంద రెడ్డి హత్య కేసులో బిగ్ బాస్ ఎవరో సునీత దంపతులు సమాధానం చెప్పాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని ఆయన నివాసంలో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేఎస్ కెనాల్ మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి కలిసి



దుశ్శాలువా, పూలమాలతో సత్కరించి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రెడ్యం మాట్లా డుతూ.. వివేకా కేసులో అవినా ష్ రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. ఈడీ సోదాలపై తాను ఎలాంటి తప్పు చేయలేదని, ధైర్యంగా ఎదుర్కొంటానని అవినాష్ చెప్పినట్లు తెలిపారు. వివేకా లేఖ, దస్తగిరి బెయిల్ పై సునీత ఎందుకు స్పందించడం లేదని, రాజకోట రహస్యం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో లింగారెడ్డి వీరప్రతాప్ రెడ్డి, మల్లె ఓబయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**యువత బాగా కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలి...మంత్రి**

**10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్--2026 విడుదలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం**

ప్రజాభూమి ప్రతినిధి అమరావతి:యువత కలలు కన్న భవిష్యత్ ను చంద్రబాబు నాయుడు సాకారం చేస్తున్నారని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం మరో తీపికబురు అందించడం పట్ల రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్--2026 విడుదలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల ఆయన సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి తెలిపారు. నాలుగు దశల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో పలు ఉద్యోగాల నోటిఫికేషన్లు వెలువడనున్నాయని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్‌లో గ్రూప్--1, గ్రూప్--2తో పాటు పోలీసు, ఫైర్, జైళ్లు, అటవీ, పశుసంవర్ధక, ఎక్సైజ్, ఇంజినీరింగ్, విద్యుత్ తదితర శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. డీఎస్సీ ద్వారా 2,991 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అన్నారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా కష్టపడి పోటీ పరీక్షలకు సిద్ధమై ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి అంకితభావంతో సేవలందించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి యువతకు పిలుపునిచ్చారు. జాబ్ క్యాలెండర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు.

# ప్రజాభూమి

జనరల్

బుధవారం , ఆగష్టు 26, 2026 12




## ఉయ్యూరులో రూ. 99.27 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ బాలశౌరి

### త్రాగునీరు, చెరువుల పునరుద్ధరణ పనులను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

### ఏఐఐబీ నిధులు రూ. 98.01 కోట్లు, అమృత్ 2.0 నిధులు రూ. 1.26 కోట్లు మంజూరు

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఉయ్యూరు పురపాలక సంఘం పరిధిలో ప్రజల తాగునీటి ఎద్దడి నివారణకు, పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం భారీ నిధులను మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ నిధులు 98.01 కోట్ల రూపాయలతో 'ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్' (AIIB) సౌజన్యంతో చేపట్టనున్న త్రాగునీటి సరఫరా అభివృద్ధి పథకానికి, అలాగే 'అమృత్ 2.0' (AMRUT 2.0) పథకం కింద 1.26 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనులకు మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ భాగస్వామ్యమై పనులను లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ... ఉయ్యూరు పురపాలక ప్రజల దాహార్తిని తీర్చేందుకు AIIB పథకం ఎంతగానో ఉపయో గపడుతుందని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమృత్ 2.0 పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ చేపట్టి పట్టణంలో జలవనరులను కాపాడుకుంటామని స్పష్టం చేశారు.పట్టణ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పురపాలక సంఘ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉయ్యూరులో తగ్గుముఖం పట్టిన డయేరియా లక్షణాల కేసులు

### -పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ అప్రమత్తత కొనసాగించాలి

### –జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఉయ్యూరు పట్టణంలో డయేరియా లక్షణాలతో నమోదైన కేసులు ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, పరిస్థితి నియంత్రణలో ఉన్నప్పటికీ ప్రజారోగ్య పరిరక్షణలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో అప్రమత్తంగా పనిచేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉయ్యూరు పట్టణంలోని 5వ వార్డు హరిజనవాడలో జిల్లా కలెక్టర్ పర్యటించి తాగునీటి సరఫరా పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి సరఫరా విధానం, నీటి నాణ్యత, క్లోరినేషన్ ప్రక్రియ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా వాంతులు, విరేచనాలు, జ్వరం తదితర అనారోగ్య లక్షణాలతో బాధపడుతున్నారా అనే వివరాలను స్థానికుల నుంచి సేకరించారు.తాగునీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టిడయేరియా లక్షణాల కేసుల నియంత్రణకు జిల్లా యంత్రాంగం వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు, పబ్లిక్ హెల్త్ తదితర శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగా ఉయ్యూరు పట్టణంలోని అన్ని ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్ల (OHSR) వద్ద సూపర్ క్లోరినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే డైరెక్ట్ పంపింగ్ సోర్సుల వద్ద డోజర్ల సహాయంతో ఇన్‌లైన్ క్లోరినేషన్ ప్రక్రియను అమలు చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో క్లోరినేషన్ స్థాయిలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ఇంటింటికీ ఫ్లోరింగ్ టాబ్లెట్ల పంపిణీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికీ ఆరోగ్య సర్వే నిర్వహిస్తూ, అవసరమైన మందులను అందిస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఇంటికి క్లోరిన్ టాబ్లెట్లను అందించనున్నారు అవసరమైన మందులు తదితరాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు. అనారోగ్య లక్షణా లు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్య అధికారులు సూచించారు.సురక్షితమైన నీటినే వినియోగించాలిప్రజలు ప్రస్తుతం ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సూపర్ క్లోరినేషన్‌కు సంబంధించి అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది టాంటాం, మైక్ అనౌన్స్‌మెంట్ల ద్వారా అందించే సూచనలు, సలహాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలన్నారు.తాగునీటిని కాచి, చల్లార్చిన తర్వాత మాత్రమే సేవించాలని, సురక్షితమైన నీటిని వినియోగించడం ద్వారా నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నివారించవచ్చని అధికారులు సూచించారు.22 కేసులు నమోదు – 17 మంది డిశ్చార్జ్ఉయ్యూరు పట్టణ పరిధిలో ఇప్పటివరకు డయేరియా లక్షణాలతో 22 కేసులు నమోదు కాగా, వారిలో 17 మంది చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. మరో ఐదుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు వైద్యాధికారులు తెలిపారు.కేసులు తగ్గుముఖం పట్టినప్పటికీ పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏ ఒక్క చిన్న సంఘటన కారణంగా కేసులు తిరిగి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల ను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థి తులు, తాగునీటి సరఫరా, క్లోరినేషన్ స్థాయిలు, వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేద ని పేర్కొన్నారు ఈ పర్యటనలో ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డీసీహెచ్ఎస్, మున్సిపల్ సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్, సోలార్ సిస్టం ప్రారంభం

❖ ప్రారంభించిన ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము ❖ సిఎస్ఆర్ నిధులు రూ.1.85 కోట్లతో సిటీ స్కాన్ సెంటర్, రూ.76.60 లక్షలతో సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు.... ❖ ప్రైవేటులో వేలాది రూపాయలు ఖర్చయ్యే సిటీ స్కాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితం ❖ పేదలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం:ఎంపీ బాలసౌరి ❖ త్వరలో డయాలసిస్, ట్రోమా కేర్ సెంటర్లు ఏర్పాటు:ఎంపీ ❖ కూటమిపాలనలో ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక వసతులు తీసుకొచ్చాం: ఎమ్మెల్యే రాము ❖ మురికి కూపంలా ఉన్న ఆసుపత్రిని పరిశుభ్రంగా మార్చాం: ఎమ్మెల్యే ❖ జిల్లా స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే రాము ❖ గుడివాడ అభివృద్ధికి రూ.6కోట్లు విరాళం ఇచ్చిన దాతలు అన్నే నరసింహారావు దంపతులను సత్కరించిన....ఎంపీ,ఎమ్మెల్యే

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో మరో రెండు కీలక వైద్య, మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ సిఎస్ఆర్ నిధులతో రూ.1.85 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ సెంటర్‌ను, రూ.76.60 కోట్లతో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ సిస్టంను ఎంపీ వల్లభనేని బాలసౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ప్రారంభోత్సవానికి హాజరైన ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాముకు కూటమి నాయకులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.అనంతరం అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించిన ఎంపీ, ఎమ్మెల్యే.. సిటీ స్కాన్ సెంటర్, సోలార్ పవర్ సిస్టంను పరిశీలించారు. సిటీ స్కాన్ పనితీరు, అందుబాటులో ఉండే వైద్య సేవలపై వైద్యాధికారులు వారికి వివరించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ వల్లభనేని బాలసౌరి మాట్లాడుతూ.. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రమాదాల సమయంలో అత్యవసరంగా అవసరమయ్యే సిటీ స్కాన్ సేవలు ఇకపై గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరమన్నారు.ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.3 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చయ్యే సిటీ స్కాన్ పరీక్షలను పేదలకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందించే అవకాశం ఏర్పడిందన్నారు. పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో ఉండే స్థాయి సిటీ స్కాన్ పరికరాన్ని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్యులు, సిబ్బంది ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.సోలార్ పవర్ సిస్టం ఏర్పాటు వల్ల ఆసుపత్రికి ప్రతి నెల సుమారు రెండు లక్షల రూపాయల విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందని.. ఆ మొత్తాన్ని ఆసుపత్రి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుందని ఎంపీ బాలసౌరి తెలిపారు.గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ సెంటర్, ట్రోమా కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సిఎస్ఆర్ నిధులతో ఈ రెండు కేంద్రాలను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ప్రమా దాల సమయంలో ఒక్క పేద కుటుంబం కూడా ఆర్థికంగా నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ఈ వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఎంపీ స్పష్టం చేశారు.గుడివాడ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని.. ఫ్లైఓవర్ పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. రైల్వే గేట్ల వద్ద చేపట్టాల్సిన పనుల కారణంగానే కొంత ఆలస్యం జరుగుతోందన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.24 కోట్లతో అంచనాలు రూపొందించామని.. త్వరలోనే నిధులు మంజూరయ్యేలా ఎమ్మెల్యే రాముతో కలిసి కృషి చేస్తున్నామని చెప్పారు.అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ.. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని.. గతంలో మురికి కూపంలా ఉన్న ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా మార్చామని చెప్పారు.ఆసుపత్రిలో ఒక్కొక్కటిగా అవసరమైన వసతులను ఏర్పాటు చేసుకుంటున్నామని.. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీ బాలసౌరి అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. త్వరలోనే డయాలసిస్





సెంటర్‌ను కూడా కార్యరూపంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా స్థాయి ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే రాము వెల్లడించారు.ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులను వైద్యులు, సిబ్బంది చిరునవ్వుతో పలకరిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం ఆసుపత్రి అభివృద్ధికి రూ.3కోట్లు, బస్టాండ్ అభివృద్ధికి మరో మూడు కోట్లు విరాళాలు అందించిన అన్నే నరసింహారావు, పుష్పా లీలావతి దంపతులను ఎంపీ బాలసౌరి, ఎమ్మెల్యే రాము, కూటమి నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఏరియా హాస్పటల్ సూపర్డెంట్ ఇందిరా దేవి, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ జోన్స్, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, జిల్లా నాయకులు సందు పవన్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మజ్జి శ్రీనివాస్ ,మరీదు కరుణ, దేవేంద్రుడు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికు మార్, తాసిల్దార్ ప్రసాద్,ఎలక్ట్రికల్ డిఈ శ్రీనివాసరావు,గుడివాడ టిడిపి అధ్యక్షుడు పంద్రాజు సాంబయ్య, బిజెపి జిల్లా నాయకులు అంగడాల సతీష్,టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, బొంబాయి శ్రీను,రెడ్డి షణ్ముఖ, షేక్ జానీ, పెద్దు వీరభద్రరావు , కంచర్ల సుధాకర్, గుత్తా చంటి, షేక్ ఇబ్రహీం, మజ్జాడ నాగరాజు,మహ్మద్ రఫీ ,సయ్యద్ జబీన్...గుడివాడ జనసేన నాయకులు సాయన రాజేష్, బుడుమ రాజు, కొదముల గంగాధర్, మీరావాలి, దాసరి మహేష్, పంచకర్ల అమర్ , హాస్పిటల్ వైద్యులు, మెడికల్ సిబ్బంది, నర్సులు, కూటమి నాయకులు, పలువురు పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండాలి: కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా

ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.ఎలక్టోరల్ వెరిఫికేషన్ ప్రక్రి యలో భాగంగా ఓటర్ల జాబితాలో నమోదైన అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై మంగళవారం పెనమలూరు మండలం గోశాల గ్రా మంలోని గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రజా విచారణను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా అభ్యం త రాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసిన ఓటర్లను కలెక్టర్ స్వయంగా విచారించి, వారి వాదనలు, అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు, చిరునామాలు తదితర అంశా లకు సంబంధించి సమర్పించిన దరఖాస్తులు, ఆధారాలను పరిశీలించారు.ఎలక్టోరల్ వెరిఫికేషన్ ప్రక్రియలో ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్లు, ఒకే వ్యక్తికి సంబంధించిన బహుళ నమోదులు వంటి అంశాలను గుర్తించి ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగు ణంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజలకు తమ అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై వాదనను స్వ యంగా వినిపించే అవకాశం కల్పించాలని, వారు సమ ర్పించిన ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం నిబంధనల మేరకు నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధి కారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.ఈ ప్రజా విచారణలో కలెక్టర్ తో పాటు ఉయ్యూరు ఆర్డీవో ఎస్ కరుణ కుమారి, ఎన్నికల సంబంధిత అధికారులు, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చాపాటి గంగిరెడ్డి జ్ఞాపకార్థం దివ్యాంగులకు గృహోపకరణాల పంపిణీ



### గణితబ్రహ్మ చాపాటి గంగిరెడ్డి చిరస్మరణీయుడు

### వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి

ప్రజాభూమి, పులివెందుల

పులివెందుల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన చాపాటి గంగిరెడ్డి నిరుపేద రైతుకుటుంబంలో జన్మించినప్పటికీ, స్వయంకృషితో పైకి వచ్చి, ఉపాధ్యాయుడిగా, ముఖ్యంగా గణితశాస్త్రంలో అసాధారణ ప్రజ్ఞా పాటవాలతో విద్యార్థులకు సులభరీతిలో గణిత సమస్యలను పరిష్కరించి, ఎందరో శిష్యులను ఉపాధ్యాయులుగా, సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దారని, ఆయన జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రవాస భారతీయులైన మధుసూదన్ రెడ్డి, కృష్ణ కిషోర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు సి జి ఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, ప్రతి ఏటా నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించి మెరిట్ విద్యార్థులకు ప్రైజ్ మనీ అందించి, నైపుణ్యం ఉన్నవారిని ప్రోత్సహిస్తుండడం అభినందనీయమని, ఆయన స్మారకార్థం దివ్యాంగులకు చేయూతనిస్తుండడం ప్రశంసనీయమని, వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు స్వర్గీయ చాపాటి గంగిరెడ్డి 9వ వర్ధంతి పురస్కరించుకొని వారి కుటుంబ సభ్యులు బ్రాహ్మణపల్లి రోడ్డు లోని వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన ఒక సంస్మరణ కార్యక్రమంలో గంగిరెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి రాములమ్మ ఇతర కుటుంబసభ్యులు పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతికై రెండునిమిషాలు మౌనం పాటించారు. తదనంతరం చాపాటి కుటుంబసభ్యులు 25మంది దివ్యాంగుల కుటుంబాలకు గృహోపకరణాలైన ప్రెషర్ కుక్కర్లు వితరణగా అందించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.ఈకార్యక్రమంలో గంగిరెడ్డి సతీమణి రాములమ్మ, వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘునాథ రెడ్డి, హిమకుంట్ల హైస్కూలు హెడ్మాస్టర్ కృష్ణవేణి, చెన్నారెడ్డి, చాపాటి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, దివ్యాంగులు పాల్గొన్నారు.


Printed and Published and owned by A.RAMAMOHANREDDY, Printed at sri lakshmi narasimha artprinters, H.NO. 28-5-257,housing board colony, Anantapur-515001, Andhra Pradesh.and Published from H.NO. 28-5-257,housing board colony, ANANTAPUR-515001, Andhra Pradesh. Editor : A.RAMAMOHANREDDY.RNI NO:APTEL/2023/90641, Cell: 9502116677

# మానవత్వమే మార్గం

- అదే మిలాద్ సందేశం
- మక్కా, మదీనా నమూనాలతో శాంతి ర్యాలీలు
- ప్రేమ, కరుణ, సోదరభావమే ప్రవక్త బోధనల స్ఫూర్తి

**ప్రజాభూమి ప్రతినిధి-హిందూపురం టౌన్**

ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ నిర్వహించే మీలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రార్థనలు, ధార్మిక కార్యక్రమాలతో పాటు శాంతి, సోదరభావం, మత సామరస్యాన్ని చాటేలా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా హిందూపురం పట్టణంలో మక్కా, మదీనా నమూనాలతో శాంతి ర్యాలీలు నిర్వహించనున్నారు. పట్టణంలోని మేళాపురం, ముక్కడిపేట గౌసియా మసీదు నుంచి, అలాగే రహమత్‌పురంలోని పాల డైరీ వద్ద నుంచి ప్రత్యేక ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మక్కా, మదీనా నమూనాలను అలంకరించి ర్యాలీల్లో ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొంటూ ప్రవక్త మహమ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, కరుణ, సోదరభావం, సమానత్వం వంటి విలువలను చాటుతున్నారు. ర్యాలీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మీలాద్ ఉన్ నబీ కేవలం ఒక మతపరమైన పర్వదినం మాత్రమే కాదని, మానవత్వాన్ని చాటే సందేశాన్ని సమాజానికి అందించే సందర్భంగా పలువురు పేర్కొంటున్నారు. పేదలు, బలహీనులు, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం, పొరుగువారిని గౌరవించడం, ఇతరుల పట్ల కరుణతో వ్యవహరించడం, అన్యాయానికి దూరంగా ఉండటం వంటి విలువలను ప్రవక్త మహమ్మద్ బోధనలు గుర్తుచేస్తున్నాయి.

**శాంతి, సోదరభావమే ప్రధాన సందేశం**


ప్రస్తుతం సమాజంలో వివిధ కారణాలతో విభేదాలు, అసహనం పెరుగుతున్న తరుణంలో శాంతి, పరస్పర గౌరవం, సహనం ఎంతో అవసరం. మతం, కులం, భాష, ప్రాంతం వంటి భేదాలకు అతీతంగా ప్రతి మనిషిని గౌరవించాలనే సందేశాన్ని మీలాద్ ఉన్ నబీ అందిస్తోంది. హిందూపురంలో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీలు కూడా ఇదే స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయి. పండుగ సందర్భంగా పేదలకు అన్నదానం, సేవా కార్యక్రమాలు, ప్రార్థనలు, ధార్మిక సభలు నిర్వహించడం ద్వారా పర్వదినానికి సామాజిక స్ఫూర్తిని జోడిస్తున్నారు. పండుగ ఒక రోజుకే పరిమితం కాకుండా ప్రేమ, దయ, సహనం, సేవా భావాలను రోజువారీ జీవితంలో కొనసాగించాలనే ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

**మత సామరస్యానికి ప్రతీకగా హిందూపురం**

వివిధ మతాలు, కులాలు, వర్గాలకు చెందిన ప్రజలు కలిసి జీవించే హిందూపురంలో పండుగలు పరస్పర సోదరభావానికి వేదికలుగా నిలుస్తున్నాయి. ఒకరి పండుగను మరొకరు గౌరవించుకోవడం, కష్టసమయంలో పరస్పరం అండగా నిలవడం పట్టణ సామాజిక ఐక్యతకు బలం చేకూరుస్తోంది. మీలాద్ ఉన్ నబీ సందర్భంగా నిర్వహిస్తున్న శాంతి ర్యాలీలు మత సామరస్యం, శాంతి, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. మక్కా-మదీనా నమూనాలతో సాగుతున్న ఈ ర్యాలీలు ప్రజలను ఆకట్టుకుంటుండగా, ప్రవక్త మహమ్మద్ బోధించిన మానవతా విలువలను ఆచరణలో పెట్టాలనే సందేశాన్ని అందిస్తున్నాయి.

**మనసుల్లో వెలిగే వెలుగే అసలైన పండుగ**

మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రార్థనలు, ర్యాలీలు, అలంకరణలు ఎంత ముఖ్యమో..




మనసుల్లో మానవత్వాన్ని నింపుకోవడం అంతకంటే ముఖ్యమనే భావన వ్యక్తమవుతోంది. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, పేద విద్యార్థులకు సహాయం చేయడం, వృద్ధులను ఆదుకోవడం, పొరుగువారిని గౌరవించడం వంటి ప్రతి మంచి పని పండుగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది. ద్వేషానికి బదులు ప్రేమను, విభేదాలకు బదులు సోదరభావాన్ని, అసహనానికి బదులు సహనాన్ని ఎంచుకోవడమే మీలాద్ ఉన్ నబీ అసలు సందేశం. హిందూపురంలో మక్కా, మదీనా నమూనాలతో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీలు ఈ సందేశాన్ని మరింత బలంగా చాటుతున్నాయి.

# జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై సానుకూలంగా..సానుభూతితో పరిశీలిస్తాం

- స్టైపెండ్ పెంపుపై ఉన్నత స్థాయి అధికారుల కమిటీ త్వరలోనే జూడా ప్రతినిధులతో భేటీ
- రిటైర్మెంట్ వయసు పెంపుపైనా పునఃపరిశీలన
- నాన్ క్లినికల్ పోస్టుల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అభ్యర్థుల అంశాన్నీ పరిశీలిస్తాం
- సమ్మె విరమించిన జూడాలకు వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ కృతజ్ఞతలు

**ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి**



జూనియర్ డాక్టర్ల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిమితులను దృష్టిలో ఉంచుకుని.. ఇతర రాష్ట్రాల్లో జూనియర్ డాక్టర్లకు అందుతున్న స్టైపెండ్, ఇతర ప్రయోజనాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణల్లో వీరికి అందుతున్న స్టైపెండ్ తదితర అంశాలను రాష్ట్రంలో అమలవుతున్న విధానంతో పోల్చి ఇప్పటికే కూలంకషంగా చర్చించామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారంనాడు జూడా ముఖ్య ప్రతినిధులు మంత్రి సత్య కుమార్, కార్యదర్శి జి వీర పాండియన్ ను కలిశారు. సమ్మెను విరమించి విధుల్లోనికి వెళ్లడం ప్రారంభించినట్లు ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా వారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో మంత్రి శ్రీ సత్య కుమార్ మాట్లాడారు. జూనియర్ డాక్టర్లు ప్రధానంగా స్టైపెండ్ పెంపుతో పాటు రిటైర్మెంట్ వయసు పెంచకూడదని జూడా ప్రతినిధులు ఇంతకుముందు డిమాండ్ చేశారని మంత్రి తెలిపారు. రిటైర్మెంట్ వయసు పెంపు అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వైద్యుల లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో ఆ అంశాన్ని కేవలం పరిశీలన మాత్రమే చేశామని చెప్పారు. జూడాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని దీనిపై మరోసారి పునఃపరిశీలన చేస్తామని వెల్లడించారు. స్టైఫండ్ పెంపు అంశంపై ప్రత్యేకంగా కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ ఆధ్వర్యంలో కమిటీ పనిచేస్తుందని చెప్పారు. ఒకటి రెండు రోజుల్లో జూడా సంఘాల నాయకులతో కమిటీ సమావేశమై వారి డిమాండ్లపై చర్చిస్తుందని తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక పరిమితులు, అందుబాటులో ఉన్న వనరులు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నాన్ క్లినికల్ విభాగాల్లో ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన వారిని నియమించే అంశంపైనా మరోసారి పునఃపరిశీలన చేస్తామని మంత్రి చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. జాతీయ వైద్య కమిషన్ (చీవీజ) మార్గదర్శకాలకు అనుగుణంగా కొత్త వైద్య కళాశాలలను త్వరగా ప్రారంభించాల్సిన అవసరం ఏర్పడిందని, అందులో భాగంగానే నోటిఫికేషన్లు జారీ చేసినట్లు తెలిపారు. వాటికి తగిన స్పందన రాని పరిస్థితుల్లో కొన్ని చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ అంశంపైనా జూడాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునఃపరిశీలిస్తామని స్పష్టం చేశారు. జూడాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సత్యకుమార్ తెలిపారు. ప్రభుత్వం వారి డిమాండ్ల పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ పరిమితులపై జూడా నాయకులకు కూడా అవగాహన ఉందన్నారు.

## ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలి



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

రాబోయే వినాయక చవితి పండుగను భక్తి, ప్రశాంతంగా వాతావరణంలో నిర్వహించుకోవాలని కొవ్వూరు రూరల్ సీఐ విజయబాబు కోరారు. తాళ్లపూడి విచ్చేసిన ఆయన స్థానిక నాయకులతో సమావేశమై వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్సవాల సమయంలో అధిక శబ్దాలు చేసే డీజేలు ఏర్పాటు చేయరాదని, ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించవద్దని సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటులో నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని కోరారు. నిమజ్జనం సమయంలో అప్రమత్తంగా ఉండి, పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై టి. రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## తాళ్లపూడిలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు డోర్ టు డోర్ కార్యక్రమం



**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

తాళ్లపూడి మండలం తాళ్లపూడి గ్రామంలో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో కొవ్వూరు నియోజక వర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్థానిక ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నామన పరమేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు సిద్ద దుర్గారావు, వుండతా వీరేంద్ర, కొప్పాక కోట్నెస్, జడ్డు శ్రీను, కొటారు వెంకట్రావు, కూచి పూడి గణపతి, అన్నమరెడ్డి రమణ, నామా నరేంద్ర, శ్రీరాములు, మైగాపుల సంపత్, అధికారులు డిప్యూటీ ఎంపీడీఓ వీరన్న, కార్యదర్శి శుభద్ర, ఆర్ ఐ రామకృష్ణ, వీఆర్వో లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# వెలిగొండ జలసిరులు – అభివృద్ధికి రెక్కలు

- కరవు నేలకు జలప్రదాత చంద్రబాబు
- వెలిగొండ వెలుగులు... కరవు నేలకు కృష్ణమ్మ జలాలు
- దశాబ్దాల కల... చంద్రన్న నిజం చేసిన వేళ
- చంద్రబాబు 30 ఏళ్ల పంతం... మార్కాపురం కరవు అంతం
- అవాంతరాలు... అడ్డంకులు.. సవాళ్లు... సమస్యలు దాటుకుని కృష్ణమ్మ పరుగులు
- చరిత్రలో నిలిచిపోనున్న చంద్రబాబు భగీరథ ప్రయత్నం
- వెలిగొండ సాకారంతో ఇక కరవుపై గెలుపు
- కరువును చూసిన తరాలకు... కృష్ణమ్మను చూపుతున్న సీబీఎన్
- 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు... 23 లక్షల మందికి తాగునీరు
- శ్రీశైలం మల్లన్న నుంచి మార్కాపురం చెన్నకేశవుని చెంతకు కృష్ణమ్మ
- 2026 ఆగస్టు 31వ తేదీన ఫేజ్-1 ప్రారంభంతో కొత్త చరిత్రకు శ్రీకారం

**ప్రజాభూమి ప్రతినిధి-అమరావతి**

తరతరాల వ్యథకు ముగింపు – ఇక వెలిగొండ వెలుగులు ఆరంభంఒక బిందెడు నీళ్ల కోసం ఎదురు చూడడం... ఫ్లోరైడ్ సమస్యలతో అనారోగ్యానికి దరిచేరడం... పంట పండుతుందనే ఆశతో విత్తనం వేయడం... పంట పండకపోతే వలస పోవడం... ఇవన్నీ మార్కాపురం జిల్లా ప్రజల కథలు కావు... వాళ్లు అనుభవించిన బాధ.. పద్ద వ్యధ.ఎండాకాలాన్ని తలుచుకుంటేనే ఈ నేల ప్రజల గొంతు తడారేది. నీరు లేని నేలలో రైతు భవిష్యత్తు వాడిపోయేది. వర్షం పడితే పంట... పడకపోతే అప్పు. బోరు పనిచేస్తే సాగు... అడుగంటితే వలస. ఇలా తరతరాలుగా కరువుతో పోరాడిన నేలకు వెలిగొండ అనేది ఒక సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదు... బతుకు మీద భరోసా.

సీఎం చంద్రబాబు తన భగీరథ ప్రయత్నంతో కరువుతో పోరాడిన నేలకు కృష్ణమ్మను చేర్చారు. ఒకప్పుడు రాయలసీమ ప్రాంతం కంటే తీవ్ర కరువు కష్టాలకు చిరునామాగా నిలిచిన మార్కాపురం ప్రాంతానికి ఇప్పుడు వెలిగొండ జలాలు కొత్త ఆశను తీసుకొస్తున్నాయి.వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం అంటే అదో కార్యక్రమం కాదు... నీటి కోసం ఎదురుచూసిన తరాల నిరీక్షణకు సమాధానం. బిందెడు నీటి కోసం తిరిగిన తల్లుల కష్టాలకు ఉపశమనం. నీటి కోసం ఎండిన డొక్కలతో ఎదురు చూసే రైతుల్లో కలిగిన నమ్మకం. వలసలు బాధలు తప్పుతున్నాయనే ఊరట. కరువు నేలపై కృష్ణమ్మ అడుగుపెడితే రైతు ఇంటికి ఆదాయం. గ్రామానికి జీవం. యువతకు ఉపాధి. కుటుంబానికి భరోసా.ఇప్పటివరకు వర్షం కోసం ఆకాశం వైపు చూసిన కళ్లు... ఇక నీటి కోసం కాలువ వైపు చూడనున్నాయి.. బోరుబావి పని చేస్తుందో లేదోనని ఆందోళన చెందిన రైతు... ఇక ఏ పంట వేయాలా అని ఆలోచించనున్నాడు. ఏ ఊరు వలస వెళ్లాలా అని నగరాల వైపు చూసిన కుటుంబాలు... సొంత ఊరిలోనే ఉపాధి వెతుక్కోనున్నాయి. ఒకప్పుడు పొట్ట చేత పట్టుకున్న కుటుంబాలు... ఇక పంట చేత పట్టుకోనున్నాయి. ఇక ఈ నేల నుంచి వలసలు ఆగనున్నాయి... పంటలు, ఉత్పత్తులు, మార్కెట్లకు వెళ్లనున్నాయి. ఇది ప్రాజెక్టు కాదు.. ఒక ప్రాంతం పునర్జన్మ. ఏళ్ల తరబడి కరువును చూసిన మార్కాపురం నేలకు వెలిగొండ ఒక కొత్త అధ్యాయం. నీళ్లు ఎక్కడ? అనే ప్రశ్న కాదు... ఏ పంట వేయాలి? అనే ప్రశ్న ఉండాలి. పని కోసం ఎక్కడికి వెళ్లాలి? అనే మాట కాదు... మన ఊరిలోనే ఏ పని చేసుకోవాలి? అనే మాట వినిపించాలి. వాన కోసం ఎదురుచూపు మాత్రమే కాదు... పంటపై భరోసా ఉండాలి.నీటి కోసం ఎదురుచూసిన ఈ నేల... ఇకపై నీటితో తన బతుకును తానే మార్చుకున్న ప్రాంతంగా గుర్తింపు పొందాలి... విజయాల మోత మోగాలి. వెలిగొండ ఒక సాగునీటి మాత్రమే ప్రాజెక్టు కాదు... ఈ నేలకు కొత్త శ్వాస.తరతరాల వ్యథకు ముగింపు... ఇక వెలిగొండ వెలుగులు ఆరంభం ఒక బిందెడు నీళ్ల కోసం ఎదురు చూడడం... ఫ్లోరైడ్ సమస్యలతో అనారోగ్యానికి గురికావడం... పంట పండుతుందనే ఆశతో విత్తనం వేయడం... పంట పండకపోతే వలస వెళ్లడం... ఇవన్నీ మార్కాపురం ప్రాంత ప్రజలకు గత తరాలుగా పరిచయమైన చేదు అనుభవాలు. ఎండాకాలం వస్తుందంటేనే ఈ నేల ప్రజల గొంతు తడారేది. నీరు లేని నేలలో రైతు భవిష్యత్తు వాడిపోయేది. వర్షం పడితే పంట, వర్షం పడకపోతే అప్పు. బోరు పనిచేస్తే సాగు, భూగర్భజలాలు అడుగంటితే వలస. ఇలా తరతరాలుగా కరువుతో పోరాడిన నేలకు వెలిగొండ ప్రాజెక్టు కేవలం సాగునీటి ప్రాజెక్టు కాదు... బతుకుపై భరోసా. ముఖ్యమంత్రి చంద్రబాబు తన భగీరథ ప్రయత్నంతో కరువుతో పోరాడిన నేలకు కృష్ణమ్మను చేర్చే లక్ష్యాన్ని సాకారం చేస్తున్నారు. ఒకప్పుడు రాయలసీమ ప్రాంతం కంటే తీవ్ర కరువు పరిస్థితులకు చిరునామాగా నిలిచిన పశ్చిమ ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలకు వెలిగొండ జలాలు కొత్త ఆశను తీసుకొస్తున్నాయి. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు... నీటి కోసం ఎదురుచూసిన తరాల నిరీక్షణకు సమాధానం. బిందెడు నీటి కోసం తిరిగిన తల్లుల కష్టాలకు ఉపశమనం. నీటి కోసం ఎండిన నేల వైపు చూస్తూ ఎదురుచూసిన రైతుల్లో కొత్త నమ్మకం. వలసల బాధలు తప్పుతున్నాయనే ఊరట.కరువు నేలపై కృష్ణమ్మ అడుగుపెడితే రైతు ఇంటికి ఆదాయం వస్తుంది. గ్రామానికి జీవం వస్తుంది. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. కుటుంబాలకు భరోసా ఏర్పడుతుంది. ఇప్పటివరకు వర్షం కోసం ఆకాశం వైపు చూసిన కళ్లు ఇక నీటి కోసం కాలువ వైపు చూడనున్నాయి. బోరుబావి పనిచేస్తుందో లేదోనని ఆందోళన చెందిన రైతు ఇక ఏ పంట వేయాలా అని ఆలోచించనున్నాడు. ఏ ఊరికి వలస వెళ్లాలా అని నగరాల వైపు చూసిన కుటుంబాలు సొంత ఊరిలోనే ఉపాధి వెతుక్కోనున్నాయి. ఒకప్పుడు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్లిన కుటుంబాలు ఇక పంట చేత పట్టుకునే పరిస్థితి ఏర్పడనుంది.

ఇది కేవలం ఒక ప్రాజెక్టు కాదు... ఒక ప్రాంత పునర్జన్మ. ఏళ్ల తరబడి కరువును చూసిన మార్కాపురం నేలకు వెలిగొండ ఒక కొత్త అధ్యాయం. ఇక నీళ్లు ఎక్కడ అనే ప్రశ్నకు బదులుగా ఏ పంట వేయాలి అనే ప్రశ్న వినిపించాలి. పని కోసం ఎక్కడికి వెళ్లాలి అనే ఆలోచనకు బదులుగా మన ఊరిలోనే ఏ పని చేసుకోవాలి అనే ఆశ కలగాలి. వాన కోసం ఎదురుచూపు మాత్రమే కాకుండా పంటపై భరోసా ఉండాలి. నీటి కోసం ఎదురుచూసిన ఈ నేల ఇక నీటితో తన బతుకును తానే మార్చుకున్న ప్రాంతంగా గుర్తింపు పొందాలి.

**వెలిగొండ ప్రాజెక్టు... కృష్ణా జలాలతో కొత్త భరోసా**

శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్, కొల్లం వాగు ఎగువ భాగం నుంచి నీటిని గ్రావిటీ ద్వారా వెలిగొండ ప్రాజెక్టుకు తరలించేలా రూపకల్పన చేశారు. ప్రాజెక్టులో మొత్తంగా 53.85 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.10,200 కోట్లు కాగా, మొదటి విడత పూర్తయ్యే నాటికి రూ.7,983 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. 2014-19, 2024-26 మధ్య కాలంలో టీడీపీ, కూటమి ప్రభుత్వాల హయాంలో ప్రాజెక్టు పనులకు వేగం పెరిగింది. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.981 కోట్ల పనులు చేపట్టినప్పటికీ, అందులో రూ.140 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో వాస్తవంగా చెల్లింపులు జరిగిన మొత్తం రూ.841 కోట్లకే పరిమితమైందని ప్రభుత్వం పేర్కొంటోంది.టీడీపీ, కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్న కాలంలో 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాల పనులను వేగంగా పూర్తి చేశాయి. 21.8 కిలోమీటర్ల మేర ఫీడర్ కాలువల పనులు కూడా చేపట్టారు. జలాశయ నిర్మాణంలో భాగంగా సుంకేసుల, గొట్టిపడియ, కాకర్ల గ్యాప్‌ల వద్ద మూడు కాంక్రీట్ చీఫ్ డ్యామ్‌లు నిర్మించారు. తీగలేరు, గొట్టిపడియ, తూర్పు ప్రధాన కాలువలు ప్రాజెక్టులో ప్రధాన కాలువలుగా ఉన్నాయి. వెలిగొండ ద్వారా మొత్తంగా 4,47,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలగనుంది. ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాల పరిధిలోని 30 మండలాల ప్రజల దశ, దిశను ఈ ప్రాజెక్టు మార్చనుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3,36,100 ఎకరాలు, నెల్లూరు జిల్లా పరిధిలో 84,000 ఎకరాలు, కడప జిల్లాలో 27,200 ఎకరాలకు సాగునీరు అందనుంది. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాలువ కింద 3,70,800 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రాజెక్టు ద్వారా 30 మండలాల్లోని 4.47 లక్షల ఎకరాలకు సాగునీటి ప్రయోజనం కలగడంతో పాటు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో సుమారు 23 లక్షల మందికి తాగునీరు అందనుంది. తొలి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, నాలుగు లక్షల మందికి తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. రెండో విడతలో



3.283 లక్షల ఎకరాలకు సాగునీరు, 11.25 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. మొదటి విడత ప్రారంభంతో 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు.ప్రాజెక్టు కోసం మొత్తం 35,032 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 30,300 ఎకరాల భూసేకరణ పూర్తయింది. 11 ముంపు గ్రామాలకు చెందిన 7,321 ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను గుర్తించారు. పునరావాసం, పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పరిహారం చెల్లింపులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది.

**చంద్రబాబు 30 ఏళ్ల పంతం... మార్కాపురం కరువు అంతం**

రాష్ట్రంలో అత్యంత కరువు ప్రభావిత ప్రాంతాల్లో పశ్చిమ ప్రకాశం ఒకటి. ఈ ప్రాంతంలో సగటు వర్షపాతం 650 మిల్లీమీటర్లను కూడా దాటని పరిస్థితులు ఉన్నాయి. తీవ్రమైన వర్షాభావం, భూగర్భజలాలు అడుగంటిపోవడం, పంట నష్టాలు ఈ ప్రాంత రైతుల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. కనిగిరి, కంభం, పొదిలి ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య కూడా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వెలిగొండ ప్రాజెక్టును రూపకల్పన చేశారు.శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్స్ నుంచి పూర్తి గ్రావిటీతో 43.50 టీఎంసీల కృష్ణా జలాలను జంట సొరంగాల ద్వారా తరలించేలా ప్రాజెక్టును డిజైన్ చేశారు. నదీగర్భంలో కాకుండా గ్రావిటీ ద్వారా నీటిని తరలించి నిల్వ చేసే అతి పెద్ద ప్రాజెక్టుల్లో వెలిగొండ ఒకటి. నల్లమలసాగర్‌లో నీటిని నిల్వ చేసి, అక్కడి నుంచి మూడు ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారు.

**సాగునీటితో పాటు ప్రజారోగ్యానికి భరోసా**

దశాబ్దాల కలను సాకారం చేయాలనే సంకల్పంతో వెలిగొండను కేవలం వ్యవసాయానికి ఉపయోగపడే ఇరిగేషన్ ప్రాజెక్టుగా కాకుండా, స్వచ్ఛమైన తాగునీటిని అందించే ప్రజారోగ్య ప్రాజెక్టుగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత ఉపశమనం కలిగే అవకాశం ఉంది.సాగునీటి లభ్యతతో పంటలపై అనిశ్చితి తగ్గుతుంది. రైతులు తమకు అనుకూలమైన పంటలను ఎంచుకునే అవకాశం పెరుగుతుంది. పంటల వైవిధ్యం పెరగడంతో దిగుబడులు మెరుగుపడతాయి. తద్వారా రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. భూగర్భజలాల పునరుద్ధరణకు కూడా అవకాశం ఏర్పడుతుంది. బోర్లపై ఆధారపడటం తగ్గడంతో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. వ్యవసాయ అనుబంధ రంగాలు, మార్కెటింగ్, ప్రాసెసింగ్, సేవారంగాలు గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించే అవకాశం ఉంటుంది.

**వలసలకు అడ్డుకట్ట... అభివృద్ధికి బాట**

వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడంతో వ్యవసాయంతో పాటు హార్టికల్చర్, అగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. , దొనకొండ వంటి పారిశ్రామిక ప్రాంతాల అవసరాలకు నీటి లభ్యత పెరగడంతో పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఊతం లభించే అవకాశం ఉంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన జీవనాధారం ఏర్పడి వలసలు తగ్గే అవకాశం ఉంది.వెలిగొండ నీటితో సాగు విస్తీర్ణం పెరిగితే ఉద్యాన పంటల సాగుకు కూడా అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. హార్టికల్చర్, అగ్రో ప్రాసెసింగ్ యూనిట్లను రామాయపట్నం పోర్టుతో అనుసంధానం చేసే అవకాశాలు పెరుగుతాయి. పంట ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు విలువ ఆధారిత వ్యవస్థ అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్రజాభూమి

జనరల్ 14

బుధవారం 26 ఆగస్టు 2026

## అమ్మవారిని దర్శించుకున్న నూతన ఏపీ లోకాయుక్త జస్టిస్ టి. మల్లికార్జున రావు



ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన లోకాయుక్త (రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి) జస్టిస్ తాళ్లప్రగడ మల్లికార్జున రావు తన కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆయన కుటుంబ సమేతంగా అమ్మవారి దర్శనం కోసం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న లోకాయుక్త జడ్జి దంపతులకు మరియు వారి కుటుంబ సభ్యులకు దేవస్థాన అధికారులు మర్యాదపూర్వకంగా ఘన స్వాగతం పలికారు. ఆలయ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (డీఈఓ) కిషోర్ కుమార్ స్వయంగా హాజరై, జడ్జి గారి కుటుంబానికి అమ్మవారి అంతరాలయ దర్శన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. లోకాయుక్త జడ్జి మరియు వారి కుటుంబ సభ్యులు కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనము అనంతరం వేద పండితులు వారికి వేదాశీర్వచనం అందించగా, డెప్యూటీ ఈఓ కిషోర్ కుమార్ అమ్మవారి శేష వస్త్రం, పవిత్ర తీర్థ ప్రసాదాలు మరియు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి యున్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## "న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తా "

- కాలయాపన తప్ప సమస్య పరిష్కరించేలా జోగి రమేశ్ ప్రవర్తించలేదు
- జోగి రమేశ్ తనపై చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయన్న మేఘన
- తన దగ్గర ఉన్న ఆధారాలు అన్నీ పోలీసులకు అందజేశా



ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

తనపై సోమవారం మాజీ మంత్రి జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయని ఆయన కోడలు మేఘన పేర్కొంది. అసలు వాస్తవాలు ఏంటో ఎఫ్ఐఆర్‌లోనే పొందుపరిచానని చెప్పింది. తన దగ్గర ఉన్న ఆధారాలు అన్నీ పోలీసులకు అందజేశానని, తనకు న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తానని స్పష్టం చేసింది. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు.'జోగి రమేశ్ దంపతులనే సొంత అమ్మానాన్నా అనుకున్నాను. మా భార్యాభర్తల సమస్యను పరిష్కరించకుండా వివాదం సృష్టించారు. మా పుట్టింటి వారికి ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదు. పెళ్లైన నెలకే ఆషాడం వచ్చింది. అదనపు కట్నం తెస్తేనే నువ్వు హ్యాపీగా ఉంటావు అని మా అత్త అన్నారు. వివాహానికి ముందు వాళ్లు హిందువులని చెప్పారు. వాళ్లు క్రైస్తవులని నాకు పెళ్లయ్యాక తెలిసిందని' మేఘన ఆరోపించింది.ఇంట్లో అసలు హిందూ పూజలు జరిగేవి కాదు. జోగి రమేశ్ వాళ్ల ఇంట్లో అసలు పూజ గదే లేదు. క్రైస్తవం పాటించడం తప్పు కాదు. కానీ దాచి పెట్టి పెళ్లి చేయడం తప్పు. మా అత్తింట్లో బైబిల్ చదివినా నేను పట్టించుకోలేదు. మా అత్తయ్య హిందూ దేవుళ్లపై అభ్యంతరకరంగా మాట్లాడేవారు. హిందూత్వం వదిలేసి క్రైస్తవంలోకి వచ్చేయమని అనేవారు. కొడుకు సమస్య ఏంటో తెలిసి కూడా మా అత్తయ్య ఈ పెళ్లి చేశారు. మా అత్తయ్య నాకు పెట్టింది గోరుముద్దలు కాదు విషపుముద్దలు.ఎఫ్ఐఆర్‌లోని ప్రతి ఆరోపణకు నా వద్ద ఆధారాలు ఉన్నాయి. సమయం వచ్చినప్పుడు ప్రతి ఆధారం మీ ముందు ఉంచుతానని మేఘన తెలిపారు.వసంతకృష్ణ ప్రసాద్ దగ్గరకు వెళ్లినమాట వాస్తవమేనని, న్యాయం కోసం ఆయన దగ్గరకు వెళ్లానని మేఘన చెప్పింది. తాము ఫిర్యాదు చేసేందుకు సీపీ వద్దకు వెళ్లినట్లు తెలిపింది. కేసు పెట్టవద్దని తమ లాయర్‌తో మధ్యవర్తిత్వం జరిపారని, సజ్జల రామకృష్ణారెడ్డి వద్ద సెటిల్ చేసుకుందామని చెప్పినట్లు వివరించింది. రాజీ చేసుకోవాలని సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారని, తానున్నానని న్యాయం చేస్తానని సజ్జల చెప్పారని వెల్లడించింది. కాలయాపన తప్ప సమస్య పరిష్కరించేలా జోగి రమేశ్ ప్రవర్తించలేదని ఆరోపించింది. వైఎస్ జగన్‌ను కూడా కలిసే ప్రయత్నం చేశానని కానీ కుదరలేదని వ్యాఖ్యానించింది.లి"వివాహమైనా రెండు నెలలకే రాజీవ్ నాపై నల్ అండ్ వాయిడ్ కేసు వేశాడు. వివాహమైనా రెండు నెలలకే విడాకుల కోసం రాజీవ్ ఎందుకు వెళ్లాడు? ఆయన విడాకుల కోసం వెళ్లాడని నాకు ఆలస్యంగా తెలిసింది. విడాకుల కోసం రాజీవ్ వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. నన్ను వదిలించుకునేందుకు అనేక కట్టుకథలు చెప్పారు. కుమారుడికి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తామని నన్ను పుట్టింటికి వెళ్లమన్నారు. ట్రీట్‌మెంట్ పేరు చెప్పడంతో నేను అత్తింటికి చుట్టపు చూపుగా వెళ్లేదాన్ని. మా తప్పు లేకుండానే ఏడాదిన్నరగా మానసిక క్షోభ అనుభవిస్తున్నామని మేఘన చెప్పుకొచ్చారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

- పార్టీ శ్రేణులకు వైయస్ జగన్ పిలుపు
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే కచ్చితంగా కూటమి వ్యతిరేక ఓటు
- వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం
- వైయస్ జగన్ స్పష్టీకరణ
- వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో శ్రీ వైయస్ జగన్ సమావేశం.
- పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు హాజరు.
- స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై సమావేశంలో వైయస్ జగన్ దిశానిర్దేశం.



ప్రజాభూమి ప్రతినిధి–తాడేపల్లి

స్థానిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్దం కావాలని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు పార్టీ కార్యకర్తల కోసం నిలబడాల్సిన ఎన్నికలు అని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగితే వెన్నుపోటు పార్టీ కూటమికి వ్యతిరేక ఓటు తప్పదని తేల్చి చెప్పారు. వెన్నుపోటు పార్టీ కూటమి రెండేళ్ల పాలనపై ఇప్పటికే ప్రతి ఇంటా చర్చ మొదలైందని, ప్రజలంతా ఈ పాలనను, గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వ అయిదేళ్ల పాలనను పోల్చి చూస్తున్నారని వెల్లడించారు. స్థానిక సంస్థల పదవులకు ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు జరపాలన్న ప్రభుత్వ నిర్ణయం నేపథ్యంలో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపాలని నిర్దేశించారు. అప్పుడే పార్టీ ఇతర ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ, బలం లాభిస్తుందని వెల్లడించారు. ఇంటింటికీ వైయస్సార్‌సీపీ ఇంకా బలంగా చేరాలన్న వైయస్ జగన్, ఆ దిశలో స్థానిక ఎన్నికల కోసం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించారు.

వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో వైయస్ జగన్ సమావేశం అయ్యారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లు ఈ సమావేశానికి హాజరు కాగా.. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధతపై వైయస్ జగన్ దిశానిర్దేశం చేశారు.సమావేశంలో వైయస్ జగన్ ఇంకా ఏమేం మాట్లాడారంటే..:

మనం అందరం ఇక్కడ ఎందుకు సమావేశం అవుతున్నామో మీ అందరికీ తెలుసు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. వాటిని మనం కూడా సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఈ ఎన్నికలు జరుగుతాయా? లేదా? తెలియడం లేదు. ఒకవైపు 44 లక్షల ఓట్లు గల్లంతయ్యాయని చెబుతున్నారు. 'సర్' రిపోర్టు కూడా అదే చెబుతోంది. మరోవైపు ఆ 44 లక్షల మందిని కలిపి ఓటర్ల జాబితా తయారు చేస్తున్నారు. అంటే లేని ఓట్లు ఉన్నట్లుగా చూపుతున్నారు. అది చట్టప్రకారం నేరం.

రెండోవైపు పట్టణ స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అంశం. గతంలో మనం ఇవ్వాలనుకుంటే, కోర్టు కొట్టేసింది. పక్కన తెలంగాణలో కూడా కోర్టు దాన్ని కొట్టేసింది. అయినా దానిపై చంద్రబాబుగారు కావాలని జీఓ ఇచ్చి, ఎన్నికలకు వెళ్తున్నాడు. అంటే అక్కడ ఒక స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కావాలని జీఓ ఇచ్చి డ్రామా చేస్తున్నారు. ఎందుకంటే కోర్టు కొట్టేస్తుంది కాబట్టి. ఇవన్నీ చూస్తుంటే, చంద్రబాబు అసలు స్థానిక ఎన్నికలు జరుపుతాడా? అనేది అనుమానం వస్తోంది. అయినా, ఎన్నికలు జరుగుతాయన్న ఆలోచనతోనే మనం సిద్దం కావాలి. ఆ దిశలో ముందుకు సాగాలి. పోరాడాలి.

2024 మార్చి 16న ఎన్నికల కోడ్ వచ్చింది. ఆ తర్వాత ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి మనం దాదాపు 30 నెలలుగా ప్రతిపక్షంగా ఉన్నా, గ్రామస్థాయి వరకు పార్టీని బలంగా నిర్మించుకోగలిగాం. తొలిసారిగా గ్రామస్థాయిలో కమిటీలు కూడా ఏర్పాటు చేసుకున్నాం. అలా ఒక పటిష్టమైన నాయకత్వాన్ని గ్రామస్థాయిలో నిర్మించుకోగలిగాం. ఇది ఒక మంచి కార్యక్రమం. ఈ రెండున్నర ఏళ్లలో చేయగలిగాం.

మరోవైపు ఈ రెండున్నర ఏళ్ల చంద్రబాబుగారి పాలన చూస్తున్నాం. దానిపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది. ఆయన పరిపాలన అందుకు అలా ఊతం ఇచ్చింది. చంద్రబాబుగారి రెండున్నర ఏళ్ల పాలన ఎలా ఉంది? అంతకు ముందు మన పరిపాలన ఎలా ఉంది? అన్న దానిపై ప్రతి ఇంట్లో చర్చ జరుగుతోంది.

మ్యానిఫెస్టోను ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్‌లా భావించి 99 శాతం అమలు చేశాం. పూర్తి పారదర్శకతతో పాలించాం. ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించి, ఇంటి గడప వద్దే ప్రభుత్వ సేవలు అందించాం. ఎక్కడా అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలు అందించాం. ఆ విధంగా ఒక గొప్ప పాలన దేవుడి దయ వల్ల ఇవ్వగలిగాం. ఎన్నికల్లో ఒక మాట చెబితే, ఒక విషయాన్ని మ్యానిఫెస్టోలో పెడితే, దాన్ని తూచ తప్పకుండా అమలు చేసి చూపాం. అసెంబ్లీ సమావేశాలు, బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నప్పుడే, ఒక షెడ్యూల్ ప్రకటించి, పథకాలు అమలు చేశాం. ఇది ఒక్క వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని గర్వంగా చెప్పగలుగుతాం.కళ్ల ఎదుట కనిపిస్తున్న సంస్కరణలు. మార్పులు. ప్రభుత్వ బడుల్లో నాడు–నేడు ద్వారా పూర్తి మార్పులు చేశాం. 6వ తరగతి నుంచి డిజిటల్ బోర్డులు, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చాం. మూడో తరగతి నుంచే టోఫెల్ శిక్షణ. ఇంకా బైజూస్ కంటెంట్.ఇంకా గ్రామస్థాయిలో చూస్తే ఎన్నో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. గ్రామంలో విలేజ్ క్లినిక్స్. ఆరోగ్యశ్రీలో 3300కు పైగా ప్రొసీజర్లు. రూ.25 లక్షల వరకు ఫ్రీ ట్రీట్‌మెంట్. నాడు దేశంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 60 శాతం స్పెషలిస్టుల కొరత ఉంటే, మన దగ్గర అది కేవలం 4 శాతం మాత్రమే. ఆ స్థాయిలో ఆస్పత్రుల్లో నియామకాలు జరిపాం. మన హయాంలో ఆస్పత్రుల్లో జీరో వెకెన్సీ.వ్యవసాయంలోనూ ఎన్నో మార్పులు తెచ్చాం. ప్రతి ఎకరాకు ఈ––క్రాప్ చేశాం. ఉచిత పంటల బీమా అమలు చేశాం. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ప్రతి అడుగులో రైతులకు తోడుగా నిలబడ్డాయి. ప్రతి పంటకు కచ్చితమైన గిట్టుబాటు ధర కల్పించాం. సీఎం–యాప్ ద్వారా పంటల ధరలపై ఎప్పటికప్పుడు సమీక్ష. జేసీ స్థాయి అధికారితో మార్కెట్ జోక్యం చేసుకున్నాం. తద్వారా పంటల కొనుగోలులో పోటీ ఏర్పడి, రైతులకు మేలు జరిగింది. అలా 5 ఏళ్లలో రూ.7800 కోట్లతో పంటల కొనుగోలు చేయడం జరిగింది.సుపరిపాలన, మహిళా సాధికారత, విద్య, వైద్యంలో ఎప్పుడూ చూడని మార్పులు. కొత్తగా 17 మెడికల్ కాలేజీలు, 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు. కర్నూలు, విశాఖలో కొత్త ఎయిర్‌పోర్టులు. శ్రీకాకుళం జిల్లా ఉద్ధానంలో డయాలసిస్ వైద్యం. రూ.600 కోట్లతో మంచినీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేశాం. ఉద్ధానంలో అత్యుత్తమ వైద్య సేవలందించాం. డయాలసిస్ సేవలు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్. ఆస్పత్రి ఏర్పాటు చేశాం. అలా ప్రతి సమస్యకు పరిష్కారంగా శాశ్వత చర్యలు చేపట్టాం.అలా ఆ అయిదేళ్లలో మన పరిపాలన సాగింది. మరోవైపు ఈ రెండున్నర ఏళ్ల చంద్రబాబు పాలన చూస్తే.. అంతా మోసం. దగా. కనిపిస్తుంది. గత ఎన్నికల ముందు చంద్రబాబుగారు ఏమన్నారు?. జగన్ ఇచ్చేవి కాకుండా, అంతకు మించి ఇస్తామన్నాడు. అమ్మ ఒడి మనం ఒకరికి ఇస్తే, ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి పథకం ఇస్తానన్నాడు. ప్రతి ఇంటికి బాండ్లు పంపారు. చంద్రబాబు, పవన్ ఇద్దరూ దానిపై సంతకాలు చేశారు. ఏ పథకంలో ఆ ఇంట్లో ఎంత లబ్ధి కలుగుతుంది.. అని లెక్కల చెప్పి నమ్మించారు. మన కంటే మూడింతలు ఎక్కువ ఇస్తామన్నారు. మనం చేయూత కింద ఏటా రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో రూ.75 వేలు ఇచ్చాం. పలు మల్టీ నేషనల్ కంపెనీలు తెచ్చి, వారికి తోడుగా నిలబడ్డాం. ఇక చంద్రబాబు ఏం చెప్పారు. ఇంట్లో 50 ఏళ్లు నిండిన వారుంటే నెలకు రూ.4 వేల చొప్పున ఏటా రూ.48 వేలు ఇస్తామన్నాడు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పున, ఏటా రూ.36 వేలు ఇస్తామన్నాడు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. అలా అన్నీ ఇస్తామని చెప్పి నమ్మించారు. ఆ తర్వాత మోసం చేశారు. ప్రజలు దాన్ని గుర్తించారు. అందుకే ఈరోజు ప్రతి ఇంట్లో వాటిపై చర్చ జరుగుతోంది. ఒకవైపు అన్నీ వైఫల్యాలు. మరోవైపు అరాచక పరిస్థితి. యథేచ్ఛగా రెడ్‌బుక్ అమలు. స్కూళ్లు నాశనం అయ్యాయి. ఆరోగ్యశ్రీ నిర్వీర్యం చేశారు. పథకంలో వైద్య సేవలు అందడం లేదు. విద్య, వైద్య రంగాలు మొత్తం నాశనం అయ్యాయి. మహిళలకు సున్నా వడ్డీ రుణాలకు మంగళం పాడారు. ఇక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు. అరెస్టులు. భయపెట్టి లొంగ దీసుకునే పరిస్థితి.ఇలాంటి పరిస్థితుల మధ్య స్థానిక ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రజలు మనవైపు ఉన్నారు. ఎన్నికలు ఫ్రీగా, ఫెయిర్‌గా ఎన్నికలు జరిగితే అధికార పార్టీ కూటమికి ఘోర పరాజయం తప్పదు. కానీ, ఇటీవల కొన్ని స్థానిక సంస్థల ఎన్నికల ఉప ఎన్నికలు చూశాం. వాటిలో చంద్రబాబుగారు ఏ విధంగా దౌర్జన్యం చేశారో చూశాం. కార్పొరేషన్లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఏమేం చేశారో? ఎన్ని దౌర్జన్యాలు చేశారో? ప్రత్యక్షంగా చూశాం.అందుకే మనం చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అప్రమత్తంగా వ్యవహరించాలి. కార్యకర్తల కోసం మనం గట్టిగా పని చేయాలి. అధికార పక్షం వాళ్లు ఎంత దౌర్జన్యం చేసినా, మా నాయకుడు నాతో ఉన్నాడన్న నమ్మకాన్ని మీరు కార్యకర్తలకు కల్పించాలి. చంద్రబాబు ఎన్ని దౌర్జన్యాలు చేసినా, మాకు మా నాయకుడు ఉన్నాడు అనే భావన, నమ్మకం మీరు కార్యకర్తల్లో కల్పించాలి. అలా చేస్తేనే, రేపు ఎన్నికల్లో వారు మీకు తోడుగా నిలబడతారు.స్థానిక సంస్థల పదవులకు సంబంధించి ప్రత్యక్ష ఎన్నికలకు చంద్రబాబుగారు సిద్ధమవుతున్నారు. అది ఒక విధంగా మంచిదే. ఒక బలమైన అభ్యర్థి అక్కడ నిలబడితే, మిగిలిన స్థానాలపై అతడు దృష్టి పెట్టొచ్చు. పోటీలో గట్టిగా నిలబడతాడు. ఆ బలమైన అభ్యర్థి.. మిగిలిన చోట్ల బలాన్ని ఇవ్వాలి. అలాగే అతడు సూపర్‌విజన్ కూడా చేయాలి. అలా చేయగలిగితే, మనం ఎన్నికల్లో గట్టిగా నిలబడతాం. అంతే కాకుండా పార్టీ ఇతర ప్రజా ప్రతినిధులు పర్యవేక్షణ, బలం లాభిస్తుంది.మీ నియోజకవర్గాల్లో.. ఎక్కడ కూడా మన పార్టీ అభ్యర్థి పోటీ చేయని పరిస్థితి రాకూడదు. అలా మన పార్టీ అభ్యర్థి నిలబడకుండా, పోటీలో లేకుండా ఉంటే, అక్కడ ఏకగ్రీవ ఎన్నిక జరిగితే నన్ను అడగాల్సిన పని లేదు. మీరు ఆ తర్వాత ఎన్నికల్లో నిలబడరు. అంటే, టికెట్ దక్కదు. అందుకే పరిస్థితులు ఎలా ఉన్నా, స్థానిక ఎన్నికల్లో ప్రతిచోటా మనం అభ్యర్థులను నిలపాలి. మన కార్యకర్తలకు తోడుగా నిలబడాలి. పోరాడాలి. అప్పుడే వారు ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో వారు మీకు తోడుగా ఉంటారు.స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ రూపొందించిన మెటీరియల్ (బుక్‌లెట్) 'వెన్నుపోటు పార్టీ. వెన్నుపోటు పాలన' అనేది ప్రతి ఊళ్లో, ప్రతి ఇంటికి వెళ్లాలి. మన పాలన, చంద్రబాబు పాలన మధ్య తేడా చెప్పాలి. ఇవన్నీ కూడా మీ ద్వారానే పార్టీ కొనసాగిస్తుంది. ఈ ప్రక్రియ ఒక పద్ధతి ప్రకారం జరుగుతుంది.ఇంకా గుర్తింపు కార్డులు రెడీ అవుతున్నాయి. దాదాపు 15 లక్షల కార్డులు రెడీ అవుతున్నాయి. జిల్లా, నియోజకవర్గాలు, మండలస్థాయిలో ఆ కార్డుల పంపిణీ జరుగుతుంది. అదే విధంగా బుక్‌లెట్ మెటీరియల్ కూడా ఇవ్వబడుతుంది. ఇవన్నీ క్యూఆర్ కోడ్ ద్వారా అందుబాటులో ఉంటాయి కాబట్టి.. ప్రతి ఒక్కరూ తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ప్రతి నియోజకవర్గంలో ప్రతి ఎమ్మెల్యే కూడా లీగల్‌సెల్, మీడియాసెల్ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలి. ఎందుకంటే చంద్రబాబు దౌర్జన్యం చేస్తాడు. మన పార్టీ వారిని వేధిస్తాడు. కాబట్టి మన క్యాడర్‌ను, కార్యకర్తలను కాపాడుకోవాలి. అందు కోసం మీరు మంచి టీమ్‌తో లీగల్‌సెల్‌ను పక్కాగా ఏర్పాటు చేసుకోవాలి. అదే విధంగా మీడియాసెల్ కూడా పటిష్టంగా ఏర్పాటు చేసుకోవాలి. ఎందుకంటే మీరు ప్రెస్‌మీట్స్‌లో తరుచూ మాట్లాడాలి. మనం చేసిన మేలు, సంక్షేమం చెబుతూ పార్టీని ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలి. ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి. కాబట్టి తప్పనిసరిగా మీడియాసెల్స్ ఏర్పాటు చేసుకోవాలి.అదే విధంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను బాగా ఉపయోగించుకోవాలి. ఎలా ఎకౌంట్ ఓపెన్ చేయాలి. ఎలా యాక్టివేట్ చేయాలి. ఎలా నడిపించాలనే దానిపై శిక్షణ ఇవ్వాలి. ఎందుకంటే ఇప్పుడు మనం పూర్తిగా దిగజారిపోయిన నెగటివ్ మీడియా ఈనాడు, ఏబీఎన్ వాటితో పోరాడుతున్నాం. మీకు మీరుగా బలంగా ఎదిగేందుకు, మరింతగా ప్రజల్లోకి వెళ్లేందుకు, పార్టీ ఇంకా బలంగా మారడానికి మీరు తప్పనిసరిగా.. లీగల్‌సెల్, మీడియాసెల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ను పక్కాగా ఏర్పాటు చేసుకోవాలి. మీరు నియోజకవర్గస్థాయిలో పని చేస్తూ, జిల్లా స్థాయి, ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవాలి. ఇప్పటి వరకు దీంట్లో యాక్టివ్‌గా లేని వారు వెంటనే వాటి ఏర్పాటు చేసుకోవాలి.ఇక రెండో అంశం. ఇంటింటా ప్రచారం. ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లాలి. మన ప్రభుత్వ హయాంలో ఏయే మంచి చేశామనేది చెప్పాలి. వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వం చేసిన దగా, వంచన వివరించాలి.మరోవైపు బలమైన అభ్యర్థి నిలబడాలి. ఆ అభ్యర్థి అందరినీ కలుపుకుపోవాలి. ఎక్కడా ఇగోకు వెళ్లొద్దు. ఎందుకంటే ఎన్నికల్లో ప్రతి ఒక్క ఓటు ఎంతో కీలకం. కేవలం 9 ఓట్లతో ఓడినవారు, గెల్చిన వారు కూడా ఉన్నారు.ఎన్నికల్లో గెలుపు ముఖ్యం. ఎందుకంటే.. జో జీతా వహీ సికందర్. కాబట్టి వచ్చే 60, 70 రోజులు మీరు మీ నియోజకవర్గాలు దాటి వెళ్లొద్దు. అందరినీ కలవండి. వ్యవస్థలు పక్కాగా ఏర్పాటు చేసుకొండి.పోలీసులకు కూడా గట్టిగా చెప్పండి. అన్యాయం చేస్తే, వదిలిపెట్టబోమని చెప్పండి. చూస్తుండగానే మూడో ఏడాదిలోకి వచ్చాం. కాబట్టి వచ్చేది మన ప్రభుత్వమే. ఆ తర్వాత మీరు ఎక్కడున్నా, రిటైర్ అయినా వదిలిపెట్టబోమని చెప్పండి. వారిలో న్యూట్రాలిటీ తీసుకురావడానికి ప్రయత్నించండి. వారి వివరాలు డిజిటల్ డైరీలోకి ఎక్కించండి. అప్పటికి వారు మారకపోతే మనం చేసేదేమీ లేదు.మొత్తం అయిదు అంశాలతో పార్టీ సంస్థాగత సమావేశాల షెడ్యూల్ ఖరారు చేయడం జరిగింది. ఇదీ ఆ షెడ్యూల్.

**1. చంద్రబాబు పాలన వైఫల్యాలు**
**2. మన 5 ఏళ్ల పాలన. సంక్షేమం, సంస్కరణ. ప్రజలకు చేసిన మేలు.**
**3. క్యాడర్‌ను మోటివేట్ చేసి, ఎన్నికలకు సిద్ధం చేయడం**
**4. ఐడీ కార్డుల పంపిణీ**
**5. మండల, గ్రామ, వార్డు స్థాయిలో ఇంటింటా ప్రచారం.**

సెప్టెంబరు 5, 6, 7 తేదీల్లో జిల్లా స్థాయి సమావేశాలు. ఇందులో పార్టీ జిల్లా స్థాయి నాయకులు.. అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జ్‌లు, జిల్లా స్థాయిలో అన్ని కమిటీల ఇంఛార్జ్‌లు, పార్టీ సీనియర్ నాయకులు, జడ్పీ ఛైర్మన్లు, మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు పాల్గొంటారు.ఆ తర్వాత సెప్టెంబరు 8, 9, 10, 11 తేదీల్లో అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో సమావేశాల నిర్వహణ. వీటిలో నియోజకవర్గ స్థాయి పార్టీ నేతలు, ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.సెప్టెంబరు 12 నుంచి 22 వరకు మండల, వార్డు స్థాయి సమావేశాలు జరుగుతాయి. ఇందులో గ్రామ, వార్డు స్థాయి నుంచి కూడా నాయకులు పాల్గొంటారు. ఆ తర్వాత ఇంటింటి ప్రచారం. అంటే సెప్టెంబరు 23 నుంచి ఆ కార్యక్రమం కొనసాగుతుంది. అక్కడ 'వెన్నుపోటు పార్టీ. వెన్నుపోటు పాలన' బుక్‌లెట్ పంపిణీ చేయడం జరుగుతుంది. ఇక్కడ విలేజ్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు అందరూ పాల్గొంటారు. అంటే మొత్తం మీద, సమావేశాలు సెప్టెంబరు 5న ప్రారంభమై 22వ తేదీ వరకు జరుగుతాయి. సెప్టెంబరు 23 నుంచి ఇంటింటి ప్రచారం మొదలుపెడతాం.ప్రతి చోటా అభ్యర్థుల ఎంపిక ఇప్పటి నుంచే మొదలుపెట్టండి. పార్టీ కోసం గట్టిగా పని చేసే వారిని ఎంపిక చేయండి. రిజర్వేషన్ల ఖరారు తర్వాత, మారితే చూడొచ్చు. అంతేకానీ, అప్పుడు అభ్యర్థుల కోసం వెతికితే అంతగా ప్రయోజనం ఉండదు. జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో మీరు స్వయంగా హాజరై గుర్తింపు కార్డులు, మెటీరియల్ పంపిణీ చేయాలి. వాటికి సంబ్యంధించి, తగిన విధంగా నిర్దేశం చేయాలి. ప్రతిచోటా మీ ప్రమేయం ఉండాలి.

స్థానిక ఎన్నికల్లో పార్టీతో పాటు, అభ్యర్థి కూడా చాలా ముఖ్యం. ఎందుకంటే వారిపై ప్రజలకు ఎక్కువ దృష్టి ఉంటుంది. అందుకే అందరికీ ఆమోదయోగ్యమైన వారిని ఎంపిక చేయాలి. ఏకాభిప్రాయంతో అభ్యర్థుల ఎంపిక జరిగేలా చూడాలని, వీలైనంత వరకు అభ్యర్థుల ఎంపికలో ఏకాభిప్రాయం వచ్చేలా చొరవ చూపాలని వైయస్ జగన్ నిర్దేశించారు.